## మీడియా కమ్యూనికేషన్ డైరెక్టర్‌గా కర్రి శ్రీరాం

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ మీడియా కమ్యూనికేషన్స్ డైరెక్టర్ జర్నలిస్టు కర్రి శ్రీరాంను నియమిస్తు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన రెండేండ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని ఈవో స్పెషల్ సెక్రటరీ ఎం హనుమంతరావు స్పష్టంచేశారు.

## ఓవర్ డ్యూటీ.. ఓవర్ లోడ్!

- అయోమయంలో టీజీఆర్టీసీ సిబ్బంది

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీలో డ్రైవర్ డ్యూటీ 8 గంటలే.. సిబ్బంది కొరత కారణంగా ఒక్కొక్కరు సుమారు 14 గంటల పాటు పనిచేస్తున్నారు. శారీరకంగా, మానసికంగా అలసిపోతున్నారు. ఇదే దశలో ముందుచూపు లేకుండా రాష్ట్ర సర్కారు అమలుచేసిన మహాలక్ష్మి పథకంతో బస్సులు ఓవర్‌లోడ్‌తో నడపాల్సి వస్తున్నది. ఇటీవల ప్రయాణికుల ఓవర్‌లోడ్ కారణంగా నడుస్తున్న బస్సుల చక్రాలు, పరికరాలు ఊడిపోయాయి. దీంతో ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి దాపురించింది. 50 మంది ఎక్కాల్సిన కరీంనగర్ డిపో బస్సులో 170 మంది ఎక్కారు. ఓవర్‌లోడ్ కారణంగా బస్సు వెనుకాల రెండు టైర్లు ఊడిపోయాయి. ఈ సమయంలో బస్సులో ఎక్కువ మంది మహిళలు, పిల్లలే ఉన్నారు. నారాయణపేట జిల్లా ఉట్కూరులో బస్సు రన్నింగ్‌లో ఉండగా బస్సు పార్టులు ఊడిపోయి రోడ్డుపైన పడ్డాయి. ఆయా ఘటనల్లో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే.. తలుచుకుంటేనే ఒళ్లుగగుర్పొడుస్తున్నది. ఈ రెండు చోట్లే కాకుండా మరికొన్ని చోట్ల ఓవర్‌లోడ్ కారణంగా ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఆర్టీసీలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 600 వరకు డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటి భర్తీ విషయంలో జాప్యం జరుగుతుండటంతో ఉన్న డ్రైవర్లపై పనిఒత్తిడి పెరుగుతున్నది. రద్దీకి అనుగుణంగా 3 వేల కొత్త బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేయాలని కార్మికుల జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, ప్రతినిధి థామస్ రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. అప్పుడే కొంత ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు.

## పొచ్చర వాగులో ముగ్గురు సోదరుల మృతి

ఆదిలాబాద్, ఆగస్టు 27 ( నమస్తే తెలంగాణ) : చేపలవేటకు వెళ్లిన మహారాష్ట్రకు చెందిన ముగ్గురు అన్నదమ్ములు మృతి చెందిన ఘటన ఆదిలాబాద్ జిల్లాలో జరిగింది. మహారాష్ట్ర నాందెడ్ జిల్లా నవీ అబాదికి చెందిన నాగుల్ వాడే విజయ్ (28), నాగుల్ వాడే ఆకాశ్ (26), నాగుల్ వాడే అక్షయ్ ( 24) తాంసి మండలం బండల్‌నాగాపూర్‌లో వారి బంధువు శ్రీనివాస్ ఇంటికి వచ్చారు. మంగళవారం ఈ ముగ్గురు చేపలవేట కోసం ఆదిలాబాద్ రూరల్ మండలం పొచ్చర వాగులోకి వెళ్లారు. వాగులో దిగి చీరతో చేపలు పడుతుండగా లోతు తెలియకపోవడంతో అక్షయ్ వాగులో మునిగిపోయాడు. అతడిని కాపాడేందుకు ఆకాశ్, విజయ్ ప్రయత్నించగా వారు సైతం నీటిలో మునిగిపోయారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు డీడీఆర్‌ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని 5 గంటల పాటు శ్రమించి ముగ్గురు యువకుల మృతదేహాలను వెలికితీశారు. పోస్టుమార్టం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

# అధికారిక నిర్ణయమా? అనధికార నిర్లక్ష్యమా?

- రాజముద్రలో కళాతోరణం తొలగింపుపై కేటీఆర్ ఫైర్
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని 'ఎక్స్'లో పోస్ట్

వరంగల్, ఆగస్టు 27: తెలంగాణ రాష్ట్ర రాజముద్రలో కాకతీయ కళాతోరణం లేకుండా గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. 'ఇది అధికార నిర్ణయమా? లేక అనధికార నిర్లక్ష్యమా? తెలంగాణలో అసలు ఏం జరుగుతుందో కనీసం మీకైనా తెలుసా సీఎస్ గారు?' అంటూ తన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. తెలంగాణ అస్థిత్వ చిహ్నాలైన కాకతీయ కళాతోరణం, చార్మినార్‌లతో వెకిలి పనులు ఏంటి? కొత్త చిహ్నం ఎవరు? ఎప్పుడు అమోదించారు? ఒకవేళ అమోదించకపోతే అధికారులు దీనిని ఎందుకు వాడారు? దీనికి కారకులెవరో కనుక్కొని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ప్రదాన కార్యాలయం ముందు అధికారులు రాజముద్రలో కాకతీయ కళాతోరణం, చార్మినార్ చిహ్నాలు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఫొటోను ఆయన పోస్ట్ చేశారు.



రాజముద్రలో కళాతోరణం తొలగింపుపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ అకౌంట్‌లో చేసిన పోస్ట్

# పొరపాటును గుర్తించిన బల్దియా

- 'తప్పుడు రాజముద్ర' ఫ్లెక్సీ తొలగింపు
- 'అధికారిక రాజముద్ర' ఫ్లెక్సీ ఏర్పాటు

వరంగల్, ఆగస్టు 27: వరంగల్ బల్దియా అధికారులు తప్పును గుర్తించారు. రెండు రోజుల క్రితం గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ముందు ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌లైన్ పేరిట అధికారికంగా ప్రకటించని రాష్ట్ర రాజముద్రతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై కమిషనర్ అశ్విని తానాజీ వాకడే చర్యలు తీసుకుంటున్నట్టు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బల్దియా టౌన్‌ప్లానింగ్ విభాగం ఉద్యోగులకు మెమో జారీ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాజముద్రను తప్పుగా ముద్రించిన ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన 'ఎక్స్' అకౌంట్‌లో ఫ్లెక్సీతో సహా పోస్ట్ చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. బల్దియా కార్యాలయం ముందు రాజముద్రలో కాకతీయ కళాతోరణం, చార్మినార్‌తో కూడిన కొత్త ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.




అధికారిక రాజముద్రతో కొత్తగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

# 17 నుంచి 'ప్రజా పాలన'

- మరో 10 రోజులు దరఖాస్తుల స్వీకరణ
- రేషన్ కార్డులు, హెల్త్ కార్డులే ఎజెండా
- గోషామహల్‌లో కొత్త ఉస్మానియా దవాఖాన
- ఏడాదిలోగా 15 నర్సింగ్ కాలేజీలకు భవనాలు
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా వచ్చే నెల 17వ తేదీ నుంచి పది రోజుల పాటు ప్రజాపాలన కార్యక్రమం చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు జారీ చేస్తామన్నారు. మంగళవారం ఆయన సచివాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి వివిధ శాఖలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా ఎంచుకున్న స్పీడ్ (స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ) ప్రణాళికలో ఉన్న వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఇకపై రేషన్ కార్డులు, హెల్త్ కార్డులకు సంబంధం ఉండదని, వేర్వేరుగా కార్డులు జారీ చేస్తామని చెప్పారు. ప్రజా పాలనలో భాగంగా ప్రతి కుటుంబం నుంచి వివరాలను సేకరిస్తామని తెలిపారు. ఆరోగ్య శ్రీ వైద్య సేవలకు, సీఎంఆర్‌ఎఫ్ కింద సాయం అందించేందుకు ఇకపై హెల్త్ కార్డు ప్రామాణికంగా ఉంటుందన్నారు. హెల్త్ ప్రొఫైల్‌కు వివరాల సేకరణ, డిజిటల్ కార్డుల జారీకి కార్యాచరణ రూపొందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డెంగ్యూ, చికున్ గున్యా, వైరల్ జ్వరాలతో వివిధ దవాఖానల్లో పెరుగుతున్న కేసులపై ఆందోళన వ్యక్తం చేశారు. తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో ఫాగింగ్, స్ప్రే ముమ్మరం చేయాలని కోరారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీలు చేయాలన్నారు. పని చేయని ఉద్యోగులను, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేపట్టే చర్యల పట్ల ఉదాసీనంగా వ్యవహరించే వారిని సస్పెండ్ చేస్తామని సీఎం హెచ్చరించారు. డెంగ్యూ, చికెన్ గున్యా కేసులు నమోదైన ప్రాంతాలకు కలెక్టర్లు వెళ్లి కారణాలను గుర్తించాలని, అవసరమైన పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.

### స్పీడ్.. పెంచండి

స్పీడ్ జాబితాలో ఉన్న 19 పనుల్లో ఉస్మానియా దవాఖాన కొత్త భవన నిర్మాణం, 15 కొత్త నర్సింగ్ కాలేజీలు, 28 కొత్త పారామెడికల్ కాలేజీలు, జిల్లాల్లో సమాఖ్య భవనాల నిర్మాణాలకు సంబంధించిన ప్రణాళికలపై ముఖ్యమంత్రి చర్చించారు. హైదరాబాద్‌లోని గోషామహల్‌లో ఉస్మానియా హాస్పిటల్ కొత్త భవనాన్ని నిర్మించాలని సీఎం ఆదేశించారు. గోషా మహల్‌లోని పోలీస్ విభాగం అధ్వర్యంలో ఉన్న స్థలాన్ని వెంటనే వైద్యారోగ్య శాఖకు బదిలీ చేయాలని అధికారులను ఆదేశించారు. పేట్లబుర్జులో ఉన్న పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్, సిటీ పోలీస్ అకాడమీ చుట్టూ ఉన్న స్థలాన్ని పరిశీలించాలని, గోషామహల్‌లోని పోలీస్ స్టేడియం, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అక్కడికి తరలించాలని సూచించారు. అనుభవజ్ఞులైన ఆర్కిటెక్ట్‌లతో దవాఖానకు డిజైన్లను తయారు చేయించాలని కోరారు. రాబోయే 50 ఏండ్ల అవసరాలను అంచనా వేసుకొని, కొత్త దవాఖాన నిర్మాణ డిజైన్లు ఉండాలని ఆదేశించారు. కనెక్టివిటీ రోడ్లను అభివృద్ధి చేయాలని, దవాఖాన చుట్టూ నలువైపులా రోడ్డు ఉండేలా డిజైన్ చేయాలని చెప్పారు. అన్ని విభాగాలతోపాటు అకడమిక్ బ్లాక్, నర్సింగ్ ఉద్యోగులకు హాస్టళ్లు కూడా నిర్మించాలన్నారు. ఇప్పుడున్న ఉస్మానియా హాస్పిటల్ భవనాలను చారిత్రక కట్టడాలుగా పరిరక్షిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మించే దవాఖానల పనులను వేగవంతం చేయాలని, 15 నర్సింగ్ కాలేజీ భవనాలను వచ్చే ఏడాదిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు 22 జిల్లాల్లో కొత్త భవనాల నిర్మాణం చేపట్టాలన్నారు. హైదరాబాద్‌లోని శిల్పారామం పక్కనే మహిళా శక్తి సంఘాలకు కేటాయించిన మూడు ఎకరాల స్థలాన్ని వెంటనే ఆ విభాగానికి బదిలీ చేయాలన్నారు. సమీక్షలో సీఎస్ శాంతి కుమారి, వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ అడ్మిషన్ల నిబంధనలను మార్చడంపై హైకోర్టులో విచారణ

స్థానికతపై నేడూ వాదనలు

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించిన నిబంధనలను సవరించి, రూల్ 3ఏ సెక్షన్‌ను చేర్చుతూ ప్రభుత్వం గత నెల 19న జారీచేసిన జీవో 33కి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై మంగళవారం హైకోర్టులో విచారణ జరిగింది. అడ్మిషన్లకు విద్యార్థుల స్థానికతను రాజ్యాంగం ప్రకారంగా నిర్ణయించాలని పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదించారు. నీట్ నోటిఫికేషన్ జారీ అయ్యాక స్థానికతను మార్చడం చెల్లదని పేర్కొన్నారు. స్థానికత వివాదంపై నిరుడు హైకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా జీవో 33 ఉన్నదని తెలిపారు. రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో ప్రవేశాలు పొందాలనుకునే విద్యార్థులు వరుసగా నాలుగేండ్లు తెలంగాణలో చదివి ఉండాలన్న నిబంధన వల్ల స్థానికులకే తీవ్ర నష్టం వాటిల్లుతుందని చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనానికి వివరించారు. ఐఏఎస్, ఐపీఎస్ లాంటి ఉద్యోగులకు బదిలీలు తప్పనిసరని, అలాంటివారి పిల్లలకు స్థానికతను నిరాకరించడం చెల్లదనే తీర్పును పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. దీనిపై ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి స్పందిస్తూ.. అలాంటి అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారిని స్థానిక కోటా కిందనే పరిగణనలోకి తీసుకుంటారని తెలిపారు. ఈ వాదనలు బుధవారం కూడా కొనసాగనున్నాయి.

# ఒద్దిరాజు సోదరులు గొప్ప కవులు

- వారి విగ్రహాలను ట్యాంకు బండ్‌పై పెట్టడానికి కృషిచేస్తా
- టీయూడబ్ల్యూజే మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్



మాట్లాడుతున్న టీయూడబ్ల్యూజే మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్

ఇనుగుర్తి, ఆగస్టు 27: ఒద్దిరాజు సోదరులు సీతారాంచందర్‌రావు, రాఘవ రంగారావు తెనుగు పత్రికను స్థాపించి కవులు, రచయితలుగా తెలంగాణ రాష్ట్రంలో ఖ్యాతి గడించారని టీయూడబ్ల్యూజే మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్ పేర్కొన్నారు. తెనుగు పత్రికను స్థాపించి 102 ఏండ్లు కావడంతో మంగళవారం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలోని రైతువేదికలో ఒద్దిరాజు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఒద్దిరాజు సుభాష్ ఆధ్వర్యంలో తెనుగు దినపత్రిక శతాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్ మాట్లాడుతూ.. సుభాష్ ఆధ్వర్యంలో తెనుగు దినపత్రిక శతాబ్ది వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందని చెప్పారు. బహుభాషా కోవిదుల విగ్రహాలను ట్యాంక్‌బండ్ మీద పెట్టడానికి కృషి చేస్తానని తెలిపారు. సంగీతం, సాహిత్యంతోపాటు వైద్యవిద్యను సైతం నేర్చుకొని స్వయంగా శస్త్రచికిత్సలు చేశారంటే.. వారు అన్ని రంగాల్లో ప్రావీణ్యం పొందారని గుర్తుచేశారు. ఇలాంటి కార్యక్రమాలు ఇనుగుర్తికే పరిమితం కాకుండా హైదరాబాద్ వేదికగా జరగాలని ఆకాంక్షించారు.

## ఏజెన్సీ బంద్ విజయవంతం



ఆదివాసీల కోసం ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ వేయాలని, ఐటీడీ ఏలో బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, జీవో 3ను కొన-సాగించాలనే డిమాండ్లతో ఆదివాసీ సంఘం తుడుం దెబ్బ, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన బంద్ విజయవంతమైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో అన్ని మండలాల్లో వ్యాపారులు దుకాణాలు మూసి బంద్‌కు సహకరించారు. ఆదిలాబాద్ బస్టాండ్ ఎదుట ఆదివాసీ నాయకులు రాస్తారోకో చేశారు. —ఆదిలాబాద్




మహబూబాబాద్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

# ఎమ్మెల్యే సొంతూరిలోనే పవర్ కట్

- కరెంట్ పోయిందని తండావాసులు ఫోన్ చేస్తుండ్రు
- అధికారులు పనిచేయకపోతే సస్పెండ్ చేస్తా
- మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ హెచ్చరిక

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 27: 'మా సొంతూర్లోనే విద్యుత్తు సమస్య తీవ్రంగా వేధిస్తున్నది. మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మండల పరిధిలోని పర్వతగిరి గ్రామంలో రోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు కరెంట్ తీస్తుండ్రు. దీనికి అసలు సమస్య ఏంటో తెలియడం లేదు' అని స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్ పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో విద్యుత్తు అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కొంతమంది అధికారులు ప్రభుత్వానికి చెడ్డ పేరును తీసుకొస్తున్నారని, వారు తీరు మార్చుకొని విధులు నిర్వహించాలని, లేకుంటే వెంటనే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. రాత్రి పూట తండాల్లో కరెంట్ పోతే స్థానికంగా ఉన్న లైన్‌మన్, లైన్ ఇన్‌స్పెక్టర్, ఏఈలు, డీఈలు తమ ఫోన్లను ఎత్తకపోవడం వల్ల ప్రజలు కరెంట్ పోయిందని స్వయంగా తనకే ఫోన్ చేసి చెప్తున్నారని ఫైర్ అయ్యారు. గ్రామాల్లో లూజ్ వైర్లను లాగి ప్రజలకు సమస్యలు రాకుండా చూడాలని సూచించారు.

# పేపర్‌పైనే ఫీవర్ సర్వే!

- వైద్యారోగ్యశాఖ కాకిలెక్కలపై తీవ్ర విమర్శలు
- 34 రోజుల్లో 4.4 కోట్ల మందికి స్క్రీనింగ్
- 1.42 కోట్ల కుటుంబాలను విజిట్ చేసినట్టు లెక్కలు
- రాష్ట్ర జనాభాను మించి ఎలా సర్వే చేశారని ప్రశ్నలు

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నా వైద్యారోగ్య శాఖ నిర్లక్ష్యం వీడటం లేదు. పైగా కాకిలెక్కలతో ప్రజలను మభ్యపెట్టాలని ప్రయత్నిస్తున్నది. సీజనల్ వ్యాధులపై డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ సోమవారం విడుదల చేసిన గణాంకాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే డెంగ్యూ కేసులను, మరణాలను దాచిపెడుతున్నారని ఆరోపణలు ఉండగా.. తాజా గణాంకాలతో ఫీవర్ సర్వేపైనా అనుమానాలు మొదలయ్యాయి. ఇది ఫీవర్ సర్వే కాదని.. 'పేపర్' సర్వే అని వైద్యనిపుణులు, రాజకీయ పక్షాలు, నెటిజన్ల నుంచి విమర్శలు మొదలయ్యాయి. డీపీహెచ్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. గత నెల 23వ తేదీన జ్వర సర్వే ప్రారంభించారు. ఈ నెల 25వ తేదీ నాటికి 1,42,78,723 ఇండ్లను సందర్శించి, 4,40,06,799 మందిని సర్వేచేశారు. ఇందులో 2,65,324 మంది జ్వరబాధితులను గుర్తించారు.

### జనాభాను మించి సర్వే ?

రాష్ట్ర జనాభా దాదాపు 4 కోట్లు. మరి వైద్య సిబ్బంది జనాభాను మించి ఎలా స్క్రీనింగ్ చేశారని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. జ్వర సర్వే ప్రారంభమయినప్పటి నుంచి 34రోజుల్లోనే 4.40కోట్ల మందికి స్క్రీనింగ్ చేశామని చెప్తున్నారు. ఈ లెక్కన రోజుకు 13.75 లక్షల మందికి స్క్రీనింగ్ చేసినట్టని.. ఇది సాధ్యమేనా? అని ప్రశ్నిస్తున్నారు. ఇక 1.42 ఇండ్లను సర్వే చేశామని చెప్పడంపైనా పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే రాష్ట్రంలో దాదాపు కోటి కుటుంబాలు ఉన్నాయని.. రోజుకు 4.20 లక్షల ఇండ్లల్లో సర్వే నిర్వహించినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయని చెప్తున్నారు. ఇదెలా సాధ్యమయ్యిందో వైద్యారోగ్య శాఖ వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. స్వయంగా డీపీహెచ్ ఒకే రోజు డెంగ్యూ కేసుల సంఖ్య, టెస్టుల సంఖ్యపై రెండు రకాల గణాంకాలు విడుదల చేసిన సంగతిని గుర్తు చేస్తున్నారు. ఈ నెల 24న డీపీహెచ్ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఈ నెల 21 నాటికి 66,589 డెంగ్యూ టెస్టులు చేశామని, 4,648 కేసులు నమోదయ్యాయని చెప్పగా, నమస్తే తెలంగాణకు ఇచ్చిన వివరణలో.. 23వ తేదీ నాటికి 63,532 మందికి టెస్టులు చేసి, 4,459 డెంగ్యూ కేసులు నమోదైనట్టు వెల్లడించారు. రెండు రోజుల్లో కేసులు, టెస్టుల సంఖ్య పెరగాల్సిందిపోయి తగ్గినట్టు చెప్పారు. ఇదే తరహాలో జ్వర సర్వే లెక్కల్లోనూ స్పష్టత లేదని మండిపడుతున్నారు. రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో ఉన్న సిబ్బంది ఎంత? ఎంత మందిని సర్వే కోసం నియమించారు? ఒక్కో బృందం రోజుకు సగటున ఎన్ని కుటుంబాలను, ఎంత మంది వ్యక్తులను సర్వే చేసిందో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. అలా కాకుండా.. పేపర్‌పై ఇష్టం వచ్చినట్టు నంబర్లు వేసి రిలీజ్ చేస్తే ఎలా? అని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా వైద్యారోగ్య శాఖ స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

## కరువు ఆకలికి వన్యప్రాణులు బలి

- నమీబియాలో 723 జంతువుల వధకు నిర్ణయం
- వాటి మాంసాన్ని ప్రజలకు పంచనున్న ప్రభుత్వం

విండ్‌హోక్, ఆగస్టు 27: కరువు కోరల్లో చిక్కుకొన్న ప్రజల కడుపు నింపేందుకు 723 వన్య ప్రాణులను వధించాలని నమీబియా సర్కారు నిర్ణయించింది. పరిమితికి ఉంచి ఉన్న వన్యప్రాణులను చంపడానికి నిర్ణయించినట్టు ఆ దేశ పర్యావరణ శాఖ సోమవారం తెలిపింది. తీవ్రమైన కరువు కారణంగా గత నెలలో నమీబియా ఆహార నిల్వల్లో 84 శాతం కరిగిపోయాయి. రానున్న నెలల్లో దేశంలో సగం జనాభా తీవ్ర ఆహార అభద్రతను ఎదుర్కొనే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో 83 ఏనుగలను వధించి వాటి మాంసాన్ని కరువు ఉపశమన కార్యక్రమంలో పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటితోపాటు నీటి గుర్రాలు, గేదెలు, జింకలు, బ్లూ వైల్డ్ బీస్ట్ జింకలు, అడవి గాడిదలను చంపాలని ప్రభుత్వం నిర్ణయించింది.




భూపాలపల్లిలో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

# సింగరేణిలో మళ్లీ ఎన్నికలు జరపాలి

- కార్మికులకు లాభాల్లో 35 శాతం వాటా చెల్లించాలి
- టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 27: సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘాన్ని ఎన్నుకోవడానికి రూపొందించిన నిబంధనల ప్రకారం మళ్లీ ఎన్నికలను నిర్వహించాల్సిందేనని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) కేంద్ర కమిటీ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మిర్యాల రాజిరెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, సింగరేణిలోని 11 డివిజన్లకు చెందిన యూనియన్ ఉపాధ్యక్షులు, కేంద్ర కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాజిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు జరిగిన తర్వాత 45 రోజుల్లోగా గెలిచిన సంఘానికి అధికారిక గుర్తింపు పత్రం జారీ చేయాలని, లేకుంటే గతంలో గెలిచిన సంఘంతోనే సంప్రదింపులు జరపాలని సూచించారు. సింగరేణి వార్షిక లాభాలను తక్షణమే ప్రకటించాలని, లాభాల్లో 35 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేశామని, లాభాల్లో వాటాను పెంచిన విషయాన్ని గుర్తుచేశారు.

# డెంగ్యూ కట్టడిలో మీరు విఫలం!

## వైద్యశాఖ అధికారులపై సీఎం, మంత్రి ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో డెంగ్యూ కట్టడిలో వైద్యారోగ్య శాఖ విఫలమైందని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసినట్టు సమాచారం. మంగళవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సందర్భంగా వైద్యశాఖ ఉన్నతాధికారుల పనితీరుపై సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తుగా కార్యాచరణ రూపొందించుకొని ఎందుకు అమలు చేయలేకపోయారని రేవంత్‌రెడ్డితో పాటు వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా సైతం ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. వేలాదిగా కేసులు నమోదువుతుండటం, విషజ్వరాలు ప్రబలుతున్నా వైద్యసిబ్బందిలో ఇంకా అలసత్వం కనిపిస్తున్నదని అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఇకపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించినట్టు తెలుస్తున్నది. దోమల నియంత్రణకు చర్యలు చేపట్టలేకపోయిన పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి శాఖలపైనా అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. కనీసం ఫాగింగ్ కూడా చేయకపోవడం ఏమిటని మండిపడినట్టు తెలిసింది. శాఖల మధ్య సమన్వయం లేకపోవడం, ముందస్తు ప్రణాళిక అమలు చేయకపోవడం వల్లే రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు ప్రభలుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.


### డెంగ్యూ కట్టడికి స్పెషల్ డ్రైవ్

డెంగ్యూ కట్టడికి స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని మంత్రి దామోదర రాజనర్సింహా అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల కట్టడిపై సచివాలయంలో వైద్యారోగ్య శాఖ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షలో మంత్రి మాట్లాడుతూ డెంగ్యూ కట్టడిపై రాష్ట్రస్థాయిలో డీపీహెచ్ ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశానికి డీపీహెచ్ రవీందర్ నాయక్ హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

### రిజిస్ట్రేషన్ల శాఖలో డీపీసీ ఏర్పాటు

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో పదోన్నతులకు సంబంధించి మంగళవారం డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీని (డీపీసీ) నియమించారు. ఈ మేరకు శాఖ ముఖ్య కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాశ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి సీఐజీ సభ్య కార్యదర్శిగా వ్యవహరించనుండగా, ఎక్సైజ్ శాఖ కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్ -2, సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్-1కు పదోన్నతి పొందే అర్హుతల జాబితాను తయారు చేయనున్నారు.

## విషజ్వరాలతో ఇద్దరి మృతి



లచ్చిరాం (ఫైల్)



అర్జున్ (ఫైల్)

తొర్రూరు/నర్సంపేట, ఆగస్టు 27: విషజ్వరాలతో ఇద్దరు మరణించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని వెంకటాపురం గ్రామ శివారు కేవ్లాతండాలో బానోత్ లచ్చిరాం(54) కొన్ని రోజులుగా తరచూ జ్వరం బారిన పడుతున్నాడు. మూడు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కాగా వరంగల్ జిల్లా నర్సంపేటలో సంకినేని అర్జున్ (17) కొద్ది రోజుల క్రితం జ్వరం వచ్చింది. రోజురోజుకు జ్వర తీవ్రత పెరిగిపోయింది. చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు.

# తూనికలు, కొలతలపై తనిఖీలు ముమ్మరం

నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్

హైదరాఆద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): తూనికలు, కొలతలపై తనిఖీలను ముమ్మరం చేయాలని, అవకతవకలకు పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖమంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఈవోడీబీ( ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్) చట్టం పేరుతో వినియోగదారుల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో జరిగిన తూనికలు, కొలతల శాఖ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తూనికలు, కొలతల శాఖపై వినియోగదారుల్లో చైతన్యం పెంపొందించాలని సూచించారు. పెట్రోల్‌బంక్‌లతో పాటు వేయింగ్ మిషన్లపై నిఘా పెంచాలని చెప్పారు. తూనికలు కొలతల శాఖలో ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమీక్షలో పౌరసరఫరాల శాఖ, తూనికలు కొలతల శాఖ ముఖ్యకార్యదర్శి డీఎస్ హన్, సహాయ కార్యదర్శి ప్రియాంక, అసిస్టెంట్ కంట్రోలర్ రాజేశ్వర్ తోపాటు అసిస్టెంట్ కమిషనర్లు పాల్గొన్నారు.

# తెలంగాణకు ఏటా 200 మెగావాట్ల విద్యుత్తు

- ఎన్‌ఎల్‌సీతో రాష్ట్ర ప్రభుత్వం పీపీఏ చేసుకోవాలి: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్‌ఎల్‌సీ) నుంచి తెలంగాణకు ఏటా 200 మెగావాట్ల సౌరవిద్యుత్తు అందనున్నట్టు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఇండియన్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్ మెంట్ ఏజెన్సీ (ఐఆర్‌ఈడీఏ) పథకంలో భాగంగా ఎన్‌ఎల్‌సీ 510 మెగావాట్ల సామర్థ్యం గల విద్యుదుత్పత్తి కేంద్రాన్ని గుజరాత్‌లోని కచ్ జిల్లా బిబర్ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నదని చెప్పారు. ఈ ప్రాజెక్టు విలువ రూ.1,214 కోట్ల అని, 2025 జూన్ నుంచి విద్యుదుత్పత్తి ప్రారంభమ్యే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఇందులో నుంచి ఏటా తెలంగాణకు 200 మెగావాట్లు సరఫరా చేస్తారన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రూ.2.57 కే కిలోవాట్ అవర్ విద్యుత్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. తద్వారా రాబోయే 25 ఏండ్లలో ట్రాన్స్ కోకు రూ.2 వేల కోట్లు ఆదా అవుతుందని వెల్లడించారు. ప్రాజెక్టుకు సోలార్ ప్యానెళ్లతో పాటు సంబంధిత పరికరాలను తెలంగాణ మార్కెట్ నుంచే కొంటారని చెప్పారు. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా ఎన్‌ఎల్‌సీతో విద్యుత్తు కొనుగోలు ఒప్పందం (పీపీఏ) చేసుకోవాలని సూచించారు.

# జీసీసీల్లో జీతాలు అదుర్స్

**ఐటీ సంస్థల కంటే 20 శాతం వరకు ఎక్కువ**
**ప్రారంభ, మధ్యశ్రేణి ఉద్యోగులకు అధిక డిమాండ్**
**టీమ్‌లీజ్ డిజిటల్ తాజా నివేదికలో వెల్లడి**
**వచ్చే 5-6 ఏండ్లలో కొత్తగా మరో 800 జీసీసీలు**

ముంబై, ఆగస్టు 27: దేశంలో ఉద్యోగార్థుల తొలి ప్రాధాన్యం ఐటీ కొలువులే. లక్షల్లో జీతాలొస్తాయి మరి. అయితే ఈ ట్రెండ్ మారుతోందిప్పుడు. అవును.. గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ)లో ఐటీ సంస్థల కంటే 20 శాతం వరకు ఎక్కువ వేతనాలుంటున్నాయి. ప్రారంభ, మధ్యశ్రేణి ఉద్యోగులకైతే డిమాండ్ అధికంగా ఉంటుంది గమనార్హం. మంగళవారం టీమ్‌లీజ్ డిజిటల్ విడుదల చేసిన నివేదిక ప్రకారం దేశంలో ప్రస్తుతం 1,600లకుపైగా జీసీసీలున్నాయి. వీటిలో 16.6 లక్షలకుపైగా ప్రొఫెషనల్స్ పనిచేస్తున్నారు. ఇక ఆకర్షణీయమైన జీతభత్యాలు వస్తుండటంతో ఇప్పుడు జాబ్ మార్కెట్‌లో జీసీసీలే హాట్ ఫేవరెట్‌గా ఉంటున్నాయి. ప్రతిభావంతులను ఒడిసి పట్టుకోవడానికి ఐటీ కంపెనీలతో పోల్చితే సగటున 12-20 శాతం ఎక్కువగా జీసీసీలు సాలరీలను ఆఫర్ చేస్తున్నట్టు టీమ్‌లీజ్ డిజిటల్ సీఈవో నీతి శర్మ తెలిపారు. ఫ్రెషర్స్‌కూ బంపర్ ప్యాకేజీలు దక్కుతున్నట్టు చెప్తున్నారు.

**కొత్త జీసీసీలతో జోష్**

గత కొన్నేండ్ల నుంచి దేశంలో జీసీసీలు పెద్ద ఎత్తున ఏర్పాటవుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వచ్చే 5-6 ఏండ్లలో 800 కొత్త జీసీసీలు రాబోతున్నాయని తెలుస్తున్నది. దీంతో ఉద్యోగులకు మరింత డిమాండ్ ఏర్పడనుందంటున్నారు జాబ్ మార్కెట్ విశ్లేషకులు. గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా భారత్ మారిందని, ఇక్కడి అనుకూలతలు, పరిమితంగా ఉండే ఖర్చులు, నైపుణ్యం కలిగిన ఉద్యోగులు, వ్యాపారానుకూలాలు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బహుళజాతి సంస్థలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఐటీ, ఫైనాన్స్, రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ రంగాల్లో ఉన్నవారికి ప్రాధాన్యత ఏర్పడుతున్నదని వివరిస్తున్నారు.

**మహిళలకూ పెద్దపీట**

జీసీసీల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో ఇప్పటికే మహిళల వాటా 25 శాతంగా ఉన్నది. 2027కల్లా ఇది 35 శాతానికి పెరుగవచ్చని అంచనా. ఇక జీసీసీల్లో పైథాన్, ఏడబ్ల్యూఎస్, డెవోప్స్, ఎస్ఏపీ, కుబేర్‌నెట్స్, హైపర్‌లెడ్జర్ ఫ్యాబ్రిక్, బ్లాక్‌చైన్, టాబ్లూ, ఎస్క్యూఎల్, సర్వీస్‌నౌ టెక్నాలజీల్లో ప్రవేశమున్నవారికి అవకాశాలు ఎక్కువగా వస్తున్నాయని 'డిజిటల్ స్కిల్స్ అండ్ సాలరీ ప్రైమర్ ఫర్ 2024-25' పేరిట విడుదలైన రిపోర్టులో టీమ్‌లీజ్ డిజిటల్ పేర్కొన్నది. జీసీసీలు, ఐటీ సేవలు, ఐటీయేతర రంగాల్లో ట్రెండ్ ఆధారంగా ఈ నివేదిక తయారైంది. రకరకాల కొలువులపై విశ్లేషణలు చేసినట్టు టీమ్‌లీజ్ ఈ సందర్భంగా తెలియజేసింది.



**ద్వితీయ శ్రేణి నగరాల్లో..**

కోల్‌కతా, అహ్మదాబాద్, వడోదర వంటి ద్వితీయ శ్రేణి నగరాల్లో విస్తరణపై జీసీసీలు ఆసక్తి కనబరుస్తున్నట్టు తాజా నివేదికలో తేలింది. ఇప్పటిదాకా హైదరాబాద్, బెంగళూరు, ముంబై, ఢిల్లీ, చెన్నై వంటి ప్రథమ శ్రేణి నగరాల్లో ఏర్పాటవుతూపైనే జీసీసీ నిర్వాహకులు దృష్టి సారించిన సంగతి విదితమే. దీంతో ఈ పరిణామం దేశీయంగా టెక్ అవకాశాల్లో చోటుచేసుకుంటున్న భౌగోళిక వైవిధ్యానికి అద్దం పడుతున్నట్టు టీమ్‌లీజ్ అభిప్రాయపడింది. ఇదిలావుంటే 10 ఏండ్లలోపు అనుభవం ఉన్నవారికి జీసీసీల్లో ఎక్కువ అవకాశాలు వస్తున్నట్టు స్పష్టమైంది. ఇక వచ్చే ఐదేండ్లలో ఐటీ ఉత్పత్తులు, సేవా రంగాల్లో 25-30 శాతం మేర పెట్టుబడులు పెరిగేందుకు వీలుందని కూడా తాజా రిపోర్టు వెల్లడించింది. 2026కల్లా దేశ జీడీపీలో ఈ రెండు రంగాల వాటా 8 శాతంగా ఉండొచ్చని అంటున్నారు. క్లౌడ్ సొల్యూషన్స్ రాకతో 1.4 కోట్ల ఉద్యోగాలు అందుబాటులోకి రావచ్చన్న అంచనాలూ వినిపిస్తున్నాయి.




## భారత్ బయోటెక్ నుంచి కలరా ఓరల్ వ్యాక్సిన్

హైదరాబాద్, ఆగస్టు 27: రాష్ర్టానికి చెందిన ప్రముఖ ఫార్మా దిగ్గజం భారత్ బయోటెక్..నోటి ద్వారా తీసుకునే కలరా వ్యాక్సిన్ 'హిల్‌కోల్'ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వెల్కమ్ ట్రస్ట్, హిలమెన్ ల్యాబోరేటరీస్ నుంచి లైసెన్స్ పొందిన భారత్ బయోటెక్ ఈ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసింది. ఈ హిల్‌కోల్ వ్యాక్సిన్లను తయారు చేయడానికి హైదరాబాద్‌తో పాటు భువనేశ్వర్‌లో ప్రత్యేక ప్లాంట్లను ఏర్పాటు చేసినట్లు, వీటి ద్వారా ప్రతియేటా 20 కోట్ల డోసులను ఉత్పత్తి చేయబోతున్నట్లు భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎల్లా తెలిపారు. అంతర్జాతీయంగా ఓరల్ కలరా వ్యాక్సిన్‌కు 10 కోట్ల డోసుల డిమాండ్ ఉన్నదని, ఉత్పత్తి మాత్రం ఈ స్థాయిలో లేకపోవడంతో కొరత అత్యధికంగా ఉన్నది. మూడు దఫాలుగా పరిశోధనలు, క్లినికల్ ట్రయల్స్ నిర్వహించిన తర్వాతనే ఈ వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఈ ప్లాంట్లో ఉత్పత్తి చేయడానికి డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా అనుమతినిచ్చినట్లు చెప్పారు. సింగిల్ డోస్ కలిగిన ఈ ఓరల్ వ్యాక్సిన్ 14 రోజుల్లో రెండు సార్లు తీసుకోవాల్సి ఉంటుంది. 2023 నుంచి ఈ ఏడాది మార్చి వరకు ప్రపంచవ్యాప్తంగా 31 దేశాల్లో 8,24,479 కలరా కేసులు నమోదు కాగా, 5,900 మంది మరణించినట్లు తెలిపారు.

## యూపీఎస్ ఓ కొత్త పథకం

**ఎన్పీఎస్‌ను వెనక్కి తీసుకోబోం: నిర్మలా సీతారామన్**

న్యూఢిల్లీ, ఆగస్టు 27: యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యూపీఎస్) అనేది ఓ కొత్త పథకమని, చాలాకాలం ప్రభుత్వ ఉద్యోగులు దీని పట్ల సంతృప్తికరంగా ఉన్నారని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అయినప్పటికీ ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేస్తున్నదని ఆరోపించారు. ప్రస్తుతమున్న నేషనల్ పెన్షన్ స్కీం (ఎన్పీఎస్)ను వెనక్కి తీసుకోవట్లేదని, పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్), ఎన్పీఎస్‌లకు భిన్నంగా యూపీఎస్‌ను తెస్తున్నామని మంగళవారం ఇక్కడ మంత్రి తెలియజేశారు. ఎన్పీఎస్ కంటే యూపీఎస్ ఎంతో బాగుంటుందని, ప్రభుత్వంపైనా దీనివల్ల భారం పడబోదన్నారు. ఈ క్రమంలోనే యూపీఎస్‌ను చాలామంది ఎంచుకుంటారన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. కాగా, ప్రస్తుతం ఎన్పీఎస్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్మెంట్ అయినవారికీ యూపీఎస్‌ను ఎంచుకునే వీలుంటుంది. ఇందులో చివరి 12 నెలలు పొందిన జీతంలోని బేసిక్ పే సగటులో 50 శాతాన్ని నెలనెలా పెన్షన్‌గా తీసుకోవచ్చు. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి యూపీఎస్ అమల్లోకి రానున్నది.

## సీనియర్ సిటిజన్లకు యూబీ అధిక వడ్డీ

ముంబై, ఆగస్టు 27: డిపాజిట్లను ఆకట్టుకోవడానికి యూనియన్ బ్యాంక్ ప్రయత్నాలను వేగవంతం చేసింది. ముఖ్యంగా సీనియర్ సిటిజన్లకు అధిక వడ్డీని ఆఫర్ చేస్తున్నట్లు ప్రకటించింది. రూ. 5 కోట్ల లోపు టర్మ్ డిపాజిట్ స్కీంలో భాగంగా సీనియర్, సూపర్ సీనియర్ సిటిజన్లకు అర శాతం, 75 బేసిస్ పాయింట్లు అధికంగా వడ్డీని చెల్లించనున్నట్లు ప్రకటించింది. సహజంగా బ్యాంక్ డిపాజిట్లపై ఇచ్చే వడ్డీ కంటే ఇది అదనమని పేర్కొంది.




## జూపిటర్ 110 సీసీ స్కూటర్

హైదరాబాద్, ఆగస్టు 27: టీవీఎస్ మరో మాడల్‌ను రాష్ట్ర మార్కెట్లోకి విడుదల చేసింది. 110 సీసీ సామర్థ్యంతో రూపొందించిన జూపిటర్ సరికొత్త వెర్షన్ ధర రూ.77 వేలు ప్రారంభ ధరగా నిర్ణయించింది. ఈ ధరలు హైదరాబాద్ షోరూంనకు సంబంధించినవి. రాష్ట్రంలో స్కూటర్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ నయా స్కూటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అనిరుధా హల్దార్ తెలిపారు. స్మార్ట్ కనెక్టివిటీలో భాగంగా బ్లూటూత్‌తో కాల్, ఎస్ఎంఎస్, నావిగేషన్, వాయిస్ అసిస్ట్ చేసుకోవచ్చును. 4 స్ట్రోక్ 113.3 సీసీ ఇంజిన్, సింగిల్ సిలిండర్, యూఎస్‌బీ మొబైల్ చార్జర్ వంటి ఫీచర్స్ ఉన్నాయి.

## పీపీపీ విధానంలో ఏఐ సిటీ నిర్మాణం

**రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి**



హైదరాబాద్ సిటీ బ్యూరో, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): ఫోర్త్ సిటీలో నిర్మించ తలపెట్టిన ఏఐ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) సిటీని ఐటీ కంపెనీల భాగస్వామ్యంతో పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో నిర్మించనున్నట్టు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. హైసియా మంగళవారం నిర్వహించిన ఏఐ గ్లోబల్ సమ్మిట్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశీయ ఐటీ ఎగుమతుల్లో రెండో స్థానంలో ఉన్న తెలంగాణను మొదటి స్థానంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని, కొత్త టెక్నాలజీలకు అధిక ప్రాధాన్యమిస్తూ యువతలో నైపుణ్యాన్ని పెంపొందిస్తామని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లో ఏఐ టెక్నాలజీ శరవేగంగా విస్తరిస్తున్నదని, దీన్ని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఏఐ టెక్నాలజీకి పెద్దపీట వేస్తున్నదని, అందులో భాగంగానే ఫోర్త్ సిటీలో 200 ఎకరాల్లో ఏఐ సిటీని 200 నిర్మించనున్నామని వివరించారు. సెప్టెంబర్ 5-6 తేదీల్లో జరిగే గ్లోబల్ సమ్మిట్‌లో 2 వేల మందికిపైగా ఏఐ నిపుణులు పాల్గొంటారని, తెలంగాణకు గర్వకారణంగా నిలిచేలా ఈ సదస్సును నిర్వహించనున్నామని శ్రీధర్‌బాబు చెప్పారు. మరోవైపు, 10 వేల మందికి ఏఐలో శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేసినట్టు హైసియా అధ్యక్షుడు ఎన్ ప్రశాంత్ వెల్లడించారు.

## గుజరాత్ నుంచి తెలంగాణకు సౌర విద్యుత్తు

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): గుజరాత్ నుంచి తెలంగాణకు 200 మెగావాట్ల సౌర విద్యుత్తును అందించేలా నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ సంస్థ అంగీకరించింది. కచ్ జిల్లా బిబర్‌లో ఎన్ఎల్‌సీ సంస్థ 510 మెగావాట్ల విద్యుదుత్పత్తి కేంద్రాన్ని రూ.1,214 కోట్లతో నిర్మిస్తున్నది. 2025 జూన్ నుంచి ఈ ప్రాజెక్టు ద్వారా విద్యుదుత్పత్తి ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ సోలార్ ప్రాజెక్టు ద్వారా తెలంగాణకు గంటకు రూ.2.57/కిలోవాట్ చొప్పున విద్యుత్తు అందుబాటులోకి వస్తుంది. వచ్చే 25 ఏండ్లలో రూ.2 వేల కోట్లు రాష్ట్ర ట్రాన్స్‌కోకు ఆదా అవుతుందని అంచనా. ఈ సోలార్ ప్యానెళ్లతోపాటు పరికరాలను తెలంగాణ నుంచే కొంటారు.

# పాపం పండుటాకు

- **వృద్ధురాలి పోషణ పట్టించుకోని కుమారుడు**
- **వీధికుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన రంగవ్వ**
- **108 అంబులెన్స్‌లో దుబ్బాక దవాఖానకు తరలింపు**



దుబ్బాక, ఆగస్టు 27: పాపం పండుటాకు.. ఒక్కగానొక్క కుమారుడు ఆ వృద్ధురాలి పోషణ మరిచాడు. దీంతో కొడుకుకు భారంగా ఉండలేక దూరంగా ఉంటూ ఒంటరిగా జీవిస్తున్నది. సోమవారం అర్ధరాత్రి ఆ వృద్ధురాలిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాకలోని రేపల్లెవాడలో చోటుచేసుకుంది. అయ్యగారి రంగవ్వ (90)కు ఒక్కగానొక్క కొడుకు సత్యనారాయణ ఉన్నాడు. తల్లి ఆలనాపాలన చూసుకోకపోవడంతో 20 ఏండ్లుగా దుబ్బాకలో భిక్షాటన చేసుకుని జీవించింది. ప్రస్తుతం కాళ్లు చచ్చుబడటంతో పదేండ్లుగా రేపల్లెవాడలో ఆశ్రయం పొందుతున్నది. వృద్ధురాలు దీనస్థితిపై చలించిన రేపల్లెవాడ కాలనీవాసులు అక్కడున్న ఖాళీ స్థలంలో గుడిసె ఏర్పాటు చేసి ఆశ్రయం కల్పించారు. రోజుకొకరు చొప్పున భోజనం అందిస్తున్నారు. చలి, వానను తట్టుకుంటూ దుర్భర జీవనం గడుపుతున్నది. సోమవారం అర్ధరాత్రి వీధికుక్కలు గుడిసెలోకి వెళ్లి వృద్ధురాలిపై దాడిచేశాయి. మంగళవారం ఉదయం అటుగా వెళ్తున్న స్థానికులు రంగవ్వ పరిస్థితిని చూశారు. ఈ విషయాన్ని ఆమె కొడుకు సత్యనారాయణకు సమాచారం ఇచ్చారు. అతను పట్టించుకోలేదు. స్థానికులు మీడియాతోపాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. 108 అంబులెన్స్‌లో ఆమెను దుబ్బాక దవాఖానకు తరలించి వైద్యం అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆమెను సిద్దిపేట జిల్లా దవాఖానకు రిఫర్ చేశారు. పోలీసుల సూచనతో కొడుకు సత్యనారాయణ, మనువడు మోహన్ దవాఖానకు వచ్చారు.

## గర్ల్‌ఫ్రెండ్ కుటుంబం నుంచి రక్షణ కోసం..

**భారత్‌లోకి ప్రవేశించిన పాక్ యువకుడు**

న్యూఢిల్లీ : గర్ల్‌ఫ్రెండ్ కుటుంబం నుంచి తప్పించుకోవడం కోసం ఓ పాకిస్థానీ యువకుడు సరిహద్దు దాటి భారత్‌లోకి ప్రవేశించాడు. బీఎస్ఎఫ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, జగ్సీకోలి ఆదివారం రాజస్థాన్‌లోని బామర్ జిల్లా, జప్దలోకి ప్రవేశించగా బీఎస్ఎఫ్ అధికారులు ప్రశ్నించారు. తాను అంతర్జాతీయ సరిహద్దుకు 35 కిలోమీటర్ల దూరంలో ఉంటున్నానని, అక్కడికి 8 కి.మీ. దూరంలో ఉంటున్న పాకిస్థానీ అమ్మాయితో అఫైర్ ఉందని, ఆమెను తీసుకెళ్లిపోవడం కోసం వారి ఇంటికి వెళ్తే కుటుంబ సభ్యులు పసిగట్టారు. వారి నుంచి తప్పించుకోవడం భారత్‌లో ప్రవేశించాడు. ఇతనిని స్థానిక పోలీసులకు సోమవారం బీఎస్ఎఫ్ అప్పగించింది.

## చెట్టుకు దళిత బాలికల మృతదేహాలు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ఫతేగఢ్ శివారులో ఇద్దరు దళిత బాలికల మృతదేహాలు చెట్టుకు వేలాడుతూ కనిపించాయి. 15 ఏండ్లు, 18 ఏండ్లు వయసుగల వీరిద్దరూ ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. పోలీసు సూపరింటెండెంట్ అలోక్ ప్రియదర్శి మాట్లాడుతూ, ఇద్దరు బాలికల మృతదేహాలను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మృతులిద్దరూ స్నేహితులని, వీరు ఒకే ప్రాంతంలో నివసిస్తున్నారని చెప్పారు. రెండు దుపట్టాలను కట్టి, వాటికి వేలాడుతూ వీరి మృతదేహాలు కనిపించాయన్నారు. పోస్ట్‌మార్టం నివేదిక వచ్చిన తర్వాత వివరాలు వెల్లడవుతాయని తెలిపారు. మొబైల్ ఫోన్, సిమ్ కార్డు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా పోలీసు ఉన్నతాధికారి చెప్పారు. ఈ సంఘటనపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. మహిళల భద్రతను రాజకీయాలకు అతీతంగా చూడవలసిన సమయం ఆసన్నమైందని ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఎక్స్‌లో తెలిపారు. నిష్పాక్షిక దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. ఉత్తర ప్రదేశ్ మహిళలకు శ్మశాన వాటికగా మారిందని రాష్ట్ర కాంగ్రెస్ ఆరోపించింది.

# ఏఐతో రచనలో వేగం



మాట్లాడుతున్న ఎన్ఐఎస్‌జీ మాజీ సీఈవో జేఆర్‌కే రావు

- **రిటైర్డ్ ఐఏఎస్ జేఆర్‌కే రావు**
- **ఏఐతో మాస్టరింగ్ కంటెంట్ క్రియేషన్‌పై శిక్షణ ప్రారంభం**

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) టెక్నాలజీతో రచనాశైలిలో వేగం పెరుగుతుందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్మార్ట్ గవర్నెన్స్(ఎన్ఐఎస్‌జీ) మాజీ సీఈవో జేఆర్‌కే రావు చెప్పారు. ఏఐ డాటాను ఉపయోగించే క్రమంలో కచ్చితంగా చెక్‌చేసుకోవాలని సూచించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, పంచాయతీరాజ్(ఎన్ఐఆర్‌డీపీఆర్) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో మాస్టరింగ్ కంటెంట్ క్రియేషన్' అంశంపై మూడు రోజుల శిక్షణను మంగళవారం జేఆర్‌కే రావు ప్రారంభించి ప్రసంగించారు. పనిని వేగవంతంగా చేయడానికి ఏఐ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. వివిధ రాష్ర్టాల నుంచి 40 మంది వరకు హాజరయ్యారు. కార్యక్రమంలో మాతృభూమి ఆన్‌లైన్ కన్సల్టెంట్ సునీల్ ప్రభాకర్, ఎన్ఐఆర్‌డీపీఆర్ ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతీస్ సత్యపాలన్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పీపీ సాహు, అసిస్టెంట్ ఎడిటర్ కిష్టరాజ్ కేఎస్, ఇప్రెస్సా ఫౌండర్ అంజలి చంద్రన్ పాల్గొన్నారు.




అరణ్యభవన్ వద్ద నిరసన తెలుపుతున్న పాలమూరు కురుమ సంఘం నాయకులు

## గొర్రెల పెంపకందారులపై వేధింపులు ఆపండి

**పీసీసీఎఫ్ డోబ్రియల్‌కి పాలమూరు కురుమ సంఘం విజ్ఞప్తి**

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): అటవీ ప్రాంతాల్లో గొర్రెలు, మేకల పెంపకందారులపై అటవీశాఖ అధికారుల వేధింపులను అరికట్టాలని పాలమూరు కురుమ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం అధికారుల తీరును నిరసిస్తూ పాలమూరు కురుమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ అటవీశాఖ ప్రధాన కార్యాలయం(అరణ్యభవన్) ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం అటవీ సంరక్షణ ప్రధానాధికారి డోబ్రియాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పాలమూరు జిల్లా పరిధిలో అటవీ సంరక్షణ పేరుతో అధికారులు పశువులు, గొర్రెలు, మేకలను అటవీ ప్రాంతంలోకి అనుమతించడం లేదని వాపోయారు. మేతకోసం తీసుకొస్తున్న గొర్రెలు, మేకలు పెంపకందారులపై కేసులు నమోదు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీసీసీఎఫ్ డోబ్రియల్ మాట్లాడుతూ.. పశువులు, మేకలపై వన్యమృగాలు దాడి చేస్తున్నాయని, పశువులకాపరుల చర్యలతో అడవుల్లో అగ్నిప్రమాదాలు పెరిగాయని, పశుగ్రాసం కోసం చెట్లను నరికివేస్తున్నారని పేర్కొన్నారు. అటవీ సంరక్షణ చర్యల్లో భాగంగా పశువులు, మేకల పెంపకందారులను అనుమతించడం లేదని వెల్లడించారు. గడ్డి మైదానాల్లో మేపుకోవాలని సూచించారు.






గోపాల్‌పేట రెడ్లకుంటలో చేపపిల్లలను వదులుతున్న మత్స్యకారులు

## చేపపిల్లల పంపిణీపై చేతులెత్తేసిన సర్కారు

**సొంత డబ్బులతో కొనుగోలు చేసిన మత్స్యకారులు**

గోపాల్‌పేట, ఆగస్టు 27: మత్స్యకారులకు ఉచిత చేపపిల్లల పంపిణీపై కాంగ్రెస్ సర్కారు చేతులెత్తేసింది. కేసీఆర్ సర్కార్ మత్స్యకారులకు ఉచితంగా చేపపిల్లలు అందించగా.. ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వనపర్తి జిల్లా గోపాల్‌పేటకు చెందిన 97 మంది మత్స్యకారులు రూ.2,500 చొప్పున రూ.3 లక్షలు జమచేసి 4.60 లక్షల చేపపిల్లలను కొనుగోలు చేశారు. వాటిని మంగళవారం గోపాల్‌పేట శివారులోని పెద్ద చెరువు, కత్వ చెరువు, అమ్మ చెరువు, నీలయ్యకుంట, ఎర్రకుంట, రెడ్లకుంటల్లో వదిలినట్టు మత్స్యకారుల సంఘం మండలాధ్యక్షుడు బాలరాజు తెలిపారు. బొచ్చలు, రవటలు, బంగారుతీగలు, కొర్రమీను, గడ్డి చేపల వంటి రకాల చేపపిల్లలను కొనుగోలు చేసినట్టు చెప్పారు. మత్స్యకారుల సంఘ సభ్యులు వెంకటయ్య, చంద్రయ్య, రాయుడు, బాలరాజు, మైబూస్, నర్సింహా, వెంకటయ్య, గోపి, శివుడు, బాలయ్య పాల్గొన్నారు.

# అభియోగాలు సరే.. ఆధారాలేవి?



మొదటిపేజీ తరువాయి...

విచారణ తీరును ధర్మాసనం తప్పుబట్టింది. కుంభకోణం జరిగిందనడానికి సరైన ఆధారాలను ఇప్పటివరకూ సమర్పించలేదని ఆగ్రహం వ్యక్తంచేసింది. ట్రయల్ పూర్తైన తర్వాత కూడా మహిళ అని చూడకుండా కవితను జైల్లో ఉంచడాన్ని ధర్మాసనం ఆక్షేపించింది.

**పిటిషనర్ స్కామ్‌లో ఎక్కడ భాగమయ్యారు?**

కవిత బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా 'ఢిల్లీ మద్యం పాలసీ' కేసు పెద్ద స్కామ్ అంటూ ఈడీ, సీబీఐ తరుపు న్యాయవాది వాదించారు. దీంతో జోక్యం చేసుకొన్న ధర్మాసనం.. 'ఇదో పెద్ద స్కామ్ అంటున్నారు. నెలలపాటు విచారణ జరిగిందంటున్నారు. 493 మంది సాక్షులను, 57 మంది నిందితులను విచారించామని చెప్తున్నారు. 50 వేల పేజీల కొద్దీ సాక్ష్యాలు సేకరించినట్టు రికార్డుల్లో పేర్కొన్నారు. మీరన్నట్టు.. ఇంత పెద్ద స్కామ్ జరిగితే, ఒక్క రూపాయి కూడా రికవరీ చేయకపోవడమేంటి? అసలు స్కామ్ జరిగినట్టు రుజువులేమిటి?' అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. 'ఇప్పటికే, విచారణ పూర్తయింది. దర్యాప్తు సంస్థలు చార్జిషీట్లు దాఖలు చేశాయి. పిటిషనర్ అయిన మహిళ ఐదు నెలలుగా విచారణ ఖైదీగా జైల్లోనే ఉన్నారు. పూర్తి కేసు తేలేందుకు చాలా సమయం పడుతుంది. విచారణ భవిష్యత్‌లో ముగిసే అవకాశం కనిపించడంలేదు. అండర్ ట్రయల్ కస్టడీ (విచారణ ఖైదీ) పేరిట నిందితులను జైల్లో కొనసాగించడం శిక్షే అవుతుంది. అందుకే పిటిషనర్‌కు బెయిల్ మంజూరు చేస్తున్నాం' అని ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. మీరు చెప్తున్న స్కామ్‌లో పిటిషనర్ ఎక్కడ భాగమయ్యారో అర్థంకావట్లేదని ఆశ్చర్యం వ్యక్తం చేసిన ధర్మాసనం.. దానికి ఒక్క ఆధారమైనా చూపించాలిగా? అని ఈడీని, సీబీఐని ప్రశ్నించింది.

## ట్రయల్ మొదలయ్యాక కూడా జైలా?

*ఈ కేసులో దర్యాప్తు సంస్థల నుంచి కేసు విచారణ కింది కోర్టుకు చేరింది. అంటే ట్రయల్ ప్రారంభమయినట్టే కదా. కోర్టులో ట్రయిల్ ప్రారంభం అయ్యాక నిందితులు జైల్లో కొనసాగించాల్సిన అవసరం ఏముంది?*

-సుప్రీంకోర్టు

**కవిత సామాజిక కృషి చూడాలిగా..**

కవిత బాగా చదువుకున్న మహిళ అని, ఆమె సామాజిక సేవ ద్వారా గణనీయమైన కృషి చేస్తున్నారని హైకోర్టు చెప్పడాన్ని సుప్రీంకోర్టు ప్రత్యేకంగా ప్రస్తావించింది. దీనిని బట్టి పిటిషనర్ వల్ల ఈ కేసులో ఎవరికీ హాని కలగబోదని స్పష్టమవుతున్నదని పేర్కొన్నది. సెక్షన్-45 (1) నిబంధనల ప్రకారం మహిళలకు లభించే ప్రయోజనాలు.. పిటిషనర్ కవితకు కూడా వర్తిస్తాయని చెప్పింది. సెక్షన్-45 కింద ఉపశమనాన్ని నిరాకరిస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కవిత సవాల్ చేసిన అప్పీల్ పిటిషన్‌ను అనుమతిస్తూ సుప్రీంకోర్టు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. కవితకు బెయిల్ ఇవ్వొద్దన్న హైకోర్టు ఉత్తర్వులను పక్కనబెట్టింది. కవిత ఉన్నత విద్యావంతురాలని, సామాజిక సేవ చేస్తున్నారంటూ విజయాలను నమోదు చేసిన హైకోర్టు, కవిత బెయిల్ మంజూరు విషయంలో ఆ దృష్టిలో చూడలేదని ఆక్షేపించింది. పిటిషనర్ కవితపై ఆరోపణలతో జైల్లో విచారణ కొనసాగించి దుర్బలమైన పరిస్థితి ఏర్పర్చకూడదని వ్యాఖ్యానించింది. పీఎంఎల్‌ఏ కింద ఆరోపణలు ఎదుర్కొం-

## మీ విచారణ సరిగ్గానే జరిగిందా?

*కేసు పూర్వాపరాలను విశ్లేషిస్తే.. సీబీఐ, ఈడీ దర్యాప్తుపై అనుమానాలు కలుగుతున్నాయి. ఇష్టారీతిన నిందితులను ఎన్నుకొని, విచారించి.. ఆ తర్వాత వాళ్లు అప్రూవర్లుగా మారినట్టు చెప్పి.. వాళ్లు చెప్పిన విషయాలను బట్టి చార్జిషీట్లు దాఖలు చేయడమేంటి? నిజంగా విచారణ పారదర్శకంగా జరిగిందా?*

-సుప్రీంకోర్టు



జైలు నుంచి విడుదలైన అనంతరం కేటీఆర్‌ను చూసి బోరున విలపిస్తున్న కవిత

**ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యలపై అసహనం**

మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ)లోని సెక్షన్-45 ప్రకారం మహిళలకు ప్రత్యేకమైన వెసులుబాటు ఉన్నదని, సెక్షన్-45(1) ప్రకారం మహిళను ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకునేందుకు అర్హత ఉన్నదని ధర్మాసనం గుర్తుచేసింది. విద్యావంతురాలై, ఉన్నత హోదా కలిగిన మహిళ నిందితురాలిగా ఉంటే బెయిల్ పొందేందుకు అర్హులు కాదంటూ ఢిల్లీ హైకోర్టు ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఒకవేళ, ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు గనుక చట్టరూపం దాల్చితే విద్యావంతురాలైన మహిళ ఏదైనా కేసులో నిందితురాలిగా ఉంటే, ఆమెకు ఎన్నటికీ బెయిల్ లభించదని కోర్టు తెలిపింది. ఇది ఎంతమాత్రం సబబు కాదని వెల్లడించింది. బెయిల్ మంజూరు చేసేటప్పుడు ఎంపీ, ఎమ్మెల్సీ హోదాలో ఉన్న మహిళను ఒకలా.. సాధారణ మహిళను మరోలా చూడటం వివక్ష కిందకే వస్తుందని పేర్కొన్నది. ఈవిధమైన విభేదాలు చూపకూడదని ధర్మాసనం అభిప్రాయపడింది. పిటిషనర్ కవితకు సెక్షన్-46 నిబంధన ప్రయోజనాలను నిరాకరించాలన్న హైకోర్టు వాదనలోనూ వైరుధ్యం ఉన్నదని పేర్కొన్నది.

టున్న మహిళల పట్ల కోర్టులు మరింత సున్నితంగా వ్యవహరించాలని హితవు చెప్పింది. కోర్టులు మహిళల పట్ల మరింత సున్నితంగా, సానుభూతితో వ్యవహరించాలని సూచించింది. అన్ని అంశాలను లోతుగా పరిశీలన చేశాక కవిత అప్పీల్ పిటిషన్‌ను అనుమతిస్తూ ఆమెను బెయిల్‌పై విడుదల చేయాలని ఉత్తర్వులు జారీ చేస్తున్నట్టు వెల్లడించింది.

**వాడి-వేడి వాదనలు**

కవితకు కోర్టు బెయిల్ మంజూరు చేయడం కంటే ముందు ఇరుపక్షాల మధ్య వాడి-వేడి వాదనలు జరిగాయి. ఈడీ, సీబీఐ తరుపున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదిస్తూ.. కవిత తన ఫోన్‌ను ఫార్మాట్ చేయడం ద్వారా సాక్ష్యాలను ధ్వంసం చేసినందున బెయిల్ మంజూరు చేయొద్దని కోరారు. బెయిల్ మంజూరుకు మహిళలకు ఉన్న చట్టపరమైన వెసులుబాటును కవితకు వర్తింపజేయొద్దని కోరారు. కవిత సాక్ష్యాలను తారుమారు చేస్తారని, సాక్షులను ప్రభావితం చేస్తారని పేర్కొన్నారు. కవిత తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదిస్తూ, ఈరోజుల్లో రెండు మూడు వారాలకు ఒక ఫోన్ మార్చేస్తున్నారని, కవిత కూడా తన ఫోన్లను మార్పు చేసినప్పుడు తన వద్ద పనిచేసే వారికి ఇచ్చారని చెప్పారు. ఈ క్రమంలోనే ఫోన్‌ను ఫార్మాట్ చేశారని వివరించారు. ఐఫోన్‌ను తన వద్ద పనిచేసే వాళ్లకు ఇచ్చేస్తారా? అని ఎస్వీ రాజు ప్రశ్నించగా, ఐఫోన్ అయితే ఇవ్వకూడదా? ఐఫోన్ అయితే ఏంటని? రోహత్గీ ఎదురు ప్రశ్నించారు.

## ఇప్పట్లో ఈ కేసు కంచికి చేరదు

*50 వేల పైచిలుకు పేజీల డాక్యుమెంట్లు సమర్పించారు. 57 మంది నిందితులను, 493 మంది సాక్షులను విచారించినట్టు చెప్తున్నారు. ఇరు ఏజెన్సీల చార్జిషీట్ల దాఖలు కూడా పూర్తయ్యింది. పిటిషనర్ అయిన మహిళ ఐదు నెలలుగా విచారణ ఖైదీగా జైల్లో ఉన్నారు. ఇవన్నీ చూస్తే భవిష్యత్‌లో ఈ కేసు విచారణ ముగిసే అవకాశం లేదని మాకు అనిపిస్తున్నది.*

-సుప్రీంకోర్టు



## బెయిల్ పొందేందుకు కవిత అర్హురాలు

**వాదనల తర్వాత సుప్రీంకోర్టు ధర్మాసనం కవిత బెయిల్ పొందేందుకు అర్హురాలని, మహిళగా ఆమెకు ఉన్న ప్రత్యేక హక్కుల ప్రకారం చూసినా బెయిల్‌కు ఆమె అర్హురాలేనని తేల్చి చెప్పింది. ఈ విషయాన్ని పూర్తిగా చట్టపరమైన కోణం నుంచి చూడాలని దర్యాప్తు సంస్థలకు చెప్పింది. కవితను మద్యం కేసులో కొనసాగించేందుకు మీ దగ్గర ఉన్న రుజువులు ఏమిటని ఈడీ, సీబీఐని మరోసారి ప్రశ్నించింది.**

**అటు నుంచి** ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో కలుగజేసుకొన్న న్యాయస్థానం.. 'కేసు పూర్వాపరాలను విశ్లేషిస్తే, సీబీఐ, ఈడీ దర్యాప్తుపై అనుమానాలు కలుగుతున్నాయి. ఇష్టారీతిన నిందితులను ఎన్నుకొని, విచారించి.. ఆ తర్వాత వాళ్లు అప్రూవర్లుగా మారినట్టు చెప్పి.. వాళ్లు చెప్పిన విషయాలను బట్టి చార్జీషీట్లు దాఖలు చేయడమేంటి? నిజంగా విచారణ పారదర్శకంగా జరిగిందా?' అని అనుమానాలు వ్యక్తం చేసింది. 'పిటిషనర్ ఈ స్కామ్‌లో భాగమైనట్టు ఒక్క ఆధారమైనా చూపించండి. అభియోగాలు మోపుతూ, విచారణ పేరిట పిటిషనర్‌ను ఇంకెన్నాళ్లు జైల్లో ఉంచుతారని' నిలదీసింది. ఈ క్రమంలో పిటిషనర్‌కు బెయిల్ ఇవ్వొద్దంటూ ఈడీ తరుపు న్యాయవాది వాదిస్తుండగా.. 'ఇంతకంటే మీరు ఒక్క పాయింట్ ఎక్కువ వాదించినా.. మీరు కావాలనే బెయిల్‌ను అడ్డుకొంటున్నట్టు జడ్జిమెంట్‌లో మేము రాయాల్సి వస్తుంది' అంటూ ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కాగా, ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించిన కేసులో ఈడీ కవితను మార్చి 15న హైదరాబాద్‌లో అరెస్టు చేసింది. ఆ తర్వాత గత ఏప్రిల్ 11న సీబీఐ ఆమెను కస్టడీలోకి తీసుకున్నది. ఈ రెండు కేసుల్లో కవిత బెయిల్ పిటిషన్‌ను ట్రయల్ కోర్టు మే 6న తిరస్కరించింది. దీనిపై హైకోర్టులో సవాల్ చేస్తే గత జులై 1న ఢిల్లీ హైకోర్టు కూడా బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. పలు దఫాల విచారణ తర్వాత దేశ అత్యున్నత న్యాయస్థానం మంగళవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.

**మేం కూడా నేరం చేసినట్టేనా?**

ఈ సమయంలో సుప్రీంకోర్టు కల్పించుకుని, పిటిషనర్ (కవిత)పై కేసు నమోదు చేసేందుకు ఫోన్ ఫార్మాట్ చేయడమనే అంశం ప్రాథమికంగా సాక్ష్యం కాబోదని, అసలు అది ఏ మాత్రం సరిపోదని చెప్పింది. దీనిపై ఎస్వీ రాజు జోక్యం చేసుకుని.. కవిత తన ఫోన్లల్లోని అనేక మెసేజ్‌లను, వాట్సాప్ చాటింగ్‌లను పూర్తిగా తొలగించేశారని, ఫోన్లను ఫార్మాట్ కూడా చేసి ఆధారాలు లేకుండా చేశారని చెప్పారు. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విశ్వనాథన్ కల్పించుకుని తాను కూడా అనేక మెసేజ్‌లను ఫోన్‌నుంచి తరుచూ తొలగించేస్తూ ఉంటానని, అవసరం లేనివి, ఏండ్ల తరబడి అలాగే ఉన్నవి, గ్రూప్‌ల్లోని మెసేజ్‌లను తొలగించేస్తుంటానని చెప్పారు. మెసేజ్‌లు తొలగించడమే నేరమా? అని ప్రశ్నించారు. ఒకవేళ, అదే నిజమైతే, మేము (న్యాయమూర్తులం) నేరం చేసినట్టేనా? అని ఎస్వీ రాజును సూటిగా ప్రశ్నించారు.

**అది కాకుండా ఇంకో ఆధారం చూపించండి**

ఫోన్ అనేది చాలా ప్రైవేట్ విషయమని, అందులో ఇతరత్రా విషయాలు కూడా ఉంటాయని, సాధారణంగా మెసేజ్‌లను తొలగించేయడం అందరూ చేస్తూనే ఉంటారని, వందల మెసేజ్‌లు పెట్టుకుని ఎవరూ గందరగోళానికి గురికావాలని కోరుకోరని జస్టిస్ విశ్వనాథన్ చెప్పారు. మెసేజ్‌లు తొలగింపు మినహా ఇతర విషయాలు ఏమైనా ఉంటే చెప్పాలని, ఇదే కేసుకు ప్రధానం కాదని, ఇతర ఆధారాలు ఉంటే చెప్పాలని కోరారు. కవిత ఫోన్ ట్యాపరింగ్ చేశారని ఎస్వీ రాజు చెప్పగానే జస్టిస్ విశ్వనాథన్ కల్పించుకుని ఫోన్ ఫార్మాట్‌కు, ఫోన్ ట్యాంపరింగ్‌కు చాలా తేడా ఉన్నదని చెప్పారు. మరో న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ కల్పించుకుని, చాలా మంది వద్ద రెండు, మూడు ఫోన్లు ఉంటాయని, ఒకే ఫోన్ పెట్టుకుని అన్ని కాల్స్‌ను ఆన్సర్ చేసే గందరగోళ పరిస్థితులను ఎవరూ కొనితెచ్చుకోరని చెప్పారు. వ్యక్తిగత నంబర్లు మినహా మిగిలిన మెసేజ్‌లను తొలగించేస్తూనే ఉంటామన్నారు.

**ఎన్నాళ్లు జైల్లో ఉంచుతారు?**

ఇంతకీ పిటిషనర్ కవితపై మీరు (సీబీఐ, ఈడీ) మోపిన నేరాభియోగాలతో ఇంకెన్నాళ్లు జైల్లోనే కొనసాగేలా చేస్తారని, నేరంలో పాల్గొన్నట్టుగా ఏదైనా ఇతర ఆధారాలు చూపాలని సుప్రీంకోర్టు సీబీఐ, ఈడీలను సూటిగా ప్రశ్నించింది. ఒక మహిళగా బెయిల్ ప్రయోజనాలు పొందేందుకు కవిత ఎందుకు అర్హురాలు కాదో చెప్పాలని నిలదీసింది. ఫోన్లు ఫార్మాట్ చేశారనో, మెసేజ్‌లు డిలీట్ చేశారనో చెప్పడం కాదని, ఆధారాలకు సంబంధించిన మెటీరియల్ చూపాలని ఆదేశించింది. సాక్ష్యాధారాలను తారుమారు చేస్తారని చెప్పడానికి, ఫోన్ ఫార్మాట్ లేదా మెసేజ్‌లు డిలీట్ చేయడం వంటివి కాకుండా ఇంకేమైనా సాక్ష్యాలు ఉంటే చెప్పాలని ప్రశ్నించింది. ఇతర నిందితులతో ఆమెకు ఉన్న సంబంధాన్ని చూపించడానికి



బెయిల్ తీర్పు అనంతరం సుప్రీంకోర్టు ప్రాంగణంలో కవిత న్యాయవాది ముకుల్ రోహత్గీ

## అది శిక్షించడమే!

*చార్జిషీట్లు దాఖలు పూర్తి చేశారు. పూర్తి కేసు తేలేందుకు చాలా సమయం పడుతుంది. విచారణ భవిష్యత్‌లో ముగిసే అవకాశం లేదని మాకు అనిపిస్తున్నది. అండర్ ట్రయల్ కస్టడీ పేరిట నిందితులను జైల్లో ఉంచడమంటే శిక్షించడమే. అది సరైన పద్ధతి కాదు. అందుకే పిటిషనర్‌కు బెయిల్ మంజూరు చేస్తున్నాం.*

-సుప్రీంకోర్టు

తమ వద్ద కాల్ డాటా రికార్డులు ఉన్నాయని ఈ సందర్భంగా ఎస్వీ రాజు చెప్పారు. కవిత ఆడిటర్ బుచ్చిరాజు ద్వారా సౌత్ లాబీ నుంచి నగదు ముట్టిందని తెలిపారు. దీంతో కల్పించుకున్న సుప్రీంకోర్టు.. అయితే, బుచ్చిరాజుపై ఎందుకు కేసు నమోదు చేయలేదని నిలదీసింది. దీంతో రాజు వాదిస్తూ.. సీఎం కేజ్రీవాల్‌ను కలిసినట్టు మరో నిందితుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఇచ్చిన వాంగ్మూలంలో ఒప్పుకున్నారని, మొత్తం రూ.50 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, ఎంపీ పనుల్లో బిజీగా ఉండడంతో రూ.25 కోట్లు తన కొడుకు మాగుంట రాఘవతో పంపినట్టు మెజిస్ట్రేట్ ముందు స్టేట్‌మెంట్ ఇచ్చారని ఎస్వీ రాజు చెప్పారు. దీనిపై రోహత్గీ కల్పించుకుని వాళ్లు అప్రూవర్‌గా మారారని, సాక్షులందరినీ అప్రూవర్లుగా చేశారని చెప్పారు. దీనిపై జస్టిస్ కేవీ విశ్వనాథన్ జోక్యం చేసుకొని... నిందితుడు అప్రూవర్‌గా మారారా? అన్న ప్రశ్నకు అవునని రాజు జవాబు చెప్పారు. రామచంద్ర పిళ్లై తన వాంగ్మూలాన్ని వెనక్కి తీసుకునే ముందు నాలుగు స్టేట్‌మెంట్లు ఇచ్చారని చెప్పారు. కవిత న్యాయవాది రోహత్గీ కల్పించుకుని కేసులో కేజ్రీవాల్, సిసోడియా, కవిత... ఇలా అందర్నీ కింగ్‌పిన్‌గానే పేర్కొంటున్నారని తప్పుపట్టారు. మాగుంట రాఘవ, శరత్ చంద్రారెడ్డి అప్రూవర్లుగా మారిన వారంలోనే వాళ్లకు బెయిల్ వచ్చేసిందన్న విషయాన్ని రోహత్గీ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈడీ, సీబీఐ తీరుపై తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయని చెప్పారు. అప్రూవర్లు ఇచ్చిన ప్రకటనలు మినహా దర్యాప్తు సంస్థల దగ్గర ఉన్న ఆధారాలు శూన్యమని పేర్కొన్నారు.

## స్కామ్ జరిగినట్టు రుజువేంటి?

*ఇదో పెద్ద స్కామ్ అంటున్నారు. నెలలపాటు విచారణ జరిగిందంటున్నారు. గుట్టలకొద్దీ సాక్ష్యాలు సేకరించినట్టు రికార్డుల్లో పేర్కొన్నారు. మరి, ఇంత పెద్ద స్కామ్ జరిగితే, ఒక్క రూపాయి కూడా రికవరీ చేయకపోవడమేంటి? అసలు స్కామ్ జరిగినట్టు రుజువులేమిటి?*

## మేం కూడా నేరం చేసినట్టేనా?

*అడిగిన ప్రతిసారీ పిటిషనర్ ఫోన్‌లో మెసేజ్‌లను, వాట్సాప్ చాటింగ్‌లను తొలగించారని, ఫోన్లను ఫార్మాట్ చేశారని చెప్తున్నారు. మేము న్యాయమూర్తులం. మేం కూడా అనవసరమైన మెసేజ్‌లు, చాట్‌లను తొలగిస్తాం. అలా చేస్తే మేం కూడా నేరం చేసినట్టేనా?!*

-సుప్రీంకోర్టు

**మీరు ఏం వాదిస్తున్నారో మీకైనా అర్థమవుతున్నదా?**

నిందితుల్లో కొందరిని అప్రూవర్లుగా పరిగణనలోకి తీసుకున్నాక ఈడీ, సీబీఐ ప్రాసిక్యూషన్ విధానాన్ని కొనసాగించడాన్ని సుప్రీంకోర్టు ఆక్షేపించింది. ఈడీ కేసులో బుచ్చిబాబు, గౌతమ్ ముత్తా, మాగుంట రాఘవ పాత్రలపై జస్టిస్ గవాయి ఆరా తీశారు. బుచ్చిబాబు, గౌతమ్ ముత్తా ఈడీ కేసులో నిందితులుగా లేరని, సీబీఐ కేసులో అప్రూవర్లుగా మారారని ఎస్వీ రాజు కోర్టుకు తెలిపారు. మాగుంట రాఘవ డబ్బును బుచ్చిబాబు ద్వారా కవితకు ఇచ్చారని చెప్తున్నప్పుడు బుచ్చిబాబు ఎందుకు నిందితుడు కాలేదని జస్టిస్ గవాయ్ మళ్లీ నిలదీశారు. మాగుంట రాఘవ పాత్ర మనీలాండరింగ్ వ్యవహారంలో లేదని రాజు చెప్పడంపై జస్టిస్ గవాయి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంతవరకు చేసిన వాదనలతో మీరే విభేదిస్తుంటే, మీ వాదనలతో మీరే ఏకీభవించకపోతే ఎలాగని ప్రశ్నించారు.

## ఇదే అసలైన వివక్ష

*బెయిల్ విషయంలో ఎంపీ, ఎమ్మెల్సీ అయిన మహిళకు ఒక న్యాయం.. సాధారణ మహిళకు మరో న్యాయమా? ఇది వివక్ష కాక మరేమిటి? ఇలాంటి విభేదాలు చూపకూడదు.*

-సుప్రీంకోర్టు

**దర్యాప్తు సంస్థ మాట మార్చడం సరికాదు**

తండ్రి మాగుంట శ్రీనివాసులురెడ్డి చెప్పినట్టు రాఘవ, కవితకు బదులు బుచ్చిబాబుకు రూ.25 కోట్లు ఇచ్చారని చెప్పారని, ఇప్పుడు ఆ మాట మార్చడం సరికాదని ధర్మాసనం ఈడీ, సీబీఐని హెచ్చరించింది. ప్రాసిక్యూషన్ న్యాయంగా ఉండాలని, నిందితుడిని సాక్షిగా మార్చి దాని ఆధారంగా ప్రాసిక్యూషన్ విధానాన్ని కొనసాగించడం సముచితం కాదని అభిప్రాయపడింది. రేపు ఎవరినైనా మీ ఇష్టం వచ్చినట్టు అదుపులోకి తీసుకుంటారా? అని నిలదీసింది. ఏ ఆరోపణ అయినా న్యాయమైన, సహేతుకంగా విచక్షణతో కూడినట్టు ఉండాలని హితవు పలికింది. ఒక బెయిల్ కోసం గంటన్నరపాటు వాదనలు సరికాదన్నది. మహిళలకు సంబంధించి సీఆర్పీసీ, పీఎంఎల్‌ఏ, ఇతర సెక్షన్ల కింద పలు మినహాయింపులు ఉన్నాయని న్యాయస్థానం గుర్తుచేసింది. భోజన విరామం తర్వాత పూర్తి స్థాయిలో వాదనలు వినిపిస్తామని ఎస్వీ రాజు కోరగా అందుకు సుప్రీంకోర్టు నిరాకరించి విచారణను కొనసాగించింది.

**మీరు చెప్తున్నది మీకైనా సరిగ్గా అనిపిస్తుందా?**

తిరిగి ఎస్వీ రాజు కల్పించుకుని సహ నిందితుల్లో ఒకరైన రామచంద్ర పిళ్లై కవితకు నోటీసులు ఇచ్చాక తన వాగ్మూలాన్ని వెనక్కి తీసుకున్నారని చెప్పారు. దీనిపై జస్టిస్ గవాయి కల్పించుకుని.. రామచంద్ర పిళ్లై స్టేట్‌మెంట్ కాకుండా... ఇతరత్రా న్యాయపరమైన ఆధారాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. కవిత నేరం చేసినట్టుగా ఉన్న ఆధారాలు ఏమిటో చూపాలని ప్రశ్నించారు. దీంతో మళ్లీ కల్పించుకొన్న రాజు.. పిళ్లై తన వాంగ్మూలాన్ని వెనక్కి తీసుకునేలా కవిత ప్రభావితం చేసినట్టు తెలిపారు. దీనిపై సుప్రీంకోర్టు కీలక ప్రశ్న సంధించింది. అరుణ్ పిళ్లై తాను ఉపసంహరణ ప్రకటన చేసినప్పుడు అతను మీ (ఈడీ) కస్టడీలోనే ఉన్నారని, అలాంటప్పుడు దానికి కవితను ఎలా బాధ్యులు చేస్తారని నిలదీసింది. కవిత ఈడీ కస్టడీలో ఉండగానే సహ నిందితులను ఏవిధంగానూ ప్రభావితం చేయలేరని తేల్చి చెప్పింది. మాగుంట రాఘవ కూడా మద్యం విధాన వ్యవహారంలో కవిత పాత్ర ఉన్నట్టు చెప్పారని ఎస్వీ రాజు చెప్పగానే కవిత తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ కల్పించుకుని, మాగుంట రాఘవ అప్రూవర్‌గా మారిన తర్వాతి మాటలను ఈడీ, సీబీఐ ఆధారంగా చేసుకోవడం దారుణమన్నారు. కేసులో సహ నిందితులు ఎవరూ పిటిషనర్ కవిత పాత్ర గురించి చెప్పలేదన్నారు. మాగుంట రాఘవ అప్రూవర్‌గా మారిపోయి బెయిల్‌పై ఏనాడో బయటకు వచ్చేశాడని, సీబీఐ, ఈడీల మనిషిగా మాగుంట రాఘవ ఉన్నాడని చెప్పారు.

## హైకోర్టే చెప్పిందిగా!

*పిటిషనర్ ఉన్నత విద్యావంతురాలని, సామాజిక సేవలో గణనీయమైన కృషి చేశారని సాక్షాత్తూ హైకోర్టే పేర్కొన్నది. మరి, అలాంటి మహిళకు బెయిల్ ఇస్తే, ఏ విధమైన హాని జరుగుతుందో ఏజెన్సీలు చెప్పాలి.*

-సుప్రీంకోర్టు

**ఒక్క రూపాయి రికవరీ చేయలే..**

గోవా ఎన్నికల పేరుతో రూ.వంద కోట్లను సౌత్ లాబీ నుంచి ఢిల్లీకి వచ్చేలా చేశారనే కీలక అభియోగాలకు ఈడీ, సీబీఐ ఇప్పటికీ సరైన ఆధారాలు చూపలేదని రోహత్గీ తప్పుపట్టారు. ఒక్క రూపాయి రికవరీ చేయలేదని, కేవలం అభియోగాలతో పిటిషనర్‌ను ఐదు నెలలుగా జైల్లో ఉంచడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని చెప్పారు. సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసి 5 నెలలు అయ్యిందని, ఈడీ ప్రాసిక్యూషన్ పూర్తి చేసి నాలుగు నెలలు అయ్యిందని, 493 మంది సాక్షులను ఈడీ/సీబీఐ విచారించడమే కాకుండా 50 వేల పత్రాలను పరిశీలన చేశాయని వివరించారు. ఈ కేసుల్లో 57 మంది నిందితుల విచారణ జరిగిందని, అయినా బెయిల్ మంజూరు చేయొద్దని సీబీఐ, ఈడీ వాదించడం విచిత్రంగా ఉన్నదని పేర్కొన్నారు. ఎంపీగా చేసిన కవిత ఇప్పుడు ఎమ్మెల్సీగా బాధ్యాతాయుత పదవిలో ఉన్నారని, న్యాయప్రక్రియ నుంచి తప్పించుకునే ఆస్కారమే లేదని, బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఈ విషయంలో ఎలాంటి సందేహం అవసరం లేదని చెప్పారు.

**మీకు ఆ టెన్షన్ అవసరం లేదు**

దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు రోహత్గీ లేవనెత్తిన అన్ని విషయాలపై ఈడీ, సీబీఐని ప్రశ్నించింది. అయితే, అటు నుంచి సరైన సమాధానం రాలేదు. దీంతో కల్పించుకొన్న ధర్మాసనం.. కవిత ఉన్నత స్థాయిలో ఉన్న మహిళని, ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన పనిలేదని ధర్మాసనం అభిప్రాయపడింది. తిరిగి రోహత్గీ వాదనలు కొనసాగిస్తూ, సాక్షులను పిటిషనర్ కవిత బెదిరించారనే అభియోగాలకు అర్థం లేదని, దీన్ని సాకుగా చూపిస్తూ బెయిల్ మంజూరు చేయవద్దనడం అర్థం లేనిదని అన్నారు. దర్యాప్తు అధికారులు అడిగిన వెంటనే పిటిషనర్ తన ఫోన్లు ఇచ్చారని, అవి ఫార్మాట్ చేశారని చెప్పి అదే నేరానికి మూలమంటే ఎలాగని ప్రశ్నించారు. ఫోన్లు మార్చడమనేది సర్వసాధారణ విషయమని, మెసేజ్‌లు తొలగింపు కూడా అందరూ చేసేదేనని, వాడిన ఫోన్లను తన దగ్గర పనిచేసే వాళ్లకు ఇచ్చేటప్పుడు ఎవరైనా ఫోన్‌ను ఫార్మాట్ చేస్తారనే కనీస అవగాహన కూడా లేకుండా దర్యాప్తు అభియోగాలు చేస్తున్నారని తప్పుపట్టారు.

## బెయిల్ మంజూరు సందర్భంగా షరతులు

- ఈడీ, సీబీఐ కేసుల్లో రూ.10 లక్షల విలువైన రెండు పూచీకత్తులను సమర్పించాలి.
- పిటిషనర్ తన పాస్‌పోర్టును కింది కోర్టులో అప్పగించాలి.
- సాక్షులను ప్రభావితం చేయరాదు. కేసు విచారణకు అవసరమైతే హాజరుకావాలి.

### అదే కీలకం అంటే ఎలా?

*మెసేజ్‌లు తొలగించారన్న విషయం తప్పించి మరే ఇతర విషయమైనా ఉంటే చెప్పండి. ఈ ఒక్క విషయాన్ని పట్టుకొని ఇదే కేసుకు కీలకం అంటే మేం అంగీకరించబోం.*

### పిటిషనర్ పాత్ర ఎక్కడ?

*మీరు చెప్తున్న స్కామ్‌లో పిటిషనర్ ఎక్కడ భాగమయ్యారో మాకు అర్థంకావట్లేదు. ఒక్క ఆధారమైనా సమర్పించాలిగా!*

### జడ్జిమెంట్‌లో మీ ప్రస్తావన రాయాలా?

*(ఈడీ న్యాయవాదితో ధర్మాసనం) ఇంతకంటే మీరు ఒక్క పాయింట్ ఎక్కువ వాదించినా.. మీరు కావాలనే బెయిల్‌ను అడ్డుకొంటున్నట్టు జడ్జిమెంట్‌లో మేము రాయాల్సి వస్తుంది.*

### అదెలా సాధ్యం?

*పిటిషనర్ ఈడీ కస్టడీలో ఉండగానే సహ నిందితులను ప్రభావితం చేశారని అంటున్నారు. అదెలా సాధ్యమో మీరే చెప్పాలి.*

-సుప్రీంకోర్టు



జైలు నుంచి బయటకు వస్తున్న కవిత. చిత్రంలో హరీశ్‌రావు

**నోటీసుల కంటే ముందే..**

వాస్తవానికి పిటిషనర్ కవిత 2022 నవంబర్ 22న తన ఫోన్‌ను నాశనం చేశారని దర్యాప్తు అధికారులే చెప్పారని రోహత్గీ గుర్తు చేశారు. అయితే, అధికారులు కవితకు 2023 మార్చి 7న సమన్లు ఇచ్చారు. తొలిసారి సమన్లు జారీ చేయడానికి నాలుగు నెలలు ముందుగానే ఫోన్ ఫార్మాట్ లేదా మరొకటి జరిగితే దాన్ని స్యాక్ష్యాలను ధ్వంసం చేశారని ఎలా చెబుతారని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఇదే కేసులో ఆప్ నాయకుడు మనీశ్ సిసోడియాకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు ఉత్తర్వులను పరిశీలిస్తే కీలక విషయాలు తెలుస్తాయని పేర్కొన్నారు. బెయిల్ పొందడం హక్కని, జైల్లో కొనసాగడం అసాధారణమని సుప్రీంకోర్టు చెప్పిందని, విచారణ జాప్యం కావడాన్ని కూడా తప్పుపట్టిందని గుర్తు చేశారు. దీనికి ధర్మాసనం అవునంటూ సమాధానమిచ్చింది. ఆధారాలు లేకుండా కేవలం సీబీఐ, ఈడీలు చెప్పినట్టు పలికే అప్రూవర్ సాక్ష్యాలను ఆధారంగా చేసుకుని నిందితులను జైలులో ఉంచడం చట్ట వ్యతిరేకమని ప్రకటించాలని రోహత్గీ కోరారు. గత ఐదు నెలలుగా కవిత జైల్లోనే ఉన్నారని, దర్యాప్తు పూర్తి కూడా అయ్యిందని, ఈ దశలో బెయిల్ మంజూరు చేయాలని కోరారు. సీబీఐ తుది చార్జిషీట్ దాఖలు చేసిందని, ఇందుకు అనుగుణంగా ఈడీ తమ దర్యాప్తు ముగించిందని కోర్టుకు తెలిపారు. మరో నిందితుడైన ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా ఈడీ, సీబీఐ కేసులు రెండింటిలోనూ బెయిల్ పొంది విడుదలయ్యారని, మరో నిందితుడు కేజ్రీవాల్ ఈడీ కేసులో బెయిల్ పొందారని గుర్తుచేశారు. ఈ కేసులోని నిందితుల్లో ఏకైక మహిళ కవిత మాత్రమేనని, సెక్షన్-45(1) కింద మహిళా నిందితులకు ప్రత్యేకమైన వెసులుబాటు ఉన్నదని, వీటిని పరిగణనలోకి తీసుకుని కేసులో ఏకైక మహిళ అయిన కవితకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. కేసు విచారణ పూర్తయిందని, ట్రయిల్ జరుగుతున్నందున నిందితులను జైల్లో ఉంచాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

# కౌటాల మండలంలో 5 బడులు మూత

- టీచర్లు లేక వారం రోజులుగా తెరుచుకోని బడులు
- ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఈ దుస్థితి



ఉపాధ్యాయులు లేక మూసిఉన్న కేబీ కాలనీ మొగడ్‌ధగడ్ గిరిజన పాఠశాల

కౌటాల, ఆగస్టు 27 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలంలోని పలు గిరిజన పాఠశాలలు ఉపాధ్యాయులు లేక వారం రోజులుగా తెరుచుకోవడంలేదు. కేబీ కాలనీ మొగడ్‌ధగడ్, శివలింగపూర్, కనికి, జనగాం ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. గురుడుపేట గిరిజన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మెడికల్ లీవ్‌లో ఉండటంతో 5 గిరిజన పాఠశాలలు మూతపడ్డాయి. రోజూ విద్యార్థులు పాఠశాలకు వచ్చి.. ఉపాధ్యాయు లు లేక తిరిగి వెళ్తున్నారు. ఎస్సీఆర్పీ మడావి పోచానిని వివరణ కోరగా, ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడంతో పాఠశాలలు నడవడం లేదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

# జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఖమ్మం, సిరిసిల్ల టీచర్లు

**దేశవ్యాప్తంగా 50 మంది ఎంపిక**



ప్రభాకర్‌రెడ్డి



సంపత్

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఖమ్మం, సిరిసిల్లకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికైనట్టు కేంద్ర విద్యాశాఖ మంగళవారం వెల్లడించింది. దేశవ్యాప్తంగా 50 మంది ఉత్తమ ఉపాధ్యాయుల జాబితాను విడుదల చేసింది. సెప్టెంబర్ 5న వీరందరికీ న్యూఢిల్లీలో అవార్డుల ప్రదానోత్సవం ఉంటుంది. తెలంగాణ నుంచి ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం జడ్పీహెచ్‌ఎస్‌లోని ప్రభుత్వ ఉపాధ్యాయుడు పెసర ప్రభాకర్‌రెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా దమ్మన్నపేట జడ్పీహెచ్‌ఎస్‌లోని ప్రభుత్వ ఉపాధ్యాయుడు తాండూరి సంపత్‌కుమార్ జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

**• శిశువిహార్‌లో కలెక్టర్ కూతురు**



మిషన్ శక్తి పాలన పథకంలో భాగంగా కుమ్రం భీం ఆసిఫాబాద్‌లోని మార్కండేయ కాలనీ అంగన్‌వాడీలోని శిశువిహార్‌లో కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే తన కూతురు ఫరాను ఇటీవల చేర్పించి ఆదర్శంగా నిలిచారు. మంగళవారం ఆయన శిశు విహార్ కేంద్రానికి సందర్శించారు. – ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్

## భూమి రిజిస్ట్రేషన్ చేయడం లేదని..



వారసత్వంగా వచ్చిన భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయకుండా ధికారులు తప్పించుకుంటున్నారని మనస్తాపానికి గురైన భగవాన్ అనే రైతు తహసీల్దార్ కార్యాలయంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కామారెడ్డి జిల్లా రామారెడ్డిలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకున్నది. – రామారెడ్డి

## గుజరాత్‌ను ముంచెత్తిన వానలు

**ఏడుగురి మృతి**

అహ్మదాబాద్: గుజరాత్‌ను భారీ వర్షాలు ముంచెత్తాయి. సౌరాష్ట్ర ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. అధికారులు దాదాపు 15,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సుమారు 300 మందిని సహాయక బృందాలు కాపాడాయి. దేవభూమి ద్వారక, ఆనంద్, వడోదర, ఖేడ, మోర్బి, రాజ్‌కోట్ జిల్లాల్లో సైన్యం, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సహాయక కార్యక్రమాల్లో పాల్గొంటున్నాయి. వర్షాల ధాటికి సురేందర్‌నగర్ జిల్లాలో ఓ బ్రిడ్జి కూలిపోయింది.

## తెలంగాణ కన్నీళ్లు తుడవడానికే రీ డిజైనింగ్

- 37 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చేందుకే కాళేశ్వరం నిర్మాణం
- రఘు, వెదిరే శ్రీరామ్ సీడబ్ల్యూసీ అంశాలను వక్రీకరించారు
- కమిషన్‌కు అఫిడవిట్ దాఖలు చేశా: రాష్ట్ర జల వనరుల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ వీ ప్రకాశ్ వెల్లడి



హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ కన్నీళ్లు తుడిచేందుకు, రాష్ట్ర సాధన ఉద్యమ ఆంక్షలు, లక్ష్యాలను నెరవేర్చేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించినట్టు రాష్ట్ర జల వనరుల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ వీ ప్రకాశ్ చెప్పారు. 16 లక్షల ఎకరాలకు బదులుగా 37 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చేందుకు ప్రాజెక్టు రీ డిజైనింగ్ చేసినట్టు తెలిపారు. విద్యుత్తుశాఖకు చెందిన రఘు, కేంద్ర జల్‌శక్తిశాఖ సలహాదారు వెదిరే శ్రీరామ్ సీడబ్ల్యూసీ లేఖలను వక్రీకరించారని ఆక్షేపించారు. హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌లో కాళేశ్వరం విచారణ కమిషన్ ఎదుట మంగళవారం ఆయన హాజరై తన అఫిడవిట్ దాఖలు చేశారు. అనంతరం వీ ప్రకాశ్ మీడియాతో మాట్లాడుతూ.. తాను కమిషన్ ఎదుట అఫిడవిట్ దాఖలు చేశానని చెప్పారు. తుమ్మడిహట్టి నిర్మాణం సాధ్యం కాదని, ఇందుకు సంబంధించిన కారణాలతో కూడిన వివరాలను ఇచ్చినట్టు తెలిపారు. గోదావరి వాటర్ స్టోరేజీగా ఉండాలని, తుమ్మడిహట్టి వద్ద నిర్మించాల్సిన బరాజ్‌ను మేడిగడ్డకు మార్చామని స్పష్టంచేశారు. 190 కిలోమీటర్లు గోదావరి సజీవంగా ఉండాలనే ఉద్దేశంతో డిజైన్ చేసినట్టు చెప్పారు. అలాగే తుమ్మడిహట్టిపై కాగ్ ఆక్షేపాలను కూడా కమిషన్‌కు వివరించినట్టు పేర్కొన్నారు. తాను సమర్పించిన అఫిడవిట్ పరిశీలన తర్వాత మళ్లీ పిలుస్తామని కమిషన్ చెప్పినట్టు వీ ప్రకాశ్ వెల్లడించారు.

## కొనసాగుతున్న 'కాళేశ్వరం' విచారణ

**సమాధానమిచ్చిన ఐదుగురు ఇంజినీర్లు**

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై కమిషన్ విచారణ కొనసాగుతున్నది. హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌లో మంగళవారం నిర్వహించిన ఓపెన్‌కోర్టుకు ఐదుగురు ఇంజినీర్లు హాజరయ్యారు. కమిషన్ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. మేడిగడ్డ లోకేషన్ మారలేదని కమిషన్ ముందు ఇంజినీర్లు స్పష్టం చేశారు. మూడు బ్యారేజీలకు సంబంధించి డిజైన్లలో ఎలాంటి సమస్య లేదని నిబంధనల ప్రకారమే డిజైన్లు ఉన్నాయని చెప్పారు. మేడిగడ్డ ప్రాజెక్టు కుంగుబాటుకు కారణం రాఫ్ట్ కింద పలు సమస్యలేనని వివరించారు. సికెండ్ ఫైల్స్, అలాట్మెంట్ డివియేషన్ వల్ల సమస్య వచ్చిందని ఇంజినీర్ సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు.

# రామప్ప శిల్పకళ కు గవర్నర్ ఫిదా

- కాకతీయుల కట్టడంపై ప్రశంసలు
- ఆకట్టుకున్న యాదగిరిగుట్ట నిర్మాణాలు
- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కితాబు



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పూజలు

ములుగు, ఆగస్టు 27 (నమస్తేతెలంగాణ)/యాదగిరిగుట్ట/ములుగురూరల్: కాకతీయుల కళా వైభవమైన యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ శిల్ప కళకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఫిదా అయ్యారు. జీవకళతో చెక్కిన శిల్పాలను చూసి ముగ్ధులయ్యారు. మంగళవారం ములుగు జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన రోడ్డు మార్గాన ఉదయం 11 గంటలకు ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకోగా మంత్రి సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీష్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆయన ములుగులోని కలెక్టరేట్ సమావేశ మందిరానికి చేరుకున్నారు. కొమ్ముకోయ నృత్యాలతో గవర్నర్‌కు స్వాగతం పలికారు. జిష్ణుదేవ్‌వర్మ జిల్లాస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించగా జిల్లాలో జరుగుతున్న ప్రగతిని గవర్నర్‌కు కలెక్టర్‌తో పాటు మంత్రి సీతక్క పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం జిల్లాకు చెందిన రచయితలు, కవులు, కళాకారులు, జాతీయ అంతర్జాతీయ క్రీడా అవార్డు గ్రహీతలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో చర్చ గోష్ఠి నిర్వహిస్తూ మధ్యాహ్న భోజనం చేశారు. అక్కడి నుంచి రామప్ప దేవాలయానికి చేరుకొని రుద్రేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ గైడ్‌ల ద్వారా కాకతీయుల నాటి శిల్ప కళల గురించి తెలుసుకొని గవర్నర్ మంత్రముగ్ధులయ్యారు. రామప్ప దేవాలయ ప్రత్యేకత సంతరించుకున్న నీటిపై తేలే ఇటుకల గురించి ప్రొఫెసర్ పాండురంగారావు గవర్నర్‌కు ప్రత్యక్షంగా వివరించారు. ఆ తర్వాత భూపాలపల్లి జిల్లా గణపురం లోని కోటగుళ్లను సందర్శించిన అనంతరం గవర్నర్ గోవిందరావుపేట మండలం బుస్సాపురంలోని లక్నవరం సరస్సును సందర్శించి రాత్రి 2వ ఐలాండ్‌లోని కాటేజీలో గవర్నర్ బస చేశా రు. కాగా.. గవర్నర్ ములుగు జిల్లా పర్యటన ఆంక్షల నడుమ కొనసాగింది. జర్నలిస్టులను అనుమతించలేదు. వరంగల్ పర్యటనకు ముం దు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వెంకటేశంతో కలిసి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. గవర్నర్‌కు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ హనుమంత్ కే జండగే, అనువంశిక ధర్మకర్త బీ నరసింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు ఘన స్వాగ తం పలికారు. అనంతరం గవర్నర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ప్రధానార్చక బృందం చతుర్వేద ఆశీర్వచనం చేయగా.. దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈవో భాస్కర్‌రావు గవర్నర్‌ను వీఐపీ శాలువాతో సన్మానించారు.

**ఏఆర్ కానిస్టేబుల్‌కు విషపురుగు కాటు**

గవర్నర్ పర్యటనలో భాగంగా వెంకటాపూర్ మండలం పాలంపేట అటవీ ప్రాం తంలో బందోబస్తు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ గుండ్ల ప్రశాంత్‌ను విషపురుగు కాటేసింది. అస్వస్థతకు గురైన ప్రశాంత్‌ను పోలీసులు ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

## కరెంట్ షాక్‌తో రైతు మృతి

నిజాంసాగర్, ఆగస్టు 27: పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లిన రైతు విద్యుత్తు షాక్ తగిలి మృతిచెందిన ఘటన కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం వెల్గనూర్‌లో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన మ్యాదరి సాయిరాములు (36) సోమవారం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. మోటర్ నడవకపోవడంతో కరెంట్ సరఫరా ఉందో లేదో పరిశీలిస్తుండగా షాక్ తగిలి మృతి చెందాడు. సాయిరాములు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లగా, విగతజీవిగా ఉన్నాడు. పోలీసులు వివరాలు సేకరించారు. భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కౌలురైతు ఆత్మహత్య

- అప్పుల బాధ తాళ లేక మనస్తాపం
- తీర్చే మార్గం కనిపించక బలవన్మరణం
- రామాయంపేటలో విషాదం



వెల్మల ప్రవీణ్ (ఫైల్)

రామాయంపేట, ఆగస్టు 27: అప్పుల బాధలు భరించలేక.. వాటిని తీర్చే మార్గం కనిపించక ఓ కౌలురైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేటలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వెల్మల ప్రవీణ్ (33) సోమవారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడు. ప్రవీణ్ కొంతకాలంగా అప్పులతో బాధపడుతున్నాడని, వాటిని తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి జ్యోతి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉపాధి లేక ఆటో డ్రైవర్ ..

- అప్పులు పేరుకపోవడంతో మనస్తాపం
- డీజిల్ పోసుకుని బలవన్మరణం
- భద్రాద్రి జిల్లాలో ఘటన



ఇమ్మాన్యుయేల్ (ఫైల్)

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 27 : ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంగళవారం చోటుచేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకా రం.. కొత్తగూడెంలోని హనుమాన్ బస్తీకి చెందిన కొప్పుల ఇమ్మాన్యుయేల్ (54) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆటో కోసం అప్పు చేయడం, ఆ తరువా త ఉపాధి కరువై ఆటో నడవకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. అలాగే కుటుంబ సమస్యలతో సతమతమవుతున్న ఇమ్మాన్యుయేల్ మద్యానికి బానిసయ్యాడు. సోమవారం కూడా ఇంట్లో గొడవ జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. మనస్తాపం చెందిన ఇమ్మాన్యుయేల్ మంగళవారం ఇంట్లో ఉన్న డీజిల్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**• యూరియా కోసం రైతుల క్యూ**



ములుగు జిల్లా కేంద్రంలోని పాత ఎఫ్‌సీఐ గోదాంల వద్ద మంగళవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో అందించే యూరియా కోసం రైతులు ఎండలో క్యూ కట్టారు. గవర్నర్ పర్యటన సందర్భంగా అన్ని దుకాణాలను మూసివేయడంతో జిరాక్స్‌ల కోసం రైతులు నానా తంటాలు పడ్డారు. పోలీసులు వన్‌వే పెట్టి ఎక్కడికక్కడ ద్విచక్రవాహనాలను నిలుపడంతో కొందరు రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. –ములుగురూరల్

**• సిమెంట్ ఫ్యాక్టరీకి మా భూములివ్వం**




ఆదిలాబాద్ రూరల్ మండలం రామాయి వద్ద ఏర్పాటు చేయనున్న రేణుక సిమెంట్ ఫ్యాక్టరీకి తమ భూములు ఇచ్చే ప్రసక్తే లేదని ఆదిలాబాద్ రూరల్, జైనథ్ మండలాలకు చెందిన 8 గ్రామాల రైతులు తేల్చి చెప్పారు. భూములు ఇవ్వాలని రెవెన్యూ అధికారులు వేధించడాన్ని నిరసిస్తూ మంగళవారం వారు ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. – ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ

**• పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి**



పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గంలోని మాజీ సర్పంచ్‌లు మంగళవారం భైంసా పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. – భైంసా

**• ప్రాణాలైనా ఇస్తాం.. ఫార్మాకు భూములియ్యం**



సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలంలో ఫార్మా విలేజ్ ఏర్పాటుకు రైతుల నుంచి అడుగడుగునా నిరసన వ్యక్తమవుతున్నది. మంగళవారం దుద్యాల తహసీల్దార్ కార్యాలయంలో పోలేపల్లికి చెందిన మహిళా రైతు తూర్పు రాజమ్మ పురుగుల మందు డబ్బాను బయటకు తీసి చావనైనా చస్తాను గానీ భూమి మాత్రం ఇచ్చేది లేదని చెప్పారు. అప్రమత్తమైన తోటి రైతులు ఆమె చేతిలోని పురుగుల మందు డబ్బాను గుంజుకున్నారు. – బొంరాస్‌పేట

# రుణం చెల్లించినా కానీ రుణమాఫీ

**ఆదిలాబాద్ జిల్లాలో వెలుగుచూస్తున్న నిజాలు**



రెబ్బెన పీఏసీఎస్ కార్యాలయం ముందు అంతర్రాష్ట్ర రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు, నాయకులు (ఫైల్)

మంచిర్యాల, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సహకార సంఘాల్లో తప్పుడు లెక్కలు, అక్రమాల వల్ల అనేక మంది రైతులు రుణమాఫీకి అర్హత కోల్పోతున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం (పీఏపీఎస్)లో ముల్కల్ల గ్రామానికి చెందిన రైతు బాపుకు రూ.1,10,515 మాఫీ అయినట్టు సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. వాస్తవానికి ఆయనకు ఉన్న అప్పు రూ.9,727 మాత్రమే.. కానీ లక్షకుపైగా మాఫీ అయినట్టు మెసేజ్ రావడంతో అవాక్కయ్యాడు. పీఏసీఎస్‌కు వెళ్లి అడిగితే పొంతన లేని సమాధానం చెప్పారు. దీంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. డాటా ఎంట్రీ సమయంలో పొరపాటు జరిగిందని, బాపుతో పాటు మరికొందరి రైతులకు ఇలా అయ్యిందంటూ అధికారులు తేల్చారు. రెబ్బెన మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లోనూ ఈ తరహా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. బాధిత రైతులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగడంతో విషయం కలెక్టర్ దాకా వెళ్లింది. ప్రస్తుతం విచారణ నడుస్తున్నది. అయితే పీఏసీఎస్‌లలో అనుకోకుండా పొరపాట్లు జరిగాయా? లేక రైతుల పేరున కొందరు రుణాలు తీసుకొని అక్రమాలకు పాల్పడ్డారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని చోట్ల చనిపోయిన రైతుల పేరిట కూడా రుణాలు ఉండటం ఈ అనుమానాలకు బలం చేకూర్చుతున్నది.



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు యెల్ల రజినీకాంత్. నిర్మల్ జిల్లా కుంటాల మండలం లింబా(కే) తన కుటుంబసభ్యులు కుంటాల పీఏసీఎస్‌లో తీసుకున్న రుణాన్ని 2018లో వడ్డీతో కలిపి రూ.50,450 చెల్లించాడు. తర్వాత గ్రామీణ బ్యాంక్‌లో రూ.2 లక్షలు రుణం తీసుకున్నాడు. ఈ రుణం మాఫీ కాలేదు. ఆరా తీయగా కో–ఆపరేటివ్ బ్యాంక్‌లో రూ.67,274 లోన్ ఉన్నదని వ్యవసాయ అధికారులు చెప్పారు. దీంతో 2018లో చెల్లించిన రసీదు తీసుకొని సొసైటీకి వెళ్లాడు. తనకు రుణమాఫీ అయితదా? కాదా? అన్న దిగాలులో ఉన్నాడు. **-యెల్ల రజినీకాంత్**



కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం నంబాలకు చెందిన సంజీవ్ కుమార్ జైస్వాల్. ఈయన భార్య సంగీత పేరుపై ఉన్న 3.10 ఎకరాల వ్యవసాయ భూమికి రెబ్బెన పీఏసీఎస్‌లో రుణం తీసుకున్నారు. 2021లో రుణం చెల్లించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో రూ.లక్ష, తన పేరుపై రూ.60 వేల రుణం తీసుకున్నాడు. ఈ రుణం మూడో విడుతలో మాఫీ అవుతుందనుకున్నాడు. తీసుకున్న రుణం కట్టినప్పటికీ రూ.1.25 లక్షలు తీసుకున్నట్లే చూపిస్తున్నది. దీంతో రుణమాఫీకి అర్హత కోల్పోయాడు. **-సంజీవ్ కుమార్ జైస్వాల్**

## నేటి నుంచి గ్రామాలవారీగా రైతుల సర్వే: తుమ్మల

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీలో జరిగిన లోపాల సవరణకు నేటి(బుధ వారం) నుంచి పూర్తిస్థాయిలో గ్రామా ల వారీగా సర్వే నిర్వహించనున్నట్టు వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. రైతు రుణమాఫీపై మంగళవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బ్యాంక్‌ల నుంచి వచ్చిన వివరాల్లో తప్పులను మండల వ్యవసాయ అధికారులతో వేగవంతంగా సవరించనున్నట్టు చెప్పారు. ఆగస్టు 15నాటికి 22,37,848 లక్షల మంది రైతులకు రూ.2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేసినట్టు ఆ శాఖ కార్యదర్శి రఘునందనరావు మంత్రికి వివరించారు. కుటుంబ సభ్యుల నిర్ధారణ కాని రైతుల కోసం యాప్ రూపొందించినట్టు చెప్పారు. సమీక్షలో రాష్ట్ర వ్యవసాయ సంచాలకుడు గోపి, సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి ఉక్కిరి బిక్కిరి

మొదటిపేజీ తరువాయి...


బయటకు వస్తున్న మంత్రి తుమ్మల కారును ప్రధాన గేటు వద్ద రైతులు అడ్డగించారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో కారు దిగిన తుమ్మల వారితో మాట్లాడారు. అయినప్పటికీ వారు నినాదాలు ఆపకపోవడంతో తీవ్ర అసహనానికి గురై రైతులపై చెయ్యెత్తారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ రైతు రుణమాఫీ చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో 41,78,892 మంది రైతులు 40 బ్యాంకుల ద్వారా 5,782 బ్రాంచిల నుంచి రుణాలు తీసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం రూ.31 వేల కోట్ల నిధులను కేటాయించిందని చెప్పారు. 12 డిసెంబర్ 2018 నుంచి 9 డిసెంబర్ 2023 వరకు రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించి, అమలు చేస్తుందని తెలిపారు. ఇప్పటివరకు రూ.12 వేల కోట్లు రైతుల ఖాతాల నుంచి తిరిగి రుణాలుగా పొందారని చెప్పారు. కుటుంబ నిర్ధారణ జరగకనే రుణమాఫీ ఆలస్యమవుతున్నదని, ప్రభుత్వపరంగా ఎలాంటి జాప్యం లేదని స్పష్టం చేశారు. మంగళవారం నుంచి వ్యవసాయ అధికారులు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తారని చెప్పారు. కుటుంబసభ్యుల ఫొటోలను ప్రత్యేకయాప్‌లో అప్‌లోడ్ చేస్తారని తద్వారా రుణమాఫీ మొత్తం రైతు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు.

**సగం మంది రైతులకే రుణమాఫీ**

అంతకుముందు ధర్నాలో సీపీఐ, సీపీఎం నాయకులు, రైతుసంఘాల నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో సగం మంది రైతులకే రుణమాఫీ జరిగిందని, ప్రభుత్వ లెక్కలు అసంబద్ధంగా ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 30 శాతం మందికి కూడా రుణమాఫీ జరగలేదని పేర్కొన్నారు. ఆగస్టు 30వ తేదీలోపు 2లక్షల రుణమాఫీ జరగాలని లేదంటే రైతులతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. ధర్నా అనంతరం రైతుల డిమాండ్లు, సమస్యల పరిష్కారం కోరుతూ రెండు పార్టీలు నేతలు, రైతు సంఘాల నేతలు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

## మరో నేత కార్మికుడి బలవన్మరణం

**ఉపాధిలేక బతుకు భారమై.. • సిరిసిల్లలో వైపని కార్మికుడి ఆత్మహత్య**



సతీశ్ (ఫైల్)

సిరిసిల్ల తెలంగాణ చౌక్, ఆగస్టు 27 : సిరిసిల్లలో మరో నేత కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. కొన్ని నెలలుగా ఉపాధి లేక బతుకు భారమై నేత (వైపని) కార్మికుడు ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. బీవై నగర్‌కు చెందిన జక్కని సతీశ్ (22) తల్లిదండ్రులు 20 ఏండ్ల కిందటే చనిపోయారు. దీంతో తన అక్క సువర్ణ వద్ద ఉంటున్నాడు. ఆమె భర్త సైతం పదేండ్ల కిందటే ఆత్మహత్య చేసుకోగా, బీడీలు చేస్తూ తమ్ముడు సతీశ్‌ను పెంచింది. సతీశ్ వైపని పనిచేస్తూ అక్కకు ఆర్థికంగా సహాయపడేవాడు. కొన్ని నెలలుగా ఎలాంటి ఉపాధి లేకపోవడంతో ఇల్లు గడవడం లేదు. ఈ క్రమంలో రూ.1.5 లక్షల వరకు అప్పు చేశాడు. ఉపాధి లేక, అప్పు తీర్చే మార్గం కానరాక తీవ్ర మనస్తాపం చెందిన సతీశ్ మంగళవారం ఇంట్లోని దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

**• కలెక్టరేట్ల ఎదుట రైతుల నిరసన**





రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం కలెక్టరేట్ల ఎదుట రైతులు ధర్నా చేశారు. అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కొందరికే రుణమాఫీ డబ్బులు వచ్చి మిగతా రైతులకు రాకపోవడంపై రైతు సంఘాల నేతలు మండిపడ్డారు. –నమస్తే తెలంగాణ నెట్‌వర్క్

# నోటీసులు ఇస్తే తెల్లారే కూల్చేస్తా..

- నిబంధనల మేరకే ఫాంహౌస్
- 111 జీవో ప్రకారమే కట్టుకున్నా
- ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 27(నమస్తే తెలంగాణ)/ఖైరతాబాద్ : ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో తన ఫాంహౌస్‌లేదని, ఒకవేళ హైడ్రా నోటీసులు ఇస్తే.. తెల్లారే తన ఇంటిని తానే కూల్చేస్తానని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. నిబంధనల ప్రకారమే ఫాంహౌస్ నిర్మించినట్టు తెలిపారు. 111 జీవో ప్రకారం చాలా మంది పెద్దలు భవనాలు నిర్మించుకున్నారని, అందరితో పాటు తాను కూడా నిర్మించుకున్నానని చెప్పారు. తన ఫాంహౌస్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందంటూ వచ్చిన విమర్శలపై ఆయన స్పందించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గండిపేట చెరువు పైభాగాన కొత్వాల్‌గూడలో 14.14 ఎకరాల భూమిని 1999లో కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఈ భూమి తన కొడుకు రినీష్ పేరుపై ఉన్నట్టు చెప్పారు. పట్టా భూమినే కొనుగోలు చేశానని వివరించారు. అక్కడ ఇరిగేషన్ అధికారులు, కలెక్టర్ చెప్పిన విధంగా నిబంధనల ప్రకారమే ఇల్లు కట్టుకున్నానని, నిబంధనలకు వ్యతిరేకంగా ఉందంటే తానే కూల్చివేస్తానని, ప్రభుత్వం కూల్చాల్సిన అవసరంలేదని స్పష్టంచేశారు. చెరువుల కబ్జాను కూల్చాల్సిందేనని తేల్చిచెప్పారు. ఇప్పటివరకు తనకు ఎలాంటి నోటీసులు రాలేదని, ఒకవేళ వస్తే తెల్లారే ఇంటిని కూల్చేస్తానని చెప్పారు.

# అంతా సక్రమమైతే... చుట్టూ నీళ్లెందుకు?!

- ఎమ్మెల్సీ పట్నం వ్యాఖ్యలపై జనం విస్మయం
- అన్ని అనుమతులుంటే అది సక్రమమేనా?



హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): చుట్టూ నీళ్లు.. మధ్యలో ఫాంహౌజ్.. ఐలాండ్‌ను తలపించేలా సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి గెస్ట్‌హౌస్ అందరికీ సుపరిచితమే. అది సక్రమ నిర్మాణమేనని ఎమ్మెల్సీ ప్రకటించడం చర్చనీయాంశమైంది. జంట జలాశయాల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల్లో నిర్మాణాలు ఉన్నట్టు స్పష్టంగా తెలుస్తున్నా కాంగ్రెస్ నేతలు బుకాయిస్తూనే ఉన్నారు. మొన్నటికి మొన్న బఫర్‌జోన్‌లో తన నిర్మాణం ఉంటే కూల్చుకోమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించి ఆపై మౌనవ్రతం చేస్తున్నారు. తాజాగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి తెరపైకొచ్చారు. హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న గెస్ట్‌హౌస్ దృశ్యాలు చూసి లోకమంతా నివ్వెరపోతుంటే.. ఆయన మాత్రం తాపీగా అంతా సక్రమమేనని ప్రకటించారు. అన్ని అనుమతులు ఉన్నాయని, కలెక్టర్‌తోపాటు అధికారులు చెప్పిన తర్వాతనే నిర్మించానని మంగళవారం ప్రకటించారు. మరి హైడ్రా కూల్చివేసిన పలు నిర్మాణాలకు కూడా అనుమతులు ఉన్న విషయాన్ని ఎమ్మెల్సీ గుర్తించడం లేదు. రెండు రోజుల కిందట రాయదుర్గంలో కట్టుబట్టలతో మూడు కుటుంబాలను నిర్బంధించి కూల్చివేసిన ఇండ్లు కొన్ని దశాబ్దాలుగా ఆస్తి పన్ను, కరెంటు బిల్లులు చెల్లిస్తున్నారు. అయినప్పటికీ నిర్దాక్షిణ్యంగా అధికారులు కూల్చివేతలకు పాల్పడ్డారు. అనుమతులు ఉన్నాయా? పన్నులు చెల్లిస్తున్నారా? అని ఆరా తీయడం లేదు. హిమాయత్‌సాగర్‌లో పట్నం మహేందర్‌రెడ్డికి చెందిన ఫాంహౌస్ భూమి పట్టానే కావచ్చు... కానీ అది ఎఫ్‌టీఎల్‌లో ఉందనే వాస్తవం జగమెరిగిన సత్యం. అయినా ఎమ్మెల్సీ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా ఉంటే నేనే కూల్చివేస్తానని స్పష్టం చేశారు. ఇంత జరుగుతున్నా జలమండలి అధికారులు అక్కడికి వచ్చి ఎఫ్‌టీఎల్ నిర్ధారించకపోవడం శోచనీయం.

## వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 36.5°c | 22.8°c |
| మెదక్ | 34.2°c | 21.8°c |
| రంగారెడ్డి | 34.1°c | 21.3°c |
| వరంగల్ | 33.0°c | 25.0°c |
| నిజామాబాద్ | 32.6°c | 23.6°c |
| కరీంనగర్ | 32.0°c | 25.0°c |
| ఖమ్మం | 32.0°c | 25.0°c |
| నల్లగొండ | 31.0°c | 24.2°c |
| హైదరాబాద్ | 30.0°c | 23.0°c |
| మహబూబ్‌నగర్ | 30.1°c | 22.3°c |

## రాష్ట్రంలో మరో ఆరు రోజులు వర్షాలు!

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో ఆరు రోజులపాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని తెలిపింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని, దీని ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జగిత్యాల, ములుగు, ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు కురువొచ్చని పేర్కొంది. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్‌లో వాతావరణం పొడిగా ఉంటుందని వాతావరణ కేంద్రం అధికారులు చెప్పారు. ఉదయం ఎండగా అనిపించినా.. మధ్యాహ్నం తర్వాత వాతావరణం చల్లబడుతుందని సాయంత్రానికి వర్షం కురిసే అవకాశం ఉన్నదని తెలిపారు. గడిచిన 24 గంటల్లో కామారెడ్డి జిల్లా తాడ్వాయిలో అత్యధికంగా 2.22 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

# హైడ్రా పేరిట రేవంత్ డ్రామా

**ఎంపీ ఈటల రాజేందర్**



కమలాపూర్, ఆగస్టు 27: హైడ్రా పేరిట సీఎం రేవంత్‌రెడ్డి డ్రామా ఆడుతున్నాడని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. మంగళవారం ఆయన హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో మీడియాతో మాట్లాడారు. ఎన్నడూ ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా సక్కగా పదవి చేపట్టని రేవంత్‌రెడ్డి మాయమాటలు చెప్పి ముఖ్యమంత్రి అయ్యాడని ఆరోపించారు. 'అబద్ధాలాడే వాళ్లనే ప్రజలు ప్రజాప్రతినిధులుగా ఎన్నుకుంటరు. ప్రభుత్వం వస్తది, నిజం చెప్పేవాళ్లని ఎన్నుకోరు' అని రేవంత్‌రెడ్డి అమెరికాలో చెప్పాడని, ఇప్పుడే అదే నిజమైందని అన్నారు. ఎన్నికల ముందు 65 లక్షల మంది రైతులు ఉన్నారని, రూ.48 వేల కోట్లతో రుణమాఫీ చేస్తామని చెప్పి, ఇప్పుడు 45 లక్షల మంది రైతులే ఉన్నారని, 34వేల కోట్లు సరిపోతుందని చెప్పి, చివరకు రూ. 17 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశాడని దుయ్యబట్టారు.

# జన్వాడలో హైడ్రామా!

మొదటిపేజీ తరువాయి...

గుమిగూడిన ప్రజలను పంపించేశారు. బుల్కాపూర్ నుంచి గండిపేట వరకు ఉన్న ప్రాంతాల్లో వర్షం పడినపుడు వరదనీరు గండిపేట జలాశయంలోకి వెళుతుంది. వరదనీరు వెళ్లే నాలాకే బుల్కాపూర్ నాలా అని పేరు. శంకర్‌పల్లి పరిధిలోని బుల్కాపూర్ నుంచి జన్వాడ, కోకాపేట, నార్సింగి, పుప్పాలగూడ, మణికొండ, ఇబ్రహీంబాగ్ చెరువుమీదుగా బుల్కాపూర్ నాలా గండిపేట వరకు ఉంటుంది. గండిపేటలో సర్‌ప్లస్ వాటర్ హుస్సేన్‌సాగర్‌లోకి మళ్లించేలా గండిపేట నుంచి షేక్‌పేట, టోలిచౌకి, ఎండీ లైన్స్, చింతల్‌బస్తీ, ఖైరతాబాద్ మీదుగా హుస్సేన్‌సాగర్ వరకు కూడా బుల్కాపూర్ నాలా ఉంది. బుల్కాపూర్ గ్రామం నుంచి గండిపేట వరకు ఉన్న బుల్కాపూర్ నాలా ఒక్కోచోట ఒకో రీతిలో విస్తరించి ఉంది. ఆ మేరకు ఆయా గ్రామాల నక్షాలో బుల్కాపూర్ నాలా ఎంత వెడల్పులో ఉందనేది స్పష్టంగా ఉంది. జన్వాడ మీదుగా వెళుతున్న బుల్కాపూర్ నాలాను అనుసరించే ప్రదీప్‌రెడ్డికి చెందిన ఫాంహౌస్ ఉంది. గండిపేట ఎఫ్‌టీఎల్ నుంచి జన్వాడ రెండు కిలోమీటర్లపైగా దూరంలో ఉంటుంది. కానీ ఒక సెక్షన్ మీడియా గండిపేట ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో జన్వాడ ఫాంహౌస్ ఉందని దుష్ప్రచారం చేస్తుంది.



జన్వాడలో బుల్కాపూర్ నాలా సర్వే చేస్తున్న అధికారులు

### నిబంధనలు ఇవి

సాధారణంగా నాలా, సాగునీటి కాల్వలకు రెండు వైపులా బఫర్‌జోన్ ఉంటుంది. నిబంధనల ప్రకారం పది మీటర్లలోపు విస్తీర్ణంలో ఉన్న నాలా, కాల్వలకు బఫర్‌జోన్ రెండు మీటర్లుగా ఉంది. అదేవిధంగా పది మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో (ఎంతైనా సరే) ఉంటే బఫర్‌జోన్ తొమ్మిది మీటర్లుగా నిర్ధారించాలి. బుల్కాపూర్ నాలా సగటున పది మీటర్ల కంటే ఎక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో దాని బఫర్‌జోన్ గరిష్ఠంగా తొమ్మిది మీటర్లుగా ఉంటుంది. కాగా జన్వాడలోని గెస్ట్‌హౌస్‌కు సంబంధించి ఒక ఉన్నతాధికారి మాట్లాడుతూ కేవలం గేటు, ముందు ఉన్న ప్రహరీ మాత్రమే బఫర్‌జోన్ పరిధిలోకి వచ్చే అవకాశముంది తప్ప అందులోని భవనం చాలా దూరంలో ఉన్నదని చెప్పారు.

# అక్రమ బిల్డర్ల ఆస్తులు జప్తు చేయండి

- బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి
- పేదవాళ్లకు ప్రభుత్వం భూమి లేదా ఇందిరమ్మ ఇల్లు
- హైడ్రాపై సీఎంకు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ విజ్ఞప్తి

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): అక్రమ కట్టడాల బిల్డర్స్ ఆస్తులు జప్తు చేసి బాధితులకు నష్ట పరిహారం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ విజ్ఞప్తి చేశారు. హైడ్రా పనితీరుపై సీఎం రేవంత్‌రెడ్డికి ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ పలు సూచనలు, సలహాలు చేశారు. పేదవారి ఇళ్లు కూల్చినప్పుడు వారికి ప్రభుత్వం భూమి ఇవ్వాలని లేదా ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని కోరింది. బిల్డర్లతో కుమ్మక్కై ఇష్టారీతిన రిజిస్ట్రేషన్లు, లే అవుట్ పర్మిషన్లు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువుల నుంచి కూల్చిన కట్టడాల వ్యర్థాలను తీసి, చుట్టూ కంచె వేసి, కాలనీ వాసులకు చెరువును అప్పగించాలని కోరారు. హైడ్రా వంటి సంస్థలు జిల్లాల్లోనూ కావాలని ప్రజలు కోరుతున్నారని, రాష్ట్రమంతటికీ వర్తించేలా ఒక చట్టం చేసి ప్రభుత్వ భూములు కాపాడటానికి సంస్థను ఏర్పాటు చేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ విజ్ఞప్తి చేశారు.

# కోట్ల విలువైన భూపందేరంపై పిల్

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ గచ్చిబౌలిలో పర్యాటక శాఖ రూ.కోట్ల విలువైన 3 ఎకరాల భూమిని సప్తర్షి హోటల్‌కు కట్టబెట్టడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంలో హైకోర్టు మంగళవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం ఆదేశించింది. గచ్చిబౌలిలో సర్వే నంబర్ 91లో ఉన్న ఈ భూమిని 2010లో సప్తర్షి హోటల్‌కు అప్పగించిన వ్యవహారంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని బక్క జడ్సన్ వేసిన పిటిషన్‌పై విచారణను 4వారాలకు వాయిదా వేసింది.

# వాస్తవాలను దాచి పిల్ వేయడంపై హైకోర్టు ఆగ్రహం

**కేసును సివిల్ కోర్టులోనే తేల్చుకోవాలని స్పష్టీకరణ**

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సంజీవరెడ్డినగర్‌లోని బీకే గూడలో 102/3, 102/2 సర్వే నంబర్లలో ఉన్న 1,537 చదరపు గజాల క్రీడా మైదానాన్ని పరిరక్షించడంలో అధికారులు విఫలమయ్యారంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని హైకోర్టు డిస్మిస్ చేసింది. ఆ క్రీడా మైదానాన్ని పరిరక్షించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ గతంలో ఓ పిటిషన్‌ను వేసి వాపసు తీసుకున్న వాస్తవాన్ని గుట్టుగా ఉంచడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ వివాదాన్ని సివిల్ కోర్టులోనే తేల్చుకోవాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం స్పష్టం చేసింది.

## బదిలీల్లో 89 చోట్ల తప్పులు

**సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి**



హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): బదిలీలు, ప్రమోషన్లలో 89 చోట్ల తప్పులు జరిగాయని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ(టీజీడబ్ల్యూఆర్‌ఈఐఎస్) కార్యదర్శి అలుగు వర్షిణి తెలిపారు. వాటిని కూడా పరిష్కరిస్తున్నట్టు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. పాఠశాలల్లో వారంలో రెండుసార్లు మెడిటేషన్ తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. తరగతుల నిర్వహణకు బ్రహ్మకుమారీస్ సంస్థతో సొసైటీ అవగాహన కుదుర్చుకుందని, గురుకుల టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని గురుకుల విద్యార్థులకు అందించేందుకు కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్ సంస్థల వలంటీర్లతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

## ఐఐఐటీహెచ్‌తో పోలీసు అకాడమీ ఎంవోయూ

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): మారుతున్న సాంకేతిక పరిస్థితులను క్షుణ్ణంగా పోలీసులకు వివరించడంతోపాటు, సైబర్ సెక్యూరిటీ నైపుణ్యాలను నేర్పించడానికి తెలంగాణ పోలీసు అకాడమీ, ఐఐఐటీ హైదరాబాద్‌తో మంగళవారం ఒప్పందం చేసుకుంది. పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాషబిస్త్, ఐఐఐటీ ప్రతినిధులతో కలిసి ఎంవోయూపై సంతకం చేశారు.

## ప్రైవేటు టీచర్లకు పురస్కారాలు ఇవ్వాలి

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రైవేటు టీచర్లకు పురస్కారాలు ఇవ్వాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అలీ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ప్రజాభవన్‌లో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జీ చిన్నారెడ్డికి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలోని 11 వేల పైచిలుకు ప్రైవేటు స్కూళ్లలో 2.5 లక్షల మంది టీచర్లు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ టీచర్లకు న్యాయం జరిగేటట్టు చూడాలని విద్యాశాఖ కమిషనర్ నరసింహారెడ్డికి ఫోన్‌లో విన్నవించినట్టు పేర్కొన్నారు.

## డీఎస్సీ 'స్పోర్ట్స్' సర్టిఫికెట్స్ అప్‌లోడ్ చేయాలి

హైదరాబాద్, ఆగస్టు 27(నమస్తే తెలంగాణ): స్పోర్ట్స్ కోటాలో డీఎస్సీ-2024 పరీక్షకు జిల్లాలవారీగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు క్రీడా ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాలని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మంగళవారం ప్రకటనలో సూచించారు. నేటి నుంచి 2 వరకు అఫిషియల్ వెబ్‌సైట్ ద్వారా స్పోర్ట్స్ సర్టిఫికెట్లను సమర్పించాలని కోరారు.

## 5లోగా 'మేనేజ్‌మెంట్' వివరాలు వెల్లడించండి

బీఈ/బీటెక్ కోర్సుల్లో ఈ ఏడాది మేనేజ్‌మెంట్ కోటా సీట్ల వివరాలను 5లోగా వెల్లడించాలని ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీ యాజమన్యాలకు తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ సూచించారు. అప్‌లోడ్ చేసిన వివరాలను ఫ్రీజ్ చేయడానికి వచ్చే నెల 5 చివరి గడవు అని తెలిపారు. రూ. వెయ్యి అపరాధ రుసుముతో 10 వరకు అవకాశం కల్పించినట్టు వెల్లడించారు. www.tgche.ac.in ను చూడాలని కోరారు.

# అక్బర్ వార్నింగ్.. హైడ్రా వెనక్కి!

- విద్యాసంవత్సరం మధ్యలో ఆ భవనాల జోలికి వెళ్లం
- విద్యార్థులు నష్టపోవద్దనే నిర్ణయమని హైడ్రా ప్రకటన
- ఎంఐఎంకు తలొగ్గింది అని ప్రజలలో విస్తృతంగా చర్చ



హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): విద్యాసంవత్సరం మధ్యలో విద్యాలయాల అక్రమ భవనాలను కూల్చబోమని హైడ్రా ప్రకటించింది. ఎంఐఎం శాసనసభపక్ష నేత అక్బరుద్దీన్ ఇచ్చిన వార్నింగ్‌తోనే హైడ్రా తోకముడిచిందని సోషల్‌మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతున్నది. నగరంలో కూల్చివేతలతో హైడ్రా చేసిన హడావిడి అంతా హైడ్రామా అంటూ ప్రతిపక్షాలు ఆరోపిస్తూనే ఉన్నాయి. హైడ్రాకు దమ్ముంటే ఓవైసీ సోదరులు సల్కం చెరువులో నిర్మించిన ఫాతిమా విద్యాసంస్థల భవనాలను కూల్చాలని సోషల్ మీడియా, పర్యావరణవేత్తలు, సామాజిక కార్యకర్తలు, మీడియా గొంతెత్తింది. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి ఎంఐఎం పార్టీ నేతల భవనాలను కూల్చేస్తారా? లేదా?అంటూ రెండు మూడు రోజులుగా సోషల్‌మీడియాలో ట్రెడింగ్ అయింది. అక్బరుద్దీన్ తనపై కాల్పులు జరిపినా ఒప్పుకుంటా కానీ విద్యాసంస్థలను ముట్టుకోవద్దని హెచ్చరించారు. ఒకవేళ కూల్చితే 40వేల మంది విద్యార్థులు ప్రభుత్వంపై తిరగబడుతారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంపై ఏం జరుగుతుందోననే ఉత్కంఠ నగరవాసుల్లో వ్యక్తమైంది. కానీ కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా హైడ్రా విద్యాసంవత్సరం మధ్యలో ఆ భవనాలను ముట్టుకోబోమని ప్రకటించింది. అక్బర్‌ద్దీన్ పవర్‌ఫుల్ వార్నింగ్‌కు ప్రభుత్వం వణికిపోతూ వెనుకడుగు వేసిందనే చర్చ మొదలైంది.

### విద్యార్థులు నష్టపోవద్దనే !

విద్యార్థులు నష్టపోవద్దనే విద్యాసంవత్సరం పూర్తయిన తరువాతనే చర్యలకు ఉపక్రమిస్తామని హైడ్రా అధికారులు తెలిపారు. హైడ్రాకు వస్తున్న ఫిర్యాదులపై ఆయా శాఖలు సంబంధిత స్థలాలకు వెళ్లి పరిశీలిస్తున్నాయని చెప్పారు. ఒక సల్కం చెరువుకే కాకుండా విద్యాసంస్థలకు సంబంధించి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి విషయంలో ఇదే విధానం కొనసాగిస్తామని కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, ప్రభుత్వ స్థలాలలో భవనాలు నిర్మించిన యజమాన్యాలు స్వచ్ఛందంగా కూల్చివేయాలని సూచించారు.



ఖమ్మం వెలుగుమట్లలో నిర్మాణాల తొలగింపును అడ్డుకుంటున్న నిరుపేదలు

# పేదల గుడిసెల తొలగింపులో ఉద్రిక్తత

- పట్టా భూములంటూ కూల్చడానికొచ్చిన పోలీసులు
- రేకుల షెడ్ల కూల్చివేతలను అడ్డుకున్న నిరుపేదలు

రఘునాథపాలెం, ఆగస్టు 27: ఖమ్మం అర్బన్ పరిధిలోని వెలుగుమట్లలో పేదలు వేసుకున్న రేకుల షెడ్లు, గుడిసెల తొలగింపు ఉద్రిక్తంగా మారింది. సర్వే నంబర్ 148, 149లో నిరుపేదలు నిర్మించుకున్న రేకుల షెడ్లను తొలగించేందుకు పోలీసులు జేసీబీలతో రంగప్రవేశం చేశారు. విషయం తెలుసుకున్న పేదలు జేసీబీలకు అడ్డంగా నిల్చొని కూల్చివేతలను నిలువరించారు. ఏసీపీ రమణమూర్తి, పలువురు సీఐలు మైక్ ద్వారా హెచ్చరికలు జారీ చేసినా ఏమాత్రమూ తగ్గలేదు. ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చేస్తారని నిలదీశారు. పట్టా భూములను ఆక్రమించి షెడ్లు నిర్మించడం సరికాదని, షెడ్లు వేయించిన నాయకులకు రెండు నెలలుగా తొలగించాలని చెప్పిన విషయాన్ని ఏసీపీ రమణమూర్తి మైక్ ద్వారా పేదల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన పేదలు.. తమకు రెండు రోజుల గడువు కావాలని, స్వచ్ఛందంగా షెడ్లను తొలగిస్తామని ఏసీపీని వేడుకున్నారు. దీనికి నిరాకరించిన పోలీసులు.. మరోమారు యంత్రాలతో రేకుల షెడ్లను కూల్చివేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. పోలీసుల ప్రయత్నం విఫలం కావడంతో పట్టా భూమి యజమానులు 100 మందికి పైగా రంగంలోకి దించారు. వారంతా మద్యం మత్తులో అక్కడున్న పేదలను భయభ్రాంతులకు గురిచేశారు. ఇదంతా పోలీసుల కండ్లముందే జరుగుతున్నా వారు ప్రేక్షక పాత్ర పోషించారు.

భూదాన్ భూమి పేరుతో కొందరు వ్యక్తులు తమ దగ్గర రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకు డబ్బులు తీసుకున్నారని, దగ్గరుండి మరీ 100 గజాల చొప్పున జాగా చూపించి షెడ్లు వేయించారని నిరుపేదలు వాపోయారు. తీరా చూస్తే తాము గుడిసెలు వేసుకున్న భూమి పట్టా అని తేలడంతో మోసపోయామని గుండెలు బాదుకుంటూ రోదించారు.



## కూల్చివేతలతో కాంగ్రెస్ హైడ్రామా

**దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**

దుబ్బాక, ఆగస్టు 27 : కాంగ్రెస్ ప్రభుత్వం తన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు హైడ్రా పేరిట హైడ్రామా అడుతున్నదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా దుబ్బాకలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి, హైడ్రా పేరిట పేదలను ఇబ్బందులకు గురిచేస్తూ విధ్వంసాన్ని సృష్టిస్తుందని ఆరోపించారు. పంట రుణాల మాఫీ, సంక్షేమ పథకాలను మరిచిపోయేందుకు హైడ్రా పేరిట నాటకాన్ని ప్రారంభించిందని విమర్శించారు. ప్రజాపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసిందని, ప్రజలు డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, విష జ్వరాలతో బాధపడుతున్నారని, దవాఖానలకు పోతే అక్కడ సరైన వైద్య సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాలు అస్తవ్యస్తంగా మారాయని విమర్శించారు.



ఎంజీబీఎస్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

# మోగిన ఆర్టీసీ కార్మికుల రణభేరి

- యాజమాన్యం, సర్కారు నిర్లక్ష్యంపై పోరుబాట
- నల్లబ్యాడ్జీలతో నిరసనలు

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): యాజమాన్య అలసత్వం, సర్కారు నిర్లక్ష్యంపై ఆర్టీసీ కార్మికులు పోరుబాట పట్టారు. ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు మంగళవారం అన్ని ఆర్టీసీ డిపోలు, యూనిట్లలో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, రెండు వేతన సవరణలను అమలు చేస్తామని, యూనియన్ల కార్యకలాపాలను పునరుద్ధరిస్తామని, సంస్థను విస్తరిస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికలో హామీలు ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని కార్మికులంతా ఆగ్రహంతో ఉన్నారు. 2013 వేతన సవరణ బకాయిలు కేవలం డ్రైవర్లకే చెల్లించి ఆరు నెలలు గడిచినా మిగతా ఉద్యోగులకు చెల్లించకుండా జాప్యం చేస్తున్నదని మండిపడుతున్నారు. పదేండ్ల నుంచి ఆర్టీసీ నుంచి 13 వేల మంది కార్మికులు వైదొలిగినా, ఒక్కరినీ కొత్తగా నియమించకపోవడంతో పనిభారం పెరిగింది.మహాలక్ష్మి పథకం అమలుతో డ్రైవర్, కండక్టర్లపై ఒత్తిడి అధికమైందని, చిన్నాచితక కేసులతో ఉద్యోగం నుంచి తొలగిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

### ప్రభుత్వం స్పందించకుంటే ప్రత్యక్ష పోరాటం : వెంకన్న, థామస్‌రెడ్డి

ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈ వెంకన్న, వైస్ చైర్మన్ ఎం థామస్‌రెడ్డి తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే తాము పోరాటానికి సిద్ధం కావాల్సి వచ్చిందని తెలిపారు. తొలిరోజైన మంగళవారం కార్మికులందరూ నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారని, శాంతియుత పోరాటానికి యాజమాన్యం, ప్రభుత్వం స్పందించకపోతే ప్రత్యక్ష పోరాటాలు చేయడానికి కార్మికులంతా సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఎంజీబీఎస్, తార్నాక హాస్పిటల్, జూబ్లీబస్‌స్టేషన్లలో థామస్‌రెడ్డి సహా జేఏసీ నేతలైన సుద్దాల సురేశ్, బీ యాదయ్య, రఘురాం, పీబీ రావు, రాములు తదితరులు జేఏసీ పోరాట కరపత్రాలను పంచిపెట్టారు.

# త్వరలో ఆర్టీసీలో 3,035 ఉద్యోగాలు

**రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): టీజీఎస్‌ఆర్టీసీలో కొలువుల భర్తీకి మరో రెండు, మూడు వారాల్లో నోటిఫికేషన్ విడుదల చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్త బస్సుల కొనుగోలు, ఉద్యోగ నియామకాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని మహాలక్ష్మి పథకం ద్వారా లాభాల్లోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. భారీగా ఉద్యోగాల భర్తీ, పెద్దసంఖ్యలో బస్సులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఆర్టీసీని బలోపేతం చేస్తామని ఆయన వెల్లడించారు. ఇప్పటికే తొలి దశలో 3,035 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నిర్ణయించామని, సీఎం రేవంత్ రెడ్డి కూడా దీనికి ఆమోదం తెలిపారన్నారు. ఇందుకు సంబంధించి 2, 3 వారాల్లో నోటిఫికేషన్లు వస్తాయని పొన్నం తెలిపారు. మరో మూడు, నాలుగు వేల పోస్టుల భర్తీ అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామని, దీనిపై కూడా త్వరలో ప్రకటన వెలువరిస్తామన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల విలీన ప్రక్రియపై కమిటీ నివేదిక రావాల్సి ఉన్నదని మంత్రి పొన్నం వివరించారు.

### ఆర్టీసీలో త్వరలో భర్తీ చేయనున్న పోస్టులు

2000 డ్రైవర్, 743 శ్రామిక్,114 డిప్యూటీ సూపరింటెండెంట్(మెకానిక్), 84 డిప్యూటీ సూపరింటెండెంట్(ట్రాఫిక్), 25 డిపో మేనేజర్/అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, 23 అసిస్టెంట్ ఇంజినీర్(సివిల్), 15 అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్,11 సెక్షన్ ఆఫీసర్(సివిల్), 7 మెడికల్ ఆఫీసర్(జనరల్), 7 మెడికల్ ఆఫీసర్(స్పెషలిస్ట్) పోస్టులు ఉన్నాయి.

## వెబ్‌సైట్‌లో 'అసిస్టెంట్ సర్జన్' అభ్యర్థుల జాబితా

హైదరాబాద్, ఆగస్టు 27(నమస్తే తెలంగాణ): పశు సంవర్ధక శాఖలో అసిస్టెంట్ సర్జన్(క్లాస్-ఏ, క్లాస్-బీ) పోస్టులకు ఎంపికైన 171మంది అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటనలో తెలిపింది. ఎంపికైన అభ్యర్థుల జాబితా, వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

## 31న 'టీపీఎస్సీ' వెరిఫికేషన్

హైదరాబాద్, ఆగస్టు 27(నమస్తే తెలంగాణ): గ్రౌండ్ వాటర్ శాఖలో నాన్ గెజిటెడ్ క్యాటగిరీ సాధారణ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను 31న నాంపల్లిలోని టీజీపీఎస్సీ కార్యాలయంలో ఉదయం 10.30కు నిర్వహించనున్నట్టు కార్యదర్శి నవీన్ నికోలాస్ ప్రకటనలో తెలిపారు. 30, 31న వెబ్ ఆప్షన్స్ లింకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో పెట్టినట్టు తెలిపారు. అభ్యర్థుల చెక్‌లిస్ట్, అటెస్టెడ్ ఫామ్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, దాని ఆధారంగా ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

## నేడు ఆర్‌అండ్‌బీపై సీఎం సమీక్ష

హైదరాబాద్, ఆగస్టు 27(నమస్తే తెలంగాణ): రోడ్లు, భవనాల శాఖకు చెందిన వివిధ ప్రాజక్టులు, అభివృద్ధి పనులపై బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు. రీజనల్ రింగురోడ్డు భూసేకరణ పురోగతిపై అధికారులతో చర్చించనున్నారు. ఇందులో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితోపాటు ఉన్నతాధికారులు పాల్గొంటారు.

# మిన్నంటిన ఆనందం



హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నివాసం వద్ద బాణాసంచా కాల్చి జై తెలంగాణ నినాదాలతో సంబురాలు జరుపుకుంటున్న నేతలు, కార్యకర్తలు. చిత్రంలో కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు మేడే రాజీవ్‌సాగర్, పల్లె రవికుమార్‌గౌడ్, రామచంద్రనాయక్



తీహార్ జైలు నుంచి బయటకు వచ్చాక అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత





నల్లగొండలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో పటాకులు సంబురాలు చేసుకుంటున్న శ్రేణులు



నిజామాబాద్ నగరంలోని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కార్యాలయం ఎదుట భారత జాగృతి ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకుంటున్న నాయకులు



తెలంగాణ భవన్ వద్ద పటాకులు కాల్చి జై తెలంగాణ నినాదాలు చేస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, బీఆర్‌ఎస్ నేతలు

**ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ మంజూరవడంతో హైదరాబాద్ సహా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సంబురాలు అంబరాన్నంటాయి. బీఆర్‌ఎస్ నేతలు, శ్రేణులు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఎక్కడికక్కడ బీఆర్‌ఎస్ శ్రేణుల 'జై తెలంగాణ' నినాదాలు మిన్నంటాయి. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ముఖ్య నేతలు పాల్గొని స్వీట్లు పంచుకున్నారు. చివరికి న్యాయమే గెలిచిందని సంతృప్తిని వ్యక్తం చేశారు. విదేశాల్లోనూ సంబురాలు జరుపుకోవడం విశేషం.**



బంజారాహిల్స్ కవిత నివాసంలో ఆమె కుమారుడు ఆర్యకు స్వీటు తినిపిస్తున్న మహిళలు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో పటాకులు కాల్చి సంబురాలు జరుపుకుంటున్న నాయకులు



లండన్‌లో సంబురాలు చేసుకుంటున్న బీఆర్‌ఎస్ ఎన్నారై యూకే నేతలు నవీన్‌రెడ్డి, అనిల్ కూర్మాచలం, రత్నాకర్ కడుదుల, రవి రేటినేని, సత్య చిలుముల



ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, సీనియర్ నేత ఆర్జేసీ కృష్ణ తదితరులు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో బాణాసంచా కాల్చి, జైతెలంగాణ నినాదాలు చేస్తూ సంబురాలు జరుపుకుంటున్న బీఆర్‌ఎస్ శ్రేణులు. చిత్రంలో కొత్తగూడెం మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి



ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే సుమన్

# బెయిల్ రాగానే అంత అక్కసా?

- **కాంగ్రెస్, బీజేపీ ఒక్కటైనట్టు మళ్లీ తేలిపోయింది**
- **బండి సంజయ్, మహేశ్‌గౌడ్ వ్యాఖ్యలే నిదర్శనం**
- **మాజీ మంత్రులు వేముల, గంగుల, శ్రీనివాస్‌గౌడ్ మండిపాటు**
- **వారిద్దరి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్**

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): కర్ణాటకలో వాల్మీకి స్కామ్ జరిగి 5 నెలలైనా నోరుమెదపని బీజేపీ, ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసిన 5 నిమిషాలకే అక్కసు వెళ్లగక్కుతున్నదని బీఆర్‌ఎస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిలివ్వడంపై హర్షం ప్రకటించింది. బెయిల్ మంజూరు సమయంలో దేశ అత్యున్నత న్యాయస్థానం వ్యక్తపరిచిన అభిప్రాయాలే ఎమ్మెల్సీ కవిత తుది తీర్పు సమయంలో ఉంటాయన్న ఆశాభావం వ్యక్తంచేసింది. ఎమ్మెల్సీ కవిత కడిగిన ముత్యంలా కేసు నుంచి బయటికొస్తారని తేల్చిచెప్పింది. ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు అనంతరం మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, వీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఢిల్లీలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, గజ్జెల నగేశ్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు పాల్గొన్నారు. వాల్మీకి స్కామ్‌పై తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ నేతల నోర్లెందుకు మూతపడ్డాయని ధ్వజమెత్తారు. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం డబ్బు తెలంగాణ కాంగ్రెస్ నేతల ఖాతాల్లో జమయ్యాయని, దీనిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. కవితకు బెయిల్ వచ్చిన 5 నిమిషాల్లోనే అక్కసు వెళ్లగక్కిన బండి సంజయ్ భేషరతుగా న్యాయస్థానానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్, పీసీసీ నేత మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యలు న్యాయ వ్యవస్థకు ఉద్దేశాలు ఆపాదించాయని, వారి వ్యాఖ్యలపై ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

### పైశాచిక ఆనందం ఎందుకు?


కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేస్తే కాంగ్రెస్, బీజేపీలు పైశాచిక ఆనందం పొందుతున్నాయని మాజీ మంత్రులు మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు సోనియా, రాహుల్, చిదంబరంకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిందంటే బీజేపీ, కాంగ్రెస్ కలిసిపోయాయని అనుకోవాలా? అని ప్రశ్నించారు. కరీంనగర్‌లో అమృత్ స్కీమ్ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ సృజన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి సమీపబంధువు కాదా? అని ప్రశ్నించారు.

### మద్యం పాలసీ కేసులో కవిత పాత్ర లేదు: కేకే



హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కవిత పాత్ర లేదని తాను భావిస్తున్నట్టు రాజ్యసభ మాజీ సభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు మంగళవారం నాడిక్కడ తెలిపారు. ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడాన్ని తాను స్వాగతిస్తున్నట్టు చెప్పారు. బెయిలు పొందేందుకు కవిత అర్హురాలని తెలిపారు. రాజకీయంగా ఎన్ని కుట్రలు జరిగినా ఆమె పోరాడిందని, ఆ పోరాటానికి సుప్రీంకోర్టు ద్వారా ఫలితం దక్కిందని పేర్కొన్నారు.

### న్యాయం గెలిచింది: మహేశ్ బిగాల



ఢిల్లీ లిక్కర్ పాలసీతో ఏ మాత్రం సంబంధం లేకున్నా ఎమ్మెల్సీ కవితపై ఈడీ అక్రమ కేసు బనాయించి అన్యాయంగా జైల్లో వేయించడం బాధాకరమని బీఆర్‌ఎస్ ఎన్నారై కో ఆర్డినేటర్ మహేశ్ బిగాల ఆవేదన వ్యక్తంచేశారు. లిక్కర్ పాలసీలో ఆమెకు ప్రమేయం లేదని, ఇందుకు సంబంధించి ఆమె వద్ద నుంచి ఎలాంటి పత్రాలు, ఆధారాలు లభించలేదని చెప్పారు.

# చేయని తప్పుకి 5 నెలల నిర్బంధం

- **బండి వ్యాఖ్యలు అనాలోచితం**
- **అయ్యా.. బాంచెన్ అంటే ఎప్పుడో కవిత బయటకొచ్చేవారు: వినోద్**



హైదరాబాద్, ఆగస్టు 27(నమస్తే తెలంగాణ) : చేయని తప్పుకి ఐదు నెలలపాటు ఎమ్మెల్సీ కవితను నిర్బంధించారని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. ఆలస్యంగానైనా బెయిల్ రావడం సంతోషకరమని వ్యాఖ్యానించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కవితపై పెట్టిన కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, కేసులో బీజేపీ వ్యతిరేక వ్యక్తులు లేకుంటే 15రోజుల్లో బెయిల్ వచ్చేదని తాను ఒక న్యాయవాదిగా చెబుతున్నానని స్పష్టంచేశారు. బీజేపీ వ్యతిరేక పార్టీల నాయకులు ఈ కేసులో ఉన్నారు కాబట్టే జైల్లో పెట్టారని చెప్పారు. ఢిల్లీ ప్రభుత్వం చేసిన లిక్కర్ పాలసీపై కేసు పెట్టారని, పైగా సౌత్ గ్రూప్ అని పేరుపెట్టి అహంకారంతో వ్యవహరించారని తెలిపారు. చిన్న కారణంతో తీవ్రమైన ఎండకాలంలో ఐదు నెలలు జైలులో ఉంచడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కేసులో రూపాయి కూడా రికవరీ చేయలేదని, ఎవరో చెప్పిన దానికి కవితను అక్యూజ్డ్ చేశారని చెప్పారు. అయ్యా.. బాంచెన్ అంటే కవిత ఎప్పుడో బయటకు వచ్చేదని, కానీ తలవంచకుండా గట్టిగా నిల్చొని పోరాడాము కాబట్టే ఇంతకాలం జైలులో ఉంచారని వినోద్ పేర్కొన్నారు.

**కేసీఆర్‌ను ఎదుర్కోలేకే: మహిళా నేతలు**

కేసీఆర్‌ను నేరుగా ఎదుర్కొనే దమ్ములేకనే కవితపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, ఆమెపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ మహిళా నేతలు తుల ఉమ, రజినీ సాయిచంద్, లలితారెడ్డి విమర్శించారు. ఈ కేసు నుంచి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని పేర్కొన్నారు. లొంగని వాళ్లపై సీబీఐ, ఈడీలను బీజేపీ ప్రయోగిస్తున్నదని, కవిత విషయంలోనూ ఇదే జరిగిందని చెప్పారు. బెయిల్‌పై కాంగ్రెస్, బీజేపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు సరికాదన్నారు.

**• ఇది ఫ్యాబ్రికేటెడ్ కేసు: న్యాయవాది భరత్**

కవితపై మోపిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, ఈ కేసు పూర్తిగా కల్పితమని, ఇది ఢిల్లీ ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని బీఆర్‌ఎస్ లీగల్ సెల్ కన్వీనర్ భరత్ పేర్కొన్నారు. కేసీఆర్‌పై కక్ష సాధించేందుకే కవితను జైల్లో పెట్టారని తెలిపారు. తప్పుడు సాక్షాలు, తప్పుడు మాటలతో కవితను 6 నెలలు అష్టకష్టాలు పెట్టారని, ఛండాలమైన ఆరోపణలు చేశారని, దుర్మార్గంగా మాట్లాడారని ఆవేదన వ్యక్తంచేశారు. బండి సంజయ్‌తోపాటు కాంగ్రెస్ నేతలు కోర్టుపై కూడా ఆక్షేపణలు చేస్తున్నారని, కోర్టు తీర్పును అవమానపరిచేలా మాట్లాడితే కంటెమ్ట్ ఆఫ్ కోర్టు పిటిషన్ వేస్తామని హెచ్చరించారు.

### బీజేపీ డ్రామా: ఎమ్మెల్సీ సుభాశ్‌రెడ్డి



ఎమ్మెల్సీ కవితపై నమోదైన కేసు రాజకీయ ప్రేరేపిత కుట్ర అని సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో తేలిపోయిందని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ మనోనిబ్బరాన్ని దెబ్బతీయడం కోసం బీజేపీ ఆడిన డ్రామాలో నమోదైన కేసుగా అభివర్ణించారు.

### రాజకీయ కుట్రలు భగ్నం: దేవీప్రసాద్



సుప్రీం కోర్టు బెయిల్‌తో ఒక్కసారిగా రాజకీయ కుట్రలన్నీ పటాపంచలయ్యాయని బీఆర్‌ఎస్ నేత, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ చెప్పారు. ఇది బీజేపీ ఆడిన రాజకీయ డ్రామా అని అభివర్ణించారు.

### ఒక్క ఆధారం చూపలే: రాధారపు సతీశ్

ఎమ్మెల్సీ కవితకు వ్యతిరేకంగా ఒక్క ఆధారం చూపలేకపోయినందునే బెయిల్ మంజూరైందని ఎన్నారై బీఆర్‌ఎస్ సెల్ అధ్యక్షుడు రాధారపు సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. ఆఖరికి న్యాయం గెలిచిందని తెలిపారు.



### బీజేపీ, కాంగ్రెస్‌కు అభ్యంతరాలెందుకు?

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ లిక్కర్ కేసు రాజకీయ ప్రేరేపితమని తేలిందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్పష్టంచేశారు. ఎమ్మెల్సీ కవితకు కోర్టు బెయిల్ మంజూరు చేస్తే కాంగ్రెస్, బీజేపీ నేతలకు ఉన్న అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో కార్పొరేషన్ మాజీ చైర్మన్లు సోమ భరత్‌కుమార్, పల్లె రవికుమార్‌గౌడ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు.



### బండి సంజయ్ అజ్ఞానానికి నిదర్శనం

ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆధారాల్లేని కేసులో ఐదు నెలలు జైల్లో ఉంచడం బాధాకరమని, సుప్రీం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. బెయిల్ అంశాన్ని రెండు రాజకీయ పార్టీల ఒప్పందంగా పేర్కొనడం కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని, ఈ వ్యాఖ్యలు కోర్టు ధిక్కరణ కిందకే వస్తాయని స్పష్టంచేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలు బయటపడినా ఈడీ చర్యలేవని ప్రశ్నించారు.



### బీజేపీ కక్ష సాధింపు బట్టబయలు

ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని, ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ ద్వారా బీజేపీ కక్షసాధింపు చర్యలు బట్టబయలయ్యాయని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కవితపైకి బీజేపీ ప్రభుత్వం ఈడీని ఉసిగొల్పి కేసు పెట్టించటం వల్ల అకారణంగా ఆమె నెలలుగా జైల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సీఆర్ పదే పదే చెప్తున్నట్టు కవిత కడిగిన ముత్యంలా బయటికి వస్తారని చెప్పారు.



### బెయిల్‌ను ఐదు నెలలుగా అడ్డుకున్నరు

చేయని నేరానికి ఎమ్మెల్సీ కవితను అక్రమ కేసుల్లో ఇరికించి, ఐదు నెలల పాటు బెయిల్ రాకుండా అడ్డుకున్నారని ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కవితకు బెల్ మంజూరుపై ఓ ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. ఈ తప్పుడు కేసును సుప్రీంకోర్టు కొట్టివేయాలని కోరారు. కవితకు బెయిల్ వస్తే బండి సంజయ్ ఎందుకు గగ్గోలు పెడుతున్నారో అర్థం కావడం లేదని, ఆయన వ్యాఖ్యలను సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించి విచారణకు ఆదేశించాలని క్రాంతి కిరణ్ డిమాండ్ చేశారు.



### లేనిది సృష్టించి ఇబ్బంది పెట్టిండ్రు

న్యాయమే గెలిచిందని, కవిత బెయిల్‌పై బయటకు రావడం సంతోషమని శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం పేరుతో లేనిది సృష్టించి కవితను బీజేపీ జైలుకు పంపి ఇబ్బంది పెట్టిందని ఆవేదన వ్యక్తంచేశారు. కవిత వందశాతం నిరపరాధి అని, కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్న నమ్మకం తమకున్నదని చెప్పారు. బీజేపీ సర్కారు దమనకాండకు ముగింపు పలకాలని అన్నారు.



### కాంగ్రెస్ నాయకులవి మతిలేని మాటలు

చేయని తప్పులో అన్యాయంగా ఇరికించినా ఎంతో ధైర్యంతో ఎమ్మెల్సీ కవిత ఫైటర్‌లా పోరాడారని బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ అన్నారు. కవితకు బెయిల్ మంజూరు చేసిన సుప్రీం కోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. విచారణ సందర్భంగా న్యాయమూర్తులు ఈడీ, సీబీఐల దర్యాప్తు తీరును తీవ్రంగా ఆక్షేపించాయని చెప్పారు. వారి వ్యాఖ్యలతో ఈ కేసు నిలవదని స్పష్టమైందని తెలిపారు. బీజేపీతో పొత్తులో భాగంగానే కవితకు బెయిల్ వచ్చిందని కాంగ్రెస్ నేతలు మతి స్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.



### ఎమ్మెల్సీ కవిత నిర్బంధం అక్రమం

ఢిల్లీ మద్యం పాలసీతో ఏ మాత్రం సంబంధం లేకున్నా తమ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై ఈడీ అక్రమంగా కేసు బనాయించి 165 రోజులు అన్యాయంగా జైల్లో ఉంచడం బాధాకరమని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం ఆయన సుప్రీంకోర్టు వద్ద మీడియాతో మాట్లాడారు. ప్రజాప్రతినిధిగా ఉన్న కవితను ఇతర సామాన్య ఖైదీలా చూడటాన్ని కూడా న్యాయస్థానం తప్పుబట్టిందని చెప్పారు.

మన రాష్ట్రం మన పత్రిక

# నమస్తే తెలంగాణ

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

NAMASTE TELANGANA

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

బుధవారం WEDNESDAY 28.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4+8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం Pages: 12+4+ 8 Pages NIPUNA supplement | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 84 ‖ వెల (Price) రూ.6.50

బుధవారం, సూర్యోదయం: 6-01, సూర్యాస్తమయం: 6-33. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం కృష్ణ పక్షం తిథి: దశమి రాత్రి 1-20 వరకు. నక్షత్రం: మృగశిర పగలు 3-53 వరకు. వర్జ్యం: రాత్రి 12-33 నుంచి రాత్రి 2-13 వరకు. రాహుకాలం: పగలు 12-17 నుంచి పగలు 1-50 వరకు. దుర్ముహూర్తం: పగలు 11-52 నుంచి పగలు 12-42 వరకు. అమృతకాలం: సాయంత్రం 6-59 నుంచి రాత్రి 8-36 వరకు.



# కవితకు బెయిల్

20 నెలల దర్యాప్తులో తేల్చింది సున్నా!

165 రోజుల నిర్బంధం తర్వాత విడుదల

## మంజూరు చేసిన సుప్రీంకోర్టు.. కుట్రలను ఛేదించుకొని గెలిచిన న్యాయం

### వడ్డీతో చెల్లిస్తం!

నేను మొండిని.. జైలుకు పంపి జగమొండిని చేశారు..

నేను కేసీఆర్ బిడ్డను తప్పుచేసే ప్రసక్తే లేదు: కవిత

- కాంగ్రెస్, బీజేపీ మూకుమ్మడి కుతంత్రం
- రాజకీయ కక్షతో ఢిల్లీ మద్యంపాలసీ కేసు
- రెండేండ్లుగా విచ్చలవిడిగా విషప్రచారం
- బెయిల్ వచ్చిన 5 నిమిషాల్లోపే అక్కసు
- కాంగ్రెస్, బీజేపీ నేతల అడ్డగోలు వ్యాఖ్యలు

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): జాతీయ పార్టీల మూకుమ్మడి రాజకీయ కుట్రలు భగ్నమయ్యాయి.. తెలంగాణ ఆడబిడ్డ 165 రోజులు కారాగారవాసం నుంచి బయటికి వచ్చింది. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. 20 నెలలపాటు విచారణ జరిపి.. 493 మంది సాక్షులను, 57 మంది నిందితులను ప్రశ్నించి.. 50 వేల పేజీల డాక్యుమెంట్లు సమర్పించినా ఇప్పటివరకు తేల్చిందేమీ లేదని విచారణ సందర్భంగా సీబీఐ, ఈడీకి సుప్రీంకోర్టు తలంటింది. మెసేజ్‌లు డిలీట్ చేయడం, ఫోన్ ఫార్మాట్ చేశారని చెప్పడం తప్ప ఇంకా ఏమైనా సాక్ష్యాలు ఉంటే చూపెట్టాలని నిలదీసింది. కేవలం ఆరోపణలతో ఒక ఆడబిడ్డను ఎన్నాళ్లు జైలులో ఉంచుతారని ప్రశ్నించింది. మనీలాండరింగ్ › 2వ పేజీలో



మంగళవారం రాత్రి జైలు నుంచి విడుదలైన అనంతరం తన కుమారుడిని చూసి కవిత భావోద్వేగం. చిత్రంలో భర్త అనిల్, సోదరుడు కేటీఆర్, హరీశ్‌రావు ఉన్నారు.

- బీఆర్ఎస్ సంబురాలు



కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంపై హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు

ఐదునెలల నిర్బంధం తర్వాత ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో బీఆర్ఎస్ శ్రేణుల ఆనందానికి అవధుల్లేవు. బుధవారం మధ్యాహ్నం సుప్రీంకోర్టు ఆదేశాలు వెలువడిన వెంటనే కార్యకర్తలు అటు ఢిల్లీలోనూ, ఇటు రాష్ట్రంలోనూ సంబురాలు జరుపు కొన్నారు. 'అంతిమ విజయం న్యాయానిదే' అంటూ నినాదాలు చేశారు. కవితకు మద్దతుగా సోషల్ మీడియా హోరెత్తింది. సత్యమేవ జయతే హ్యాష్‌ట్యాగ్ జాతీయస్థాయిలో ట్రెండింగ్‌లో నిలిచింది. అలాగే కవితకు బెయిల్ రావడాన్ని జాతీయ మీడియా ప్రముఖంగా ప్రచురించింది. పలు టీవీ చానళ్లు డిబేట్లు నిర్వహించాయి. కాగా, ఎమ్మెల్సీ కవిత, బీఆర్ఎస్ నేతలు నేడు హైదరాబాద్ చేరుకోనున్నారు.

### బండివి చౌకబారు ప్రేలాపనలు

- ఎమ్మెల్సీ కవితకు న్యాయస్థానం ఇచ్చిన బెయిల్‌ను కాంగ్రెస్, బీఆర్ఎస్ బంధంతో పోల్చడం దుర్మార్గం
- ఆయన వ్యాఖ్యలను కోర్టు ధిక్కరణగా పరిగణించాలి
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కేటీఆర్ విజ్ఞప్తి
- బెయిల్ వస్తే 5 నిమిషాల్లోనే అక్కసా?: వేముల
- బీజేపీ, కాంగ్రెస్‌కు అభ్యంతరమెందుకు?: తలసాని
- ఆ రెండు పార్టీలకు ఇదేం పైశాచిక ఆనందం: గంగుల
- బండి వ్యాఖ్యలు అజ్ఞానానికి పరాకాష్ట: నిరంజన్‌రెడ్డి
- బీజేపీ కక్షసాధింపు బట్టబయలు: కొప్పుల ఈశ్వర్
- కోర్టుల్ని ప్రభుత్వాలు నడుపుతయా?: శ్రీనివాస్‌గౌడ్

# అభియోగాలు సరే.. ఆధారాలేవి?

దర్యాప్తుపై ప్రశ్నల వర్షం



ఇది కుంభకోణమా? అయితే, రుజువేందో చూపండి!

ఇన్నాళ్లలో కనీసం ఒక్క ఆధారమైనా సమర్పించారా?

'ఢిల్లీ మద్యం కేసు'లో సీబీఐ, ఈడీకి సుప్రీం చీవాట్లు



జస్టిస్ గవాయ్



జస్టిస్ కేవీ విశ్వనాథన్

### మహిళల పట్ల కోర్టులు మరింత సానుభూతితో వ్యవహరించాలి

విద్యావంతులైన, ఉన్నతహోదా కలిగిన మహిళ బెయిల్ పొందేందుకు అనర్హులు అవుతుందా?

ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యలపై ధర్మాసనం అసహనం

- ఆరోపణలతో ఎవరినైనా నిందితుడిని చేసేస్తారా?
- చాటింగ్‌ను తొలగిస్తే, నేరం చేసినట్టు అవుతుందా?
- దాన్నే కీలక ఆధారమంటే మేమెలా ఒప్పుకొంటాం!
- న్యాయమూర్తులమైన మేం కూడా చాట్‌లు డిలీట్ చేస్తాం.. అయితే, మేము కూడా నేరం చేసినట్టేనా?
- కవిత పాత్ర ఉన్నదంటే.. అందుకు సాక్ష్యం చూపండి
- నిందితులు ఇచ్చిన స్టేట్‌మెంట్లను ఆధారాలంటే ఎలా?
- అసలు మీ విచారణ సరైన పద్ధతిలోనే జరిగిందా?
- 50వేల పేజీల డాటా.. రూపాయైనా రికవరీ కాలేదా?
- ఫోన్ ఫార్మాటింగ్‌కు, ఫోన్ ట్యాంపరింగ్‌కు తేడా లేదా?
- ఢిల్లీ మద్యంకేసులో ఈడీ, సీబీఐకి సుప్రీం ప్రశ్నలవర్షం
- దర్యాప్తు సంస్థల విచారణ పూర్తయ్యాకా కవితను జైల్లో ఉంచడాన్ని తీవ్రంగా తప్పుబట్టిన న్యాయస్థానం
- కవితకు బెయిల్ మంజూరుచేస్తూ ధర్మాసనం నిర్ణయం

**బెయిల్ మంజూరుకు ధర్మాసనం పేర్కొన్న మూడు కారణాలు**

1. ఈ కేసులో సీబీఐ ఇప్పటికే చార్జిషీట్ దాఖలు చేసింది. ఈడీ దర్యాప్తును కూడా పూర్తి చేసింది. తదుపరి ఎలాంటి విచారణకు అవకాశంలేదు.
2. ఈ కేసులో దర్యాప్తు సంస్థల నుంచి కేసు విచారణ కింది కోర్టుకు (రౌస్ అవెన్యూ కోర్టు) చేరింది. కేసు ట్రయల్ ప్రారంభం అయ్యాక నిందితులు జైల్లో కొనసాగాల్సిన అవసరం లేదు.
3. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ)లోని సెక్షన్-45(1) ప్రకారం.. మహిళలకు ఉన్న ప్రత్యేక వెసులుబాటును పరిగణనలోకి తీసుకొని పిటిషనర్‌కు బెయిల్ మంజూరు చేస్తున్నట్టు ధర్మాసనం వెల్లడించింది.

న్యూఢిల్లీ, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం విధానం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) నమోదు చేసిన వేర్వేరు కేసుల్లో బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. మూడు ప్రధాన కారణాలను పరిగణనలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేస్తున్నట్టు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ప్రకటించింది. ఈ సందర్భంగా ఈ కేసులో ఈడీ, సీబీఐ › 3వ పేజీలో

### పేపర్ పైనే ఫీవర్ సర్వే!

4.4 కోట్ల మందికి స్క్రీనింగ్ చేసినట్టు వైద్యశాఖ లెక్కలు › 10

రాష్ట్ర జనాభాను మించి సర్వేనా?






# మంత్రి ఉక్కిరి బిక్కిరి

రుణమాఫీపై ఖమ్మంలో తుమ్మల ఘెరావ్

తమ రుణాల సంగతేందని నిలదీసిన రైతులు

## కారు దిగొచ్చిన మంత్రి.. సహనం కోల్పోయి ఆగ్రహం

### రుణం చెల్లించినా కాని మాఫీ

2 లక్షల పైనున్న రుణం చెల్లిస్తే మాఫీ చేస్తానని మాట తప్పిన సర్కార్

ఆదిలాబాద్ జిల్లాలో వెలుగుచూస్తున్న ఉదంతాలు › 11

ఖమ్మం, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రైతుల సెగ తగిలింది. షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట సీపీఐ, సీపీఎం, రైతుసంఘాల ఆధ్వర్యంలో అన్నదాతలు ధర్నా చేశారు. కలెక్టరేట్ పక్కనే ఉన్న వీ వెంకటాయపాలెం నుంచి కలెక్టరేట్ వరకు జాతీయ రహదారిపై భారీ ప్రదర్శనతో ధర్నా చేశారు. ఈ సమయంలో కలెక్టరేట్‌లో సమీక్ష ముగించుకొని › 11వ పేజీలో



రుణమాఫీలో ప్రభుత్వ వైఫల్యానికి నిరసనగా ఖమ్మం కలెక్టరేట్ వద్ద తనను చుట్టుముట్టి నినాదాలు చేస్తున్న రైతులు, రైతు సంఘాల నేతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తుమ్మల

### ఆర్టీసీ కార్మికుల రణభేరి

యాజమాన్యం, సర్కారు నిర్లక్ష్యంపై పోరుబాట

రాష్ట్రవ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో కార్మికుల నిరసన

ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ › 6

ప్రభుత్వం స్పందించకుంటే ప్రత్యక్ష పోరు: నేతలు



### కౌలురైతు ఆత్మహత్య

మెదక్ జిల్లాలో అప్పుల బాధతో ఉరివేసుకున్న ప్రవీణ్ › 11

ఉపాధి కరువై ఆటో డ్రైవర్ **బలవన్మరణం**

భద్రాద్రి జిల్లాలో ఘటన

**ప్రాణం తీసుకున్న మరో నేతన్న**

సిరిసిల్లలో విషాదం



బుల్కాపూర్ నాలా హద్దుల నిర్ధారణలో నిమగ్నమైన రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది

# జన్వాడలో హైడ్రామా!

- ఫాంహౌస్ కూల్చివేస్తారని ఒక సెక్షన్ మీడియా అత్యుత్సాహం
- బుల్కాపూర్ నాలా హద్దుల నిర్ధారణకు యంత్రాంగం కసరత్తు
- జన్వాడలో రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారుల పరిశీలన
- గండిపేటకు రెండు కిలోమీటర్లకుపైగా దూరంలో జన్వాడ

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ)/మణికొండ: బుల్కాపూర్ నాలా హద్దుల నిర్ధారణకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు మంగళవారం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. జన్వాడలోని ఫాంహౌస్ కూల్చివేతకు రంగం సిద్ధమైందని ఒక సెక్షన్ మీడియా అత్యుత్సాహంగా ప్రచారం చేసింది. దీంతో జన్వాడలో మంగళవారం రాత్రి వరకు ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండల పరిధిలోని జన్వాడ-మియాఖాన్‌గడ్డ(అగ్నిపూర్) సమీపంలోని ప్రదీప్‌రెడ్డికి చెందిన ఫాంహౌస్ ముందు ఉన్న బుల్కాపూర్ నాలాను రెవెన్యూ శాఖ నుంచి ఆర్ఐ, సర్వేయర్‌తోపాటు నీటిపారుదల శాఖకు చెందిన వర్క్ ఇన్‌స్పెక్టర్ ముగ్గురు కలిసి పరిశీలించారు. నాలా విస్తీర్ణంపై టేపులు పెట్టి కొలతలు తీసుకుని వెళ్లిపోయారు. అధికారులు నాలాపై కొలతలు చేపడుతున్నారన్న విషయం సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో స్థానికులు, మీడియా ప్రతినిధులు అక్కడకు చేరుకున్నారు. దీంతో స్థానికంగా ఉత్కంఠ నెలకొన్నది. హైడ్రా అధికారులు ఫాంహౌస్‌ను కూల్చివేస్తారని ప్రచారం జరగడటంతో ప్రజల్లో గందరగోళం నెలకొన్నది. విషయాన్ని తెలుసుకున్న మోకిల పోలీసులు అక్కడకు చేరుకుని › 6 వ పేజీలో

# ‘అమ్మ’కు మోహన్ లాల్ రాజీనామా

**మలయాళ చిత్ర పరిశ్రమలో మీటూ ప్రకంపనలు**



కొచ్చి: జస్టిస్ హేమ కమిటీ నివేదిక మాలీవుడ్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్నది. మలయాళం సినీ పరిశ్రమలో లైంగిక వేధింపుల గురించి అనేక అంశాలు బయటపడటంతో ప్రముఖులంతా రాజీనామా బాట పడుతున్నారు. తాజాగా మలయాళీ సినీ కళాకారుల సంఘం (అమ్మ) అధ్యక్షుడు మోహన్ లాల్ సహా ఆఫీస్ బేరర్లందరూ మంగళవారం రాజీనామా చేశారు. ఈ మేరకు ‘అమ్మ’ ఓ ప్రకటనను విడుదల చేసింది. కొందరు లైంగిక వేధింపులకు పాల్పడినట్లు అన్ని రకాల మీడియాలలోనూ వచ్చిన ఆరోపణలకు నైతిక బాధ్యత వహిస్తూ వీరంతా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. నూతన పాలక మండలిని రెండు నెలల్లోగా ఎన్నుకోనున్నట్లు తెలిపింది. రాజీనామా చేసిన పాలక మండలి తాత్కాలికంగా బాధ్యతలను నిర్వహిస్తుందని వివరించింది. అంతకుముందు మోహన్ లాల్ ఈ సంఘం కార్యవర్గ సభ్యులందరితోనూ ఆన్‌లైన్ సమావేశాన్ని నిర్వహించినట్లు తెలుస్తున్నది.

## లైంగిక హింస కేసుల్లో సత్వర న్యాయం అందించాలి

**మహిళా హక్కుల సంఘాల డిమాండ్**

న్యూఢిల్లీ: వరుసగా జరుగుతున్న లైంగిక నేరాల కేసులు దేశాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్న సమయంలో సత్వర న్యాయం కోసం మహిళా సంఘాలు గళమెత్తాయి. లైంగిక నేరాలను అంతం చేయాలని డిమాండ్ చేశాయి. కోల్‌కతా, మణిపూర్, గుజరాత్, ఉత్తరాఖండ్, బీహార్, ఉత్తర ప్రదేశ్‌లలో జరిగిన సంఘటనలు దేశంలో మహిళల భద్రతకు ఉన్న ముప్పును గుర్తు చేస్తున్నాయని 35 మహిళా సంఘాలు మంగళవారం విడుదల చేసిన స్టేట్‌మెంట్‌లో ఆరోపించాయి. కోల్‌కతా డాక్టర్‌పై హత్యాచారం కేసును తప్పుదోవ పట్టించేందుకు ముఖ్యమంత్రి మమత బెనర్జీ ప్రభుత్వం ప్రయత్నించిందని దుయ్యబట్టాయి. నేరాలపై దర్యాప్తు చేసే యంత్రాంగాన్ని పటిష్టం చేయాలని, పరిపాలన, దర్యాప్తు సంస్థలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశాయి.

## స్క్రాపేజ్ సర్టిఫికెట్‌తో వాహనాలపై డిస్కౌంట్!

**ఆటోమొబైల్ సంస్థల ఆఫర్**

న్యూఢిల్లీ, ఆగస్టు 27: వచ్చే పండుగ సీజన్ కంటే ముందుగానే ఆటోమొబైల్ సంస్థలు కొనుగోలుదారులకు శుభవార్తను అందించాయి. పలు ప్యాసింజర్ అండ్ కమర్షియల్ వాహనాల తయారీ సంస్థలు స్క్రాపేజ్ సర్టిఫికెట్‌తో తమ వాహనాలపై 1.5 శాతం నుంచి 3 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించాయి. పాత వాహనాలు ఇచ్చి కొత్త వాహనాలు కొనుగోలు చేసేవారికి ఈ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశం అనంతరం పలు ఆటోమొబైల్ సంస్థలు ప్రకటించాయి. దీంట్లో భాగంగా జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ ఏకంగా రూ.25 వేల రాయితీని ప్రకటించింది. దేశీయ ఆటోమొబైల్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన సమావేశానికి దేశీయ ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(సియామ్) ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. కమర్షియల్ వాహన తయారీదారులు.. రెండేండ్లపాటు రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించగా, ప్యాసింజర్ వాహన సంస్థలు అయితే స్వల్పకాలం మాత్రమే అంటే ఏడాది వరకు ఈ ప్రయోజనాలను కల్పించనున్నట్లు పేర్కొంది. వీటిలో కార్ల తయారీ దిగ్గజాలైన మారుతి సుజుకీ, టాటా మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, హ్యుందాయ్ మోటర్, కియా మోటర్స్, టయోటా కిర్లోస్కర్, హోండా కార్స్, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటర్, రెనో, నిస్సాన్, స్కోడా ఇండియా సంస్థలు షోరూం ధరలో 1.5 శాతం లేదా రూ.20 వేల వరకు డిస్కౌంట్ ఇవ్వనున్నట్లు ప్రకటించాయి.

**వాహన స్థితి ఆధారంగా..**

వాహన స్థితి ఆధారంగా అదనంగా డిస్కౌంట్ ఇచ్చే అవకాశాలు కూడా ఉన్నాయని ఆటోమొబైల్ వర్గాలు వెల్లడించాయి. ప్యాసింజర్ వాహన తయారీ సంస్థలు తమకు నచ్చిన మాడళ్లకు మాత్రమే ఈ రాయితీ వర్తింపు చేసుకునే అవకాశాలను కూడా కల్పించింది. పాత కార్ల స్థానంలో ఎక్స్ఛేంజ్ కింద కొత్త కార్లను కొనుగోలు చేసేవారికి ఈ ప్రయోజనాలు పొందవచ్చును.

# అట్టుడికిన బెంగాల్

- ఛాత్ర సమాజ్ ‘నబన్న అభిజన్’ ర్యాలీ తీవ్ర ఉద్రిక్తం
- ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనపై కోల్‌కతాలో సచివాలయ ముట్టడికి విద్యార్థుల యత్నం
- సీఎం మమత బెనర్జీ రాజీనామాకు డిమాండ్
- ఆందోళనకారులను అడ్డుకున్న పోలీసులు
- జలఫిరంగులు, బాష్పవాయువు గోళాలు ప్రయోగం
- పోలీసులపైకి రాళ్లు రువ్విన నిరసనకారులు
- కోల్‌కతాలో రోజంతా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు
- నేడు పశ్చిమ బెంగాల్ బంద్‌కు బీజేపీ పిలుపు
- మమతకు పాలీగ్రాఫ్ టెస్ట్ చేయాలని డిమాండ్

కోల్‌కతా, ఆగస్టు 27: పశ్చిమ బెంగాల్ భగ్గుమంది. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచార ఘటన నేపథ్యంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ‘నబన్న అభిజన్’ ర్యాలీ పేరుతో పశ్చిమ్ బంగా ఛాత్ర సమాజ్ అనే విద్యార్థి సంఘం చేపట్టిన సచివాలయ ముట్టడి కార్యక్రమం హింసాత్మకంగా మారింది. పోలీసులు – నిరసనకారుల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఇరువైపులా అనేకమంది గాయాలపాలయ్యారు. మరోవైపు డీఏ పెంచాలనే డిమాండ్‌తో సంగ్రామి జౌత మంచ అనే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సైతం సచివాలయానికి ర్యాలీ నిర్వహించాలనుకుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కోల్‌కతాలో ముందుజాగ్రత్తగా 4 వేల మందితో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసింది.

**12 గంటల బంద్‌కు బీజేపీ పిలుపు**

పోలీసుల చర్యలకు నిరసనగా బుధవారం 12 గంటల పాటు రాష్ట్రవ్యాప్త బంద్‌కు పశ్చిమ బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సుకంత మజుందర్ పిలుపునిచ్చారు. విద్యార్థులపై దాడులను పోలీసులు ఆపకపోతే రాష్ట్రాన్ని స్తంభింపజేస్తామని ప్రతిపక్ష నేత సువేందు అధికారి హెచ్చరించారు. నియంతలా ప్రవర్తిస్తున్న మమతా బెనర్జీ రాజీనామా చేయాలని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా డిమాండ్ చేశారు. హత్యాచార ఘటనలో ప్రమేయం ఉన్న వారిని మమతా బెనర్జీ కాపాడుతున్నారని, ఆమెకు, కోల్‌కతా పోలీస్ కమిషనర్ వినీత్ గోయల్‌కు పాలీగ్రాఫ్ పరీక్ష చేస్తే నిజాలు బయటకు వస్తాయని పేర్కొన్నారు.



ఛాత్ర సమాజ్ కార్యకర్తలపై లాఠీచార్జి చేస్తున్న ఆర్‌పీఎఫ్, పోలీసులు

### పోలీసుల లాఠీచార్జి.. రాళ్లు రువ్విన నిరసనకారులు

సచివాలయానికి వెళ్లేందుకు మంగళవారం ఉదయం విద్యార్థులు, ఉద్యోగులు వేర్వేరుగా ర్యాలీగా బయలుదేరారు. పోలీసులు ఎక్కడికక్కడ బ్యారికేడ్లు ఏర్పాటుచేసి వీరిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో హౌరా బ్రిడ్జి వద్ద, సంత్రగచ్చి రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు – నిరసనకారులకు మధ్య ఘర్షణలు తలెత్తాయి. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేసి, జలఫిరంగులు, టియర్ గ్యాస్ ప్రయోగించారు. పోలీసులపైకి నిరసనకారులు రాళ్లురువ్వారు. తర్వాత ఎంజీ రోడ్డు, హస్టింగ్స్ రోడ్డులోనూ ఘర్షణలు తలెత్తాయి. ఇరువైపులా అనేక మంది గాయపడ్డారు. ఘర్షణలతో రోజంతా కోల్‌కతాలో తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తాయి.



## రైల్వే బోర్డుకు తొలి దళిత సారథి

**చైర్మన్, సీఈఓగా సతీశ్ కుమార్ నియామకం**

న్యూఢిల్లీ: రైల్వే బోర్డు చైర్మన్‌గా సతీశ్ కుమార్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఆయన ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్ (ఐఆర్‌ఎంఎస్) అధికారి. ఈ బోర్డు చరిత్రలో చైర్మన్, సీఈఓ పదవిని చేపట్టబోతున్న తొలి దళితునిగా ఆయన రికార్డు సృష్టించారు. రైల్వే బోర్డు ప్రస్తుత చైర్‌పర్సన్, సీఈఓ జయ వర్మ సిన్హా ఈ నెల 31న పదవీ విరమణ చేస్తారు. వచ్చే నెల 1 నుంచి సతీశ్ కుమార్ ఆ బాధ్యతలను చేపడతారు. ఆయన నియామకానికి క్యాబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

## ఎన్‌ఎస్‌జీ చీఫ్‌గా శ్రీనివాసన్ నియామకం

న్యూఢిల్లీ: నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (ఎన్‌ఎస్‌జీ) డైరెక్టర్ జనరల్‌గా బీ శ్రీనివాసన్ మంగళవారం నియమితులయ్యారు. ఆయన 1992 బ్యాచ్ బీహార్ క్యాడర్ ఐపీఎస్ అధికారి. క్యాబినెట్ నియామకాల కమిటీ ఆయన నియామకానికి ఆమోదం తెలిపింది. ఆయన ఈ పదవిని చేపట్టినప్పటి నుంచి పదవీ విరమణ తేదీ 2027 ఆగస్ట్ 31 వరకు ఈ పదవిలో కొనసాగవచ్చు. సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ మేరకు ఆదేశాలను జారీ చేసింది.

## కేజ్రీవాల్ జ్యుడిషియల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జ్యుడిషియల్ కస్టడీని ఢిల్లీ కోర్టు వచ్చే నెల 3 వరకు పొడిగించింది. ఆయన కస్టడీ గడువు ముగియడంతో మంగళవారం ఆయనను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పెషల్ జడ్జి కావేరీ బవేజా సమక్షంలో హాజరుపరిచారు. సీబీఐ సమర్పించిన అనుబంధ చార్జిషీటును విచారణకు స్వీకరించడంపై వాదనలను కోర్టు వింటున్నది.

## తోడేళ్ల దాడిలో ఏడుగురి మృతి

**మరో 26 మందికి గాయాలు**

**యూపీలో దారుణం**

లక్నో: తోడేళ్లు గుంపుగా వచ్చి జరిపిన దాడుల్లో ఏడుగురు మరణించగా, 26 మంది గాయపడ్డారు. మృతుల్లో ఆరుగురు బాలలు ఉన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బహ్రైయిచ్ జిల్లాలో ఈ దారుణం జరిగింది. తోడేళ్ల వల్ల ఇండో–నేపాల్ సరిహద్దుల్లోని 30 గ్రామాల ప్రజలు నెల నుంచి కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. ప్రజలు స్వయంగా ముందుకు వచ్చి, పహారా కాస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే సురేశ్వర్ ప్రసాద్ కూడా ఓ తుపాకీ పట్టుకుని రాత్రి సమయంలో ఓ గ్రామానికి కాపలా కాశారు. ఈ తోడేళ్లను పట్టుకునేందుకు అటవీ శాఖ తొమ్మిది మందిని నియమించింది. మూడు తోడేళ్లను పట్టుకుని, లక్నో జంతు ప్రదర్శన శాలకు పంపించారు.

## కునోలో మరో చీతా మృతి!

శ్యోపూర్, ఆగస్టు 27: మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ పార్కులో మంగళవారం నమీబియన్ మగ చీతా పవన్ మరణించిందని అధికారులు తెలిపారు. పొదల మధ్య నిండుగా ఉన్న కాలువ గట్టున మగ చీతా పవన్ కదలికలు లేకుండా పడి ఉన్నట్టు గుర్తించారు. తలతో పాటు శరీరంలోని సగ భాగం నీటిలో మునిగి ఉన్నట్టు పశు వైద్యులు గుర్తించారు. చీతా కళేబరంపై ఎలాంటి గాయాలు కనిపించలేదు. నీటిలో మునగడం వల్లే చీతా మరణించి ఉండొచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు.

## ఐఎంఏ చీఫ్ క్షమాపణను అంగీకరించని సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఐఎంఏ చీఫ్ అశోకన్ చెప్పిన బేషరతు క్షమాపణను అంగీకరించేందుకు సుప్రీంకోర్టు మంగళవారం తిరస్కరించింది. పతంజలి సంస్థపై ఐఎంఏ దాఖలు చేసిన కేసు విచారణ సమయంలో అశోకన్ ఏప్రిల్ 29న సుప్రీంకోర్టును ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వార్తాపత్రికల్లో ప్రచురించిన క్షమాపణ ప్రకటన చాలా చిన్నగా ఉండటంతో కోర్టు తిరస్కరించింది.

## దవాఖానలో మైనర్‌పై గ్యాంగ్‌రేప్

**రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో దారుణం**

జోధ్‌పూర్: దేశంలో మైనర్లు, మహిళలపై అకృత్యాలు పెరిగిపోతున్నాయి. తాజాగా రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో 15 ఏండ్ల బాలికపై ఇద్దరు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బాధితురాలు ఈ నెల 25న కుటుంబ సభ్యులతో గొడవపడి, ఎవరికీ తెలియకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. మహాత్మా గాంధీ ప్రభుత్వ దవాఖానలో ఆమె రాత్రి సమయంలో ఒంటరిగా కనిపించడంతో ఇద్దరు వ్యక్తులు ఆమెను ప్రలోభపెట్టారు. దవాఖానలోని బయో–మెడికల్ వ్యర్థాల సెక్షన్‌వైపు తీసుకెళ్లి, సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. అంతకుముందు ఆమె కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సోమవారం ఆమెను దవాఖాన ప్రాంగణంలో గుర్తించారు. ఆమె తీవ్ర ఆందోళనతో కనిపించింది. ఆమెను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి, స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఆమెపై గ్యాంగ్ రేప్ జరిగినట్లు కేసు నమోదు చేశారు. ఆమెకు వైద్య పరీక్షలు చేయించారు. నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకుని, ప్రశ్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వీరిలో ఒకడు గతంలో ఈ దవాఖానలో పని చేసినట్లు అధికారులు తెలిపారు.

## నర్సింగ్ విద్యార్థినిపై ఆటో డ్రైవర్ అఘాయిత్యం

**మత్తు నీళ్లు తాగించి లైంగికదాడి.. మహారాష్ట్రలో మరో ఘోరం**

ముంబై, ఆగస్టు 27( నమస్తే తెలంగాణ): మహిళలపై జరుగుతున్న నేరాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్న వేళ సోమవారం మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాలో ఓ ఆటో డ్రైవర్ ఓ నర్సింగ్ విద్యార్థిని(19)పై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఇంటికి వెళ్లడానికి ఆటో ఎక్కిన బాధితురాలిని నీళ్లు తాగమని డ్రైవర్ కోరాడు. నీళ్లలో మత్తు మందు కలిపి ఉండటంతో అవి తాగిన తర్వాత ఆమె స్పృహ కోల్పోయింది. అనంతరం ఆటో డ్రైవర్ ఆమెను నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. స్పృహ వచ్చిన తర్వాత బాధితురాలు ఘటన గురించి తన కుటుంబానికి తెలియజేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. ఘటనపై దర్యాప్తునకు మహిళా ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేసినట్టు రత్నగిరి ఎస్పీ వెల్లడించారు. బాధితురాలు ఓ ప్రభుత్వ దవాఖానలో కోలుకుంటున్నది. దోషికి ఉరి శిక్ష విధించాలని బాధితురాలు పనిచేస్తున్న దవాఖాన నర్సులు, సిబ్బంది, స్థానికులు డిమాండ్ చేశారు. నిరసన ప్రదర్శనలు నిర్వహించి రోడ్లను దిగ్బంధించారు. ఇటీవలే బద్లాపూర్‌లోని ఓ పాఠశాలలో బాలికలపై లైంగిక వేధింపుల ఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే.

## రాజ్యసభకు 12 మంది ఏకగ్రీవ ఎన్నిక

**పెద్దల సభలో మెజారిటీని అందుకున్న ఎన్డీఏ**

న్యూఢిల్లీ, ఆగస్టు 27: రాజ్యసభకు 12 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిలో తొమ్మిది మంది బీజేపీ సభ్యులు కాగా, ఎన్డీఏ మిత్ర పక్షాలైన ఎన్సీపీ(అజిత్ పవార్) నుంచి ఒకరు, రాష్ట్రీయ లోక్‌మంచ్ నుంచి ఒకరు ఉన్నారు. కాంగ్రెస్ నుంచి ఒకరు ఎన్నికయ్యారు. బీజేపీ తరపున అస్సాం నుంచి మిషన్ రంజన్ దాస్, రామేశ్వర్ తేలి, బీహార్ నుంచి మనన్ కుమార్ మిశ్రా, హర్యానా నుంచి కిరణ్ చౌదరి, మధ్యప్రదేశ్ నుంచి జార్జ్ కురియన్, మహారాష్ట్ర నుంచి ధైర్యశీల్ పాటిల్, ఒడిశా నుంచి మమతా మహంత, రాజస్థాన్ నుంచి రవ్‌నీత్ సింగ్ బిట్టు, త్రిపుర నుంచి రాజీవ్ భట్టాచార్య రాజ్యసభకు ఎన్నికయ్యారు. కాంగ్రెస్ తరపున తెలంగాణ నుంచి అభిషేక్ మను సింఘ్వి, ఎన్సీపీ తరపున మహారాష్ట్ర నుంచి నితిన్ పాటిల్, ఆర్‌ఎల్‌ఎం తరపున బీహార్ నుంచి ఉపేంద్ర కుశ్వాహ ఏకగ్రీవంగా గెలుపొందారు. 245 స్థానాలుండే రాజ్యసభలో ప్రస్తుతం 237 మంది సభ్యులు ఉన్నారు. మెజారిటీ సాధించడానికి 119 సభ్యులు అవసరం. కొత్త సభ్యుల ఎన్నికతో బీజేపీ బలం 96కు, ఎన్డీఏ బలం 121కు చేరడంతో మెజారిటీ మార్కును అందుకుంది. ప్రతిపక్ష పార్టీల రాజ్యసభ సభ్యుల సంఖ్య 85గా ఉంది.

## క్యాబ్ కోసం 500 పంపండి

**సీజేఐ పేరుతో సైబర్ మోసగాడి మెసేజ్**

న్యూఢిల్లీ: ప్రముఖుల ఫొటోలను డీపీగా పెట్టుకొని, వారిలా చాట్ చేస్తూ డబ్బులు అడిగే సైబర్ మోసగాళ్లు హద్దు మీరిపోతున్నారు. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ పేరుతోనే డబ్బులు అడుగుతున్న వైనం బయటకు వచ్చింది. ‘ఎక్స్’లో ఓ నెటిజన్ ఇందుకు సంబంధించిన స్క్రీన్‌షాట్ షేర్ చేశారు. ‘నేను సీజేఐని. అత్యవసరంగా కొలీజియం సమావేశానికి వెళ్తుండగా కన్నాట్ ప్లేస్‌లో ఇరుక్కుపోయాను. క్యాబ్ కోసం రూ.500 పంపగలరా ? కోర్టుకు చేరుకున్న తర్వాత తిరిగి పంపిస్తా’ అంటూ మోసగాడు చాట్ చేశాడు. ఇది సీజేఐ దృష్టికి వెళ్లడంతో సుప్రీంకోర్టు సిబ్బంది సైబర్ నేరాల విభాగానికి ఫిర్యాదు చేశారు.





## కెనడాలో భారత విద్యార్థుల నిరసనలు

- సుమారు 70 వేల మంది విదేశీ విద్యార్థులు దేశం వీడాల్సిన పరిస్థితి
- వలస విధానాల్లో మార్పులే కారణం
- ఆందోళనకు దిగిన విదేశీ విద్యార్థులు

న్యూఢిల్లీ: కెనడాలో ఇటీవల వలస (ఇమ్మిగ్రేషన్) విధానాలను మార్చడంతో 70 వేల మందికిపైగా అంతర్జాతీయ గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఆ దేశాన్ని వదిలి వెళ్లాల్సిన ముప్పు తలెత్తింది. వీరిలో భారత విద్యార్థులే ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తున్నది. స్టడీ పర్మిట్లపై పరిమితి విధించాలని, శాశ్వత నివాస దరఖాస్తులను (పర్మినెంట్ రెసిడెన్సీ నామినేషన్లను) తగ్గించాలని జస్టిన్ ట్రుడో ప్రభుత్వం నిర్ణయించడంతో వారికి ఈ పరిస్థితి ఏర్పడింది. దీంతో కొత్త జీవితాన్ని నిర్మించుకోవాలని ఎన్నో ఆశలతో కెనడాలో అడుగు పెట్టిన భారతీయులతో సహా, విదేశీ విద్యార్థులంతా ఇప్పుడు అక్కడ నిరసనలతో హోరెత్తిస్తున్నారు. ఈ ఏడాది చివరికి చాలా మంది అంతర్జాతీయ గ్రాడ్యుయేట్ల వర్క్ పర్మిట్ల గడువు ముగియనున్నదని, దీంతో వారంతా స్వదేశాలకు తిరిగి వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని విద్యార్థుల ప్రతినిధులు చెప్పారు.

## విదేశీ విద్యార్థుల సంఖ్యపై ఆస్ట్రేలియా పరిమితులు!

కాన్‌బెర్రా, ఆగస్టు 27: వలసలను నియంత్రించే క్రమంలో విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితి విధించాలని ఆస్ట్రేలియా భావిస్తున్నది. వచ్చే ఏడాది వీరి సంఖ్యను 2.70 లక్షలకు పరిమితం చేయాలని యోచిస్తున్నది. యూనివర్సిటీల్లో 1.45 లక్షలు, స్కిల్ ట్రైనింగ్ విభాగంలో 95 వేల మంది విదేశీ విద్యార్థులను అనుమతించేలా పరిమితులు విధించనున్నామని ఆస్ట్రేలియా విద్యా మంత్రి జాసన్ క్లేర్ తెలిపారు. దీనిపై యూనివర్సిటీస్ ఆస్ట్రేలియా చైర్మన్ డేవిడ్ లాయిడ్ అభ్యంతరం తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం విద్యా వ్యవస్థపై ప్రభావం చూపుతుందని చెప్తూ విశ్వవిద్యాలయాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో 6 లక్షల విద్యార్థి వీసాలు మంజూరు కావడం గమనార్హం. కొవిడ్ సమయంలో ఏర్పడిన కార్మికుల కొరతను భర్తీ చేసేందుకు ఆస్ట్రేలియా ప్రభుత్వం భారీగా వలసలను ప్రోత్సహించింది. అయితే గృహ సంక్షోభం వేళ భారీగా వలసలు పెరగడంతో మౌలిక సదుపాయాల కల్పన ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో విద్యార్థి, నిపుణుల వలసలను సగానికి తగ్గించాలని ఆస్ట్రేలియా ప్రయత్నిస్తున్నది.



## వారికి శాశ్వత నివాస హోదా కల్పనకు బ్రేక్

**అమెరికా పౌరుల జీవిత భాగస్వాములపై బైడెన్ నిర్ణయాన్ని నిలిపివేసిన కోర్టు**

హ్యూస్టన్, ఆగస్టు 27: అమెరికా పౌరులను వివాహం చేసుకున్న అక్రమ వలసదారులకు శాశ్వత నివాస హోదా కల్పించాలనుకున్న బైడెన్ ప్రభుత్వ నిర్ణయానికి టెక్సాస్ కోర్టు బ్రేకులు వేసింది. అమెరికా పౌరులను వివాహం చేసుకున్న భారతీయులు సహా ఇతర దేశాల వారు, వారి పిల్లలకు పర్మినెంట్ రెసిడెన్సీ వేగంగా కల్పించాలని బైడెన్ ప్రభుత్వం జూన్‌లో నిర్ణయించింది. కనీసం పదేండ్లుగా అమెరికాలో నివసించే వారికి ఈ అవకాశం ఇవ్వాలనుకుంది. వీరికి అమెరికా పౌరసత్వం కూడా వేగంగా కల్పించాలని ప్రభుత్వం భావించింది. అయితే, టెక్సాస్ జిల్లా జడ్జి జే కాంప్‌బెల్ బార్కర్ సోమవారం ఈ నిర్ణయంపై రెండు వారాల పాటు స్టే విధించారు. ఈ నిర్ణయం వేల మంది ఇండియన్ అమెరికన్లపై ప్రభావం చూపనుంది.

## ఖర్గే కుమారుడిని బర్తరఫ్ చేయండి

- ఖర్గే ట్రస్టుకు భూకేటాయింపు కుంభకోణంపై చర్య తీసుకోండి
- కర్ణాటక గవర్నర్‌కు బీజేపీ వినతి
- సీబీఐ విచారణ జరిపించాలని, ఖర్గే రాజీనామా చేయాలని డిమాండ్



ప్రియాంక్ ఖర్గే

బెంగళూరు: కర్ణాటక మంత్రివర్గం నుంచి ప్రియాంక్ ఖర్గేను బర్తరఫ్ చేయాలని, ఖర్గే ట్రస్టుకు అక్రమ భూ కేటాయింపుపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు మంగళవారం గవర్నర్‌ను కోరారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుటుంబానికి చెందిన సిద్ధార్థ విహార్ ట్రస్టుకు బెంగళూరు సమీపంలోని హైటెక్ డిఫెన్స్ ఏరోస్పేస్ పార్కులో కర్ణాటక పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి మండలి(కేఐఏడీబీ) ఐదు ఎకరాల భూమిని కేటాయించింది. ఇక్కడ స్థలం కోసం అనేక సంస్థలు, కంపెనీలు దరఖాస్తు చేసుకున్నప్పటికీ సిద్ధరామయ్య ప్రభుత్వం నిబంధనలను ఉల్లంఘించి ఖర్గేకు చెందిన ట్రస్టుకు కేటాయించిందని, ఇది కుంభకోణమని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా ఆరోపించారు. ఏఐసీసీ అధ్యక్ష పదవికి మల్లికార్జున ఖర్గే, సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేయాలని, భూ కేటాయింపుపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

**చట్టప్రకారమే భూకేటాయింపు: సిద్ధరామయ్య**

ఖర్గే ట్రస్టుకు చట్టప్రకారమే భూమిని కేటాయించినట్టు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. భూమి పొందడానికి ట్రస్టుకు అర్హత ఉందని, అందుకే కేటాయించామని చెప్పారు.

## బళ్లారి జైలుకు కన్నడ నటుడు దర్శన్!

బెంగళూరు: కన్నడ నటుడు దర్శన్ తూగుదీపను బెంగళూరులోని పరప్పన అగ్రహార జైలు నుంచి బళ్లారిలోని జైలుకు తరలించాలని అధికారులు నిర్ణయించారు. ఆయన ఫ్యాన్ రేణుకస్వామి హత్య కేసులో ఆయనతోపాటు మరికొందరు నిందితులు జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు. అయితే దర్శన్ రౌడీషీటర్లతో జల్సాగా టీ తాగుతూ, సిగరెట్ కాల్చుతూ ఆనందంగా గడుపుతున్నట్లు ఓ ఫొటో బయటపడింది. అంతేకాకుండా ఆయన జైలు నుంచి వీడియో కాల్ మాట్లాడుతున్నట్లు ఓ వీడియో వైరల్ అయింది. వీటిపై దర్యాప్తు జరిపిన అధికారులు సోమవారం ఈ జైలు చీఫ్ సూపరింటెండెంట్‌తోపాటు తొమ్మిది మందిని సస్పెండ్ చేశారు. దర్శన్‌కు రాజ భోగాలపై మూడు కేసులను నమోదు చేసినట్లు పోలీస్ కమిషనర్ బీ దయానంద చెప్పారు. రేణుక స్వామి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ, ఈ జైలులో కస్టడీలో ఉన్నవారిని కూడా ఇతర జైళ్లకు తరలించాలని అధికారులను కోరినట్లు తెలిపారు.



## కొవిడ్‌కు సూది రహిత టీకా

న్యూఢిల్లీ: సూదులంటే భయపడేవారికి పరిష్కారం చూపుతూ ముక్కు ద్వారా అందించే కొవిడ్–19 టీకాను గ్రిఫిత్ యూనివర్సిటీ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ప్రస్తుతం క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్న ఈ టీకా వివరాలు నేచర్ కమ్యూనికేషన్స్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఇది సింగిల్ డోస్ టీకా. దీనిని ‘సీడీఓ–7ఎన్–1’గా పిలుస్తున్నారు. వ్యాప్తి, రీ ఇన్ఫెక్షన్, కొత్త వేరియంట్లు పుట్టుకను నిరోధించడంలో ఈ టీకా ప్రభావవంతంగా పనిచేస్తుందని డాక్టర్ గ్జియాంగ్ లియూ తెలిపారు. ఈ వ్యాక్సిన్ తయారీ లైసెన్స్‌ను ఇండియన్ ఇమ్యూనోలాజికల్స్‌కు ఇచ్చారు.

# టైప్ 1.5 డయాబెటిస్!

- టైప్ 1 తరహా ఆటోఇమ్యూన్ సమస్య
- టైప్ 2 డయాబెటిస్ లాంటి లక్షణాలు
- యుక్త వయసులో మొదలు
- టైప్ 2గా పొరబడుతున్న వైద్యులు
- త్వరగా గుర్తిస్తే నష్టం తగ్గించొచ్చు

క్వీన్స్‌లాండ్, ఆగస్టు 27: మధుమేహం అంటే అందరికీ టైప్ 1, టైప్ 2 గురించే తెలుసు. అయితే, మధుమేహంలో 10 రకాలు ఉంటాయి. ఇందులో టైప్ 1.5 డయాబెటిస్ గురించి అందరికీ తప్పనిసరిగా అవగాహన ఉండాలి. దీనిని లాటెంట్ ఆటోఇమ్యూన్ డయాబెటిస్ ఇన్ అడల్ట్స్(ఎల్‌ఏడీఏ) అని సైతం పిలుస్తుంటారు. ఈ రకమైన మధుమేహం గురించి చాలామందికి తెలియకపోవడం మాత్రమే కాదు, దీనిని గుర్తించడం కూడా తక్కువే. ఒకరకంగా చెప్పాలంటే ఇది టైప్ 1, టైప్ 2 మేళవింపు. ఈ రకమైన మధుమేహాన్ని టైప్ 2గానే వైద్యులు, బాధితులు చాలావరకు భావిస్తుంటారు. ఇటీవల లాన్స్ బాస్ అనే ప్రఖ్యాత అమెరికన్ పాప్ బ్యాండ్ సభ్యుడికి టైప్ 1.5 డయాబెటిస్ ఉందనే విషయం బయటకు రావడంతో దీనిపై కొంచెం ప్రచారం మొదలయ్యింది.

**టైప్ 1, 2 డయాబెటిస్ అంటే?**

టైప్ 1 డయాబెటిస్ అనేది ఆటోఇమ్యూన్ సమస్యతో వస్తుంది. ఇది ఉన్న వారిలో హార్మోన్ ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే పాంక్రియాస్‌లోని సొంత కణాలను శరీర రోగ నిరోధక వ్యవస్థ నాశనం చేస్తుంది. దీంతో శరీరం ఇన్సులిన్ ఉత్పత్తి సామర్థ్యం పూర్తిగా కోల్పోతుంది. లేదా చాలా తక్కువ ఉత్పత్తి చేస్తుంది. ఇది ఎక్కువగా చిన్న వయసులోనే మొదలవుతుంది. టైప్ 2 మధుమేహం సహజంగా వయసు మీద పడుతున్నప్పుడు మొదలవుతుంది. ఇది ఉన్న వారిలో ఇన్సులిన్ రెసిస్టెన్స్ ఏర్పడుతుంది. వీరిలో ఇన్సులిన్ ఉత్పత్తి సామర్థ్యం ఉంటుంది కానీ శరీరానికి సరిపోదు. ఇప్పుడు 90% వరకు మధుమేహ బాధితులకు టైప్ 2నే ఉందని లెక్కలు చెప్తున్నాయి.

**టైప్ 1.5 మధుమేహం ఎలా భిన్నమైనది?**

టైప్ 1.5 మధుమేహం ఉన్నవారిలో టైప్ 1 లానే రోగ నిరోధక వ్యవస్థ సొంత శరీరంలోని పాంక్రియాస్ కణాలపై దాడి చేస్తుంది. అయితే, వీరిలో ఇన్సులిన్ ఉత్పత్తి వెంటనే ఆగిపోదు. టైప్ 2 డయాబెటిస్ బాధితుల్లో లాగా క్రమంగా ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గిపోతుంది. టైప్ 1.5 మధుమేహాన్ని గుర్తించిన ఐదేండ్ల తర్వాత ఇన్సులిన్‌ను బయట నుంచి తీసుకోవాల్సిన పరిస్థితి రావొచ్చు. సులువుగా చెప్పాలంటే.. టైప్ 1.5కు కారణం టైప్ 1 లాంటిది, లక్షణాలు మాత్రం టైప్ 2 లాంటివి.



**టైప్ 2 డయాబెటిస్ అనే పొరపాటు భావన**

టైప్ 1.5 డయాబెటిస్ 30 ఏండ్ల వయసుకు అటుఇటు ఉన్న వారిలో ఎక్కువగా మొదలవుతూ ఉంటుంది. టైప్ 2 డయాబెటిస్ కూడా ఈ వయసులోనే వస్తుంది కాబట్టి వైద్యులు సైతం టైప్ 1.5ని కూడా టైప్ 2గానే ఎక్కువగా పొరబడుతున్నారు. ప్రత్యేక ఆటోఇమ్యూన్ పరీక్షతోనే దీనిని గుర్తించవచ్చు. కానీ, చాలామంది వైద్యులు ఈ పరీక్ష చేయించరు. దీంతో టైప్ 1.5ను గుర్తించలేకపోతున్నారు. టైప్ 1.5ను త్వరగా గుర్తిస్తే నష్టాన్ని తగ్గించవచ్చని వైద్య నిపుణులు చెప్తున్నారు.



జైలు నుంచి విడుదలైన అనంతరం కేటీఆర్‌ను ఆలింగనం చేసుకొని భావోద్వేగానికి లోనైన ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో కవిత భర్త అనిల్, కుమారుడు ఆదిత్య, హరీశ్‌రావు

## ఉద్విగ్న వాతావరణంలో

# కవిత విడుదల

- తీహార్ జైలు వద్ద భారీ స్వాగతం
- కేటీఆర్, హరీశ్ సహా తరలిన బీఆర్‌ఎస్ ముఖ్య నేతలు
- జైలు నుంచి రాగానే కవిత భావోద్వేగం
- 'కవిత.. డాటర్ ఆఫ్ ఫైటర్' అంటూ జాగృతి కార్యకర్తలు, నేతల నినాదాలు
- నేడు హైదరాబాద్ రానున్న కవిత

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఉద్విగ్నభరిత వాతావరణంలో తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. బెయిల్‌కు సంబంధించిన లాంఛనాలన్నీ పూర్తయ్యాక ఆమె జైలు నుంచి బయటకు వచ్చారు. కవిత బెయిల్ పిటిషన్ మంగళవారం సుప్రీం కోర్టు ముందుకు వస్తున్న నేపథ్యంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ సోమవారమే ఢిల్లీకి వెళ్లారు. వారితోపాటు మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, ముఠా గోపాల్, ఎమ్మెల్సీలు శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎంపీ కవిత, పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఢిల్లీ వెళ్లారు. మంగళవారం ఉదయమే సుప్రీం కోర్టు వద్దకు చేరుకున్నారు. కవిత కేసుకు సంబంధించిన కోర్టు హాలు వద్ద వాదనలను ఆసాంతం విన్నారు. తీర్పు కోసం ఆతృతగా ఎదురుచూశారు. న్యాయస్థానం బెయిల్ ఇస్తున్నట్టు చెప్పిన వెంటనే కేటీఆర్ ముఖంలో పట్టరాని ఆనందం కనిపించింది. న్యాయమూర్తి తీర్పు చెప్పే సమయంలో కేటీఆర్ ఒకింత ఉద్విగ్నానికి లోనయ్యారు. తీర్పు వచ్చిన తర్వాత బయటకు వచ్చిన కేటీఆర్, హరీశ్ రావు అక్కడ ఉన్న పార్టీ నేతలను ఆలింగనం చేసుకొని తమ ఆనందాన్ని పంచుకున్నారు. తుది తీర్పు రావడంతో వెంటనే తదుపరి కార్యాచరణ రూపొందించుకునేందుకు, బెయిల్ కాపీలు, ష్యూరిటీలు తదితర వాటి గురించి న్యాయవాదులతో మాట్లాడారు. ష్యూరిటీల్లో ఒకటి కవిత భర్త అనిల్‌కుమార్ ఇవ్వగా మరోటి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఇచ్చారు. సుప్రీం కోర్టులో లాంఛనాలను పూర్తిచేసుకొని అక్కడి నుంచి ఎంపీ వద్దిరాజు నివాసానికి ఆటోలోనే కేటీఆర్ వెళ్లారు. కోర్టు వద్ద ప్రజలు ఎక్కువగా ఉండటం, అందుబాటులో ఆటో రావటంతో అందులో వద్దిరాజు నివాసానికి వెళ్లారు.

### జైలు వద్ద భారీ స్వాగతం

తీహార్ జైలు నుంచి మంగళవారం పొద్దుపోయిన తర్వాత కవిత విడుదలయ్యారు. రౌస్ అవెన్యూ న్యాయస్థానం నుంచి కవిత బెయిల్‌కు సంబంధించిన పత్రాలను న్యాయవాదులు జైలు అధికారులకు సమర్పించారు. జైలు లాంఛనాలు పూర్తయిన తర్వాత రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఆమె బయటకు వచ్చారు. కవిత విడుదల సందర్భంగా తీహార్ జైలు వద్దకు పార్టీ శ్రేణులు భారీగా చేరుకున్నాయి. హరీశ్‌రావు, కేటీఆర్‌తోపాటు పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్‌రావు, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శంబీపూర్ రాజు, కేపీ వివేక్ తదితరులు కూడా వచ్చారు. కవిత భర్త అనీల్ కుమార్, ఆమె పిల్లలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, జాగృతి కార్యకర్తలు పెద్ద ఎత్తున కవితకు జైలు వద్ద స్వాగతం పలికారు. గంటల తరబడి వేచి చూసిన వీరంతా 'కవిత.. డాటర్ ఆఫ్ ఫైటర్' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ప్లకార్డులు పట్టుకొని కవితకు స్వాగతం పలికారు. జైలు పరిసరాల్లో మిఠాయిలు పంచారు. జైలు నుంచి కవిత నేరుగా వసంత విహార్‌లో ఉన్న పార్టీ కార్యాలయానికి వెళ్లారు.

### కవిత భావోద్వేగం.. నేడు హైదరాబాద్ రాక

జైలు నుంచి బయటకు వచ్చిన కవిత తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. గేటు బయటే ఉన్న పెద్ద కొడుకు ఆదిత్య, భర్త అనిల్, సోదరుడు కేటీఆర్‌ను ఆలింగనం చేసుకొని కన్నీటిపర్యంతమయ్యారు. బుధవారం మధ్యాహ్నం 2.45గంటలకు ఢిల్లీ నుంచి హైదరాబాద్ బయల్దేరనున్నారు. నేరుగా శంషాబాద్ విమానాశ్రయానికి రానున్నారు. కవిత రాక సందర్భంగా అభిమానులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నేతలు ఆమెకు సాదరస్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# వడ్డీతో సహా చెల్లిస్తం

- నేను కేసీఆర్ బిడ్డను.. తప్పు చేయను
- నేను మొండిదాన్ని.. నన్ను అనవసరంగా జైలుకు పంపి జగమొండిని చేసిండ్రు
- కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలనే దురుద్దేశంతోనే నన్ను జైలుకు పంపిండ్రు
- ప్రజాక్షేత్రంలో గట్టిగా పనిచేస్తం
- పోరాటం నా రక్తంలోనే ఉన్నది
- న్యాయం కోసం పోరాడుతం
- రాజకీయంగా యుద్ధం చేస్తం
- నిప్పులు చెరిగిన ఎమ్మెల్సీ కవిత
- కష్టకాలంలో తన కుటుంబానికి తోడున్న అందరికీ ధన్యవాదాలు తెలిపిన కవిత



మీడియాతో మాట్లాడుతున్న కవిత

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): 'పద్దెనిమిదేండ్లు నేను రాజకీయాల్లో ఉన్న.. ఎన్నో ఎత్తుపల్లాలు చూసిన.. ఒక తల్లిగా ఐదున్నర నెలలు పిల్లలను, కుటుంబాన్ని వదిలి ఉండడమన్నది చాలా ఇబ్బందికర విషయం.. నన్ను నా కుటుంబాన్ని ఇబ్బందుల పాలు చేసినవారికి తప్పకుండా వడ్డీతో సహా చెల్లిస్తం.. సమయం వస్తది.. తప్పకుండా చెల్లిస్తం' అంటూ ఎమ్మెల్సీ కవిత ఉద్వేగానికి లోనయ్యారు. 'నేను తెలంగాణ బిడ్డను. కేసీఆర్ బిడ్డను. నేను తప్పు చేసే ప్రసక్తే లేదు. నేను మొండిదాన్ని. అనవసరంగా జైలుకు పంపి నన్ను జగమొండిని చేసిన్రు' అంటూ ఉబికి వస్తున్న కన్నీళ్లను ఉగ్గబట్టుకొని మాట్లాడారు.

మంగళవారం తీహార్ జైలు నుంచి బయటికి వచ్చాక ఆమె తన కొడుకును ముద్దాడారు. భర్త అనిల్‌రావు, అన్న కేటీఆర్‌ను ఆలింగనం చేసుకొని కన్నీటిపర్యంతమయ్యారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సహా కుటుంబసభ్యులను కలుసుకొని ఉద్విగ్నానికి లోనయ్యారు. అనంతరం ఆమె మీడియాతో కొంతసేపు మాట్లాడారు. తనను ఉద్దేశపూర్వకంగా రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా జైలుకు పంపారని నిప్పులు చెరిగారు. 'జై తెలంగాణ..జై తెలంగాణ.. అందరికీ నమస్కారం. ఐదున్నర నెలల తర్వాత మీ అందర్నీ కలవటం చాలా సంతోషం. ఇక్కడికి వచ్చినటువంటి బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, మీడియా మిత్రులకు అందరికీ పేరుపేరునా నమస్కారాలు. ఇటువంటి కష్టసమయంలో నాకూ నా కుటుంబానికి తోడున్న వారందరికీ హృదయపూర్వకంగా పాదాభివందనాలు తెలియజేస్తున్నా' అంటూ కంటతడి పెట్టుకున్నారు.

### నేను తెలంగాణ బిడ్డను..

'ఐదున్నర నెలల తరువాత నా కొడుకు, నా భర్త, నా అన్నతో కలిసే అవకాశం లభించింది. అందరికీ తెలుసు. రాజకీయ కక్షతోనే నన్ను జైల్లో పెట్టారు. ఇబ్బందేమీ లేదు. తప్పకుండా మేం పోరాటం చేస్తాం. ఎవరి గురించి చెప్పే అవసరం లేదు. నేను తెలంగాణ బిడ్డను. నేను కేసీఆర్ బిడ్డను. కేసీఆర్ బిడ్డగా నేను తప్పు చేసే ప్రసక్తే లేదు. ప్రజాక్షేత్రంలో ఇంకా గట్టిగా పనిచేస్తాం. కమిట్‌మెంట్‌తో పనిచేస్తం. అందరితో కలిసి పనిచేస్తం. న్యాయం కోసం పోరాటం చేస్తం. రాజకీయంగా యుద్ధమే చేస్తం. అకారణంగా.. అన్యాయంగా రాజకీయ కక్షసాధింపులో భాగంగా కేసీఆర్ బిడ్డను ఇబ్బంది పెట్టడం ద్వారా కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలనే దురుద్దేశంతో జైలుకు పంపారు' అని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు.

## కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు అభినందనలు

### కేంద్ర మంత్రి బండి సంజయ్ ట్వీట్

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో..'కాంగ్రెస్ పార్టీకి, వారి న్యాయవాదులకు కంగ్రాట్స్' అంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ మంగళవారం ట్వీట్ చేశారు. 'మీ అవిశ్రాంత కృషి చివరికి ఫలించింది. ఈ బెయిల్ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ సమిష్టి విజయం' అని బండి సంజయ్ పేర్కొన్నారు. బెయిల్ కోసం వాదించిన అభ్యర్థికి బీఆర్‌ఎస్ మద్దతు ఇవ్వడం, కాంగ్రెస్ అభ్యర్థి ఏకగ్రీవంగా రాజ్యసభకు నామినేట్ కావడం, క్విడ్‌ప్రోకోగా ఆయన ఆరోపించారు. విలీనం మాట ముచ్చట పూర్తయింది 'అప్పగింతలే' తరువాయి అని పేర్కొన్నారు.

## బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనంతోనే బెయిల్

### రేవంత్‌రెడ్డిని ఇబ్బంది పెట్టేందుకే ఎత్తుగడ

### కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనం అవుతున్నందుకే ఎమ్మెల్సీ కవితకు బెయిల్ ఇచ్చారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. బీజేపీలో బీఆర్‌ఎస్ విలీన ప్రక్రియ కవితకు బెయిల్ ద్వారా మొదలైందని విమర్శించారు. ఢిల్లీలో కేటీఆర్, హరీశ్‌రావు బీజేపీ సీనియర్ నేతలతో పలు దఫాలుగా జరిపిన చర్చల ఫలితంగానే ఈడీ ఉదాసీనంగా బెయిల్ ఇచ్చేందుకు సహకరించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని ఇబ్బంది పెట్టడానికి బీజేపీ, బీఆర్‌ఎస్ కూడగట్టుకొని ముందుకు వెళ్తున్నాయని ఆరోపించారు.

## బండివి చౌకబారు ప్రేలాపనలు

- ఎమ్మెల్సీ కవితకు వచ్చిన బెయిల్‌ను కాంగ్రెస్, బీఆర్‌ఎస్ బంధంతో పోల్చడం దుర్మార్గం
- ఆ వ్యాఖ్యలను కోర్టు ధిక్కరణగా స్వీకరించాలి
- సీజేఐకి కేటీఆర్ విజ్ఞప్తి



ఢిల్లీలో సుప్రీంకోర్టు వద్ద ఆటోలో ప్రయాణిస్తున్న కేటీఆర్, పాడి కౌశిక్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ మంజూరు నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను కోర్టు ధిక్కారంగా పరిగణించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టుకు ఉద్దేశాలు ఆపాదించేలా కామెంట్స్ చేసిన బండి సంజయ్ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ విజయమంటూ బండి సంజయ్ చేసిన ట్వీట్‌ను కేటీఆర్ ఖండించారు. కాంగ్రెస్ లాయర్ చేసిన కృషితో ఒకరికి బెయిల్ వస్తే, బీఆర్‌ఎస్ మద్దతు కారణంగా ఆ న్యాయవాది రాజ్యసభలో స్థానం పొందారంటూ సంజయ్ వివాస్పద వ్యాఖ్యలు చేసిన విషయాన్ని కేటీఆర్ ఉటంకించారు. వైన్ అండ్ డైన్ క్రైమ్‌లో పార్టనర్స్ అయిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు కంగ్రాట్యులేషన్స్ అంటూ బండి సంజయ్ తన స్థాయిని మరిచి సుప్రీంకోర్టు తీర్పును అపహాస్యం చేశారని కేటీఆర్ మండిపడ్డారు. కేంద్రమంత్రిగా ఉంటూ చౌకబారుగా మాట్లాడతారా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు.

## కేసులో కవిత పాత్ర ఎక్కడుంది?

### జాతీయ మీడియాలోనూ ఇవే కథనాలు

### 'సత్యమేవ జయతే' హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): 'మద్యం విధానం' కేసులో ఎమ్మెల్సీ కవితకు బెయిల్ రావడాన్ని జాతీయ మీడియా ప్రముఖంగా ప్రచురించింది. టీవీ చానళ్లు డిబేట్లు నిర్వహించాయి. కేసు దర్యాప్తునకు సంబంధించి ఈడీ, సీబీఐ వైఖరిపై మండిపడుతూ సుప్రీంకోర్టు చేసిన కీలక వ్యాఖ్యలనే హెడ్డింగ్స్‌గా ప్రచురించింది. ఈ కేసులో కవితకు ప్రమేయంలేదని, చివరకు న్యాయమే గెలించిందంటూ సోషల్‌మీడియాలో నెటిజన్లు కామెంట్లు చేశారు. 'కవిత', 'సత్యమేవ జయతే' హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండింగ్ అయ్యాయి.

## లోకం పోకడ




మీకు పుణ్యముంటుంది.. నన్ను డిశ్చార్జి చేయకండి సారూ.. బయట మా ఇల్లు కూల్చేశారు!

## ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కీలక పరిణామాలు

**(2022 ఆగస్టు నుంచి.. 2024 ఆగస్టు వరకు..)**

ఢిల్లీ మద్యం పాలసీ విధానంపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను 2022 ఆగస్టు నుంచి టార్గెట్ చేశారు. అదే సంవత్సరం డిసెంబర్ 2న కవితను విచారిస్తామంటూ సీబీఐ నోటీసులు ఇచ్చింది. 2024 మార్చి 15న కవిత ఇంటికి వచ్చి కొన్ని గంటలపాటు విచారణ జరిపిన ఈడీ అధికారులు అదే రోజు రాత్రి ఆమెను అరెస్టు చేశారు. తేదీల వారీగా ఈ కేసులో ముఖ్య పరిణామాలు..

**2022 ఆగస్టు 21:** ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను టార్గెట్ చేసిన బీజేపీ కేంద్ర నాయకత్వం ఆ పార్టీ ఎంపీ పర్వేశ్‌వర్మ, మాజీ ఎమ్మెల్యే మంజిందర్ సిర్సా ద్వారా బయటపెట్టించింది. ఆగస్టు 22న రాష్ట్ర బీజేపీ నాయకులు కవిత ఇంటిపై దాడికి తెగబడ్డారు.

**2022 సెప్టెంబర్ 5:** ఈ కేసులో కవిత బ్లాక్‌మనీ పెట్టుబడిగా పెట్టారని, సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఈడీ, సీబీఐ అధికారులకు బక్క జడ్సన్ ఫిర్యాదు

**2022 నవంబర్ 26:** అభియోగపత్రంలో తొలిసారిగా ఎమ్మెల్సీ కవిత పేరును ప్రస్తావించిన ఈడీ

**2022 డిసెంబర్ 2:** కవితకు సీఆర్పీసీ సెక్షన్ 160 కింది నోటీసులు ఇచ్చిన సీబీఐ.. డిసెంబర్ 6న విచారిస్తామని, ఢిల్లీ, హైదరాబాద్‌లోఎక్కడ సౌకర్యమో చెప్పాలని కోరింది.

**2022 డిసెంబర్ 5:** ఇతర కార్యక్రమాల వల్ల డిసెంబర్ 11, 12, 13, 14, తేదీల్లో అందుబాటులో ఉంటానని కవిత తెలిపారు. దీంతో సీబీఐ డిసెంబర్ 11న విచారణకు వస్తామని తెలపడంతో ఆమె వెల్‌కమ్ చెప్పారు.

**2022 డిసెంబర్ 11:** ఒక మహిళా అధికారితోపాటు 11 మంది అధికారులు కవిత ఇంటికి వచ్చారు. వారిలో ఐదుగురు సభ్యులతో కూడిన బృందం కవితను విచారించింది.

**2023 మార్చి 8:** ఎమ్మెల్సీ కవితకు నోటీసులిచ్చిన ఈడీ మార్చి 9న హాజరు కావాలని కోరింది. అందుకు కవిత మార్చి 11న హాజరవుతానని బదులిచ్చారు.

**2023 మార్చి 11:** తొలిసారిగా హైదరాబాద్‌లోని తన ఇంట్లో ఈడీ ముందు హాజరైన కవిత.. దాదాపు 9 గంటలపాటు విచారణను ఎదుర్కొన్నారు.

**2023 మార్చి 15:** ఈడీ చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నదంటూ కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

**2023 మార్చి 16:** మొదటి విచారణ అనంతరం మార్చి 11న నోటీసులు ఇచ్చి.. రెండోసారి విచారణకు మార్చి 16న హాజరుకావాలని ఈడీ కోరింది. రెండో విచారణకు ఈడీ అడిగిన పత్రాలను న్యాయవాదితో కవిత పంపారు.

**2023 మార్చి 20:** మూడో విచారణకు 2023 మార్చి 20న ప్రత్యక్షంగా హాజరుకావాలని మార్చి 16న ఈడీ నోటీసులు జారీ చేసింది. దీంతో కవిత ఈడీ ఎదుట హాజరై పదిన్నర గంటలపాటు విచారణ ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా తన ఎనిమిది ఫోన్లని ఈడీకి కవిత సమర్పించారు.

**2023 మార్చి 20:** ఈడీ విచారణ ఎదుర్కొన్న కవిత.. అదేరోజు నోటీసులు అందుకొని ఆ మరుసటి రోజు మార్చి 21న మరోమారు విచారణకు హాజరయ్యారు.

**2023 మే 7:** 'ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అసలు కుంభకోణం ఎలా జరిగింది? ఎక్కడ జరిగింది? చెప్పండి. సాక్ష్యాధారాలతో దర్యాప్తు కొనసాగలేదు. రూ.వంద కోట్ల అక్రమాలంటూ.. రూ.లక్షల్లో నగదు చూపిస్తున్నారు. తగిన ఆధారాలు చూపించండి' అంటూ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఈడీకి చురకలంటించింది.

**2023 సెప్టెంబర్ 26:** మద్యం పాలసీ కేసులో ఈడీ ఇచ్చిన సమన్లను కవిత సవాల్ చేయగా 2023 సెప్టెంబర్ 26న సుప్రీంకోర్టు విచారణ చేపట్టి.. నవంబర్ 20 వరకూ ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశాలు జారీ చేసింది.

**2024 ఫిబ్రవరి 21:** మద్యం పాలసీ కేసులో ఫిబ్రవరి 26న తమ ఎదుట విచారణకు హాజరుకావాలని సీబీఐ నోటీసులు జారీ చేసింది.

**2024 ఫిబ్రవరి 25:** ఫిబ్రవరి 26న విచారణకు హాజరు కాలేనంటూ ఫిబ్రవరి 25న సీబీఐకి కవిత లేఖ రాశారు.

**2024 మార్చి 15:** విచారణ పేరుతో హైదరాబాద్‌లోని కవిత ఇంటికి మధ్యాహ్నం 1.45 గంటలకు వచ్చిన ఈడీ అధికారులు.. కొన్ని గంటలపాటు ఆమెను విచారించారు. రాత్రి 8.45 గంటలకు ఎలాంటి వారెంట్ లేకుండా అదుపులోకి తీసుకున్నారు. అర్ధరాత్రి ఢిల్లీలోని ఈడీ ఆఫీసుకు తరలించారు.

**2024 మార్చి:** తన కుమారుడికి పరీక్షలు ఉన్నందున బెయిలివ్వాలని తొలిసారి కవిత బెయిల్ పిటిషన్ వేశారు.

**2024 ఏప్రిల్ 11:** ఇదే కేసులో తీహార్ జైల్లో ఉన్న కవితను సీబీఐ అదుపులోకి తీసుకున్నది.

**2024 జూలై 16:** అస్వస్థతకు గురైన ఎమ్మెల్సీ కవిత

**2024 జూలై:** తనపై తప్పుడు అభియోగాలు మోపారని మళ్లీ ట్రయల్ కోర్టులో బెయిల్ పిటిషన్ వేసిన కవిత

**2024 జూలై:** ఈడీ, సీబీఐ కేసుల్లో ఏకంగా సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయం. ట్రయల్ కోర్టులో వేసిన బెయిల్ పిటిషన్ వెనక్కి తీసుకున్న కవిత

**2024 ఆగస్టు 7:** ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన కవిత

**2024 ఆగస్టు 20:** కవిత బెయిల్ పిటిషన్‌పై మరోసారి వాదనలు జరిగాయి.

**2024 ఆగస్టు 22:** మరోసారి అస్వస్థతకు గురైన కవిత

**2024 ఆగస్టు 27:** ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు

## ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టులు ఇలా..

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో సీఎం కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, ఎమ్మెల్సీ కవిత సహా పలువురు అరెస్టయ్యారు. వీరిలో కొందరికి బెయిల్ రాగా, మరికొందరికి రాలేదు.

- **2022 సెప్టెంబర్ 6:** ఆప్ నేత విజయ్‌నాయర్ అరెస్టు, రెగ్యులర్ బెయిల్ రాలేదు.
- **2023 ఫిబ్రవరి 26:** మనీశ్ సిసోడియా అరెస్టు, 2024 ఆగస్టు 9న బెయిల్
- **2023 ఫిబ్రవరి 1:** మాగుంట రాఘవ అరెస్టు, 2023 ఆగస్టు 10న బెయిల్
- **2023 అక్టోబర్ 4:** సంజయ్ సింగ్ అరెస్టు, 2024 ఏప్రిల్ 2న బెయిల్
- **2024 మార్చి 21:** అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు, ఇంకా బెయిల్ రాలేదు
- **2023 ఫిబ్రవరి 8:** గౌతమ్ మల్హోత్ర అరెస్టు, 2023 మే 7న బెయిల్
- **2022 సెప్టెంబర్ 28:** సమీర్ మహేంద్రు అరెస్టు, రెగ్యులర్ బెయిల్ రాలేదు
- **2022 నవంబర్ 29:** అమిత్ అరోరా అరెస్టు, రెగ్యులర్ బెయిల్ రాలేదు
- **2022 నవంబర్ 10:** పీ శరత్‌చంద్రారెడ్డి అరెస్టు, 2023 మే 8న బెయిల్
- **2022 అక్టోబర్ 10:** అభిషేక్ బోయినపల్లి అరెస్టు, 2024 మార్చి 20న మధ్యంతర బెయిల్‌పై విడుదల
- **2023 ఫిబ్రవరి 9:** బుచ్చిబాబు గోరంట్ల అరెస్టు, 2023 మార్చి 6న బెయిల్
- **2022 నవంబర్:** 10న బినయ్‌బాబు అరెస్టు, 2023 డిసెంబరు 8న బెయిల్
- **2023 ఫిబ్రవరి 8:** రాజేశ్ జోషి అరెస్టు, 2023 మే 7న బెయిల్
- **2023 జూలై 6:** దినేశ్ అరోరా అరెస్టు, 2023 ఆగస్టు 1న బెయిల్
- **2024 మార్చి 15:** ఎమ్మెల్సీ కల్వకుంట్ల అరెస్టు.. 2024 ఆగస్టు 27న బెయిల్
- **2024 ఏప్రిల్ 15:** చన్‌ప్రీత్ సింగ్ అరెస్టు, ఇంకా బెయిల్ రాలేదు

# పార్టీ నేతలతో ఎమ్మెల్సీ కవిత భేటీ

- పార్టీ క్యాడర్‌కు కేటీఆర్ కృతజ్ఞతలు



ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో పార్టీ నేతల సమావేశంలో మిఠాయి తినిపించుకుంటున్న కేటీఆర్, కవిత

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బీఆర్‌ఎస్ పార్టీ కుటుంబ సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. తీహార్ జైలు నుంచి బెయిల్‌పై మంగళవారం బయటికి వచ్చిన తరువాత ఆమె పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్టీ పార్లమెంటరీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి, ఎంపీలు దామోదర్‌రావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతో కలిసి నేరుగా ఢిల్లీ వసంతవిహార్‌లోని తెలంగాణభవన్‌కు బయలుదేరారు. తెలంగాణభవన్‌లో ఆమెకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఎమ్మెల్సీలు శేరి సుభాశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శంబీపూర్ రాజు, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, వీ శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, డాక్టర్ సంజయ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, పాడి కౌశిక్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, అనిల్ జాదవ్, బీ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, కర్నె ప్రభాకర్, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు గజ్జెల నగేశ్, కే వాసుదేవరెడ్డి, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, వై సతీశ్‌రెడ్డి తదతరులతో కవిత సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఢిల్లీకి స్వచ్ఛందంగా వచ్చి కుటుంబానికి, పార్టీకి అండగా ఉన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. కష్టకాలంలో అండగా ఉన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం మధ్నాహ్నం హైదరాబాద్ రానున్నట్టు వెల్లడించారు. సమావేశ మందిరంలోకి వచ్చిన తరువాత ఆమెకు కేటీఆర్ మిఠాయి తినిపించి స్వాగతం పలికారు.

# అరెస్టు..విచారణ అన్యాయం

- కవితపై మోపిన అభియోగాలన్నింటినీ సుప్రీంకోర్టు తిరస్కరించింది
- కడిగిన ముత్యంలా ఆమె బయటకొచ్చారు
- కవిత తరపు న్యాయవాది మోహిత్‌రావు



మీడియాతో మాట్లాడుతున్న మోహిత్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు ఇల్లీగల్, అన్ ఫెయిర్ ప్రాసిక్యూషన్ అని సుప్రీంకోర్టు స్పష్టం చేసినట్టు ఆమె తరపు న్యాయవాది మోహిత్‌రావు తెలిపారు. కవితకు మంగళవారం బెయిల్ మంజూరైన అనంతరం ఆయన సుప్రీం కోర్టు ఆవరణలో మీడియాతో మాట్లాడారు. కవితను మార్చి 15న అన్యాయంగా అరెస్టు చేశారని, అన్యాయంగా విచారిస్తున్నారని చెప్తూనే ఉన్నానని, ఇదే విషయాన్ని ఇప్పుడు అత్యున్నత ధర్మాసనం వెల్లడించిందని చెప్పారు. కడిగిన ముత్యంలా బయటకొస్తానని కవిత చెప్పారని, ఇప్పుడు అలాగే బయటకు వచ్చారని పేర్కొన్నారు. ఈ కేసులో కవిత ప్రమేయం లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసిందని, కవితపై మోపిన అన్ని అభియోగాలను తిరస్కరించిందని వివరించారు. ఈ కేసుకు సంబంధించి ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేవని, ఎక్కడా నగదు అంశం బయటపడలేదని చెప్పారు. కేవలం కేసీఆర్ బిడ్డ అన్న కక్షతోనే అరెస్టు చేశారని, పార్లమెంట్ ఎన్నిలకు ఒక్కరోజు ముందు అమెను అరెస్టు చేయడం వెనుక మతలబు ఏమిటని, ఎన్నికల ప్రచారానికి వస్తారని భయపడ్డారా? అని ప్రశ్నించారు. విడుదలైన తర్వాత చట్టప్రకారం విచారణకు కవిత సహకరిస్తారని, కోర్టు వాయిదాలకు హాజరవుతారని తెలిపారు.



## కవితకు బెయిల్

మొదటిపేజీ తరువాయి...

నిరోధక చట్టంలోని 45వ సెక్షన్ ప్రకారం మహిళను ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. సీబీఐ చార్జిషీట్ దాఖలు చేయడం, ఈడీ దర్యాప్తు పూర్తి కావడం, మహిళకు ఉన్న ప్రత్యేక వెసులుబాటు దృష్ట్యా బెయిల్ మంజూరు చేస్తున్నట్టు ద్విసభ్య ధర్మాసనం తెలిపింది. కానీ, కవితకు బెయిల్ మంజూరైన ఐదు నిమిషాల్లోనే కాంగ్రెస్, బీజేపీ విషం కక్క డం మొదలుపెట్టాయి. ఆయా పార్టీల నేత లు ఏకంగా కోర్టు తీర్పునే తప్పుబట్టారు. వాస్తవానికి బీఆర్‌ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక బీజేపీ, కాంగ్రెస్ రెం డ్లుగా ఆడబిడ్డను వేధిస్తూనే ఉన్నాయి. విచారణ సంస్థల కన్నాముందే 2022 ఆగస్టు 21న ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కవిత పేరును బీజేపీ నేతలు ప్రస్తావించడమే ఇందుకు ఉదాహరణ. నాటి నుంచి కేంద్ర ప్రభుత్వ జేబు సంస్థలు ఈడీ, సీబీఐ విచారణ పేరుతో వెంటాడుతుంటే.. కాం గ్రెస్, బీజేపీ విష ప్రచారంతో వేధించాయి. విచారణకు పిలిచిన ప్రతిసారీ సహకరించినా, ఆధారాలన్నింటినీ సమర్పించినా దర్యాప్తు సంస్థలు వదిలిపెట్టలే దు. ఈ ఏడాది మార్చి 15న అక్రమంగా అరెస్ట్ చేశాయి. రెండేండ్లుగా రాజకీయంగా ఎన్నికుట్రలు, కుతంత్రాలు చేసి నా.. 165 రోజులుగా జైలులో ఉంచి శారీరకంగా, మానసికంగా ఎంత హింసించినా కవిత మొక్కవోని దీక్షతో నిలబడ్డారు. రాజకీయ కక్షతోనే తనను కేసులో ఇరికించారని న్యాయస్థానంలో గట్టిగా పోరాడారు. చివరికి న్యాయదేవత సాక్షిగా గెలిచి.. బయటికి వచ్చారు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# ఉక్రెయిన్ సమస్య

**ప్రధాని** నరేంద్ర మోదీ ఇటీవల జరిపిన ఉక్రెయిన్ పర్యటనకు ఎన్నో ప్రత్యేకతలున్నాయి. సోవియట్ యూనియన్ నుంచి ఉక్రెయిన్ విడిపోయి స్వతంత్రం ప్రకటించుకున్న తర్వాత భారత ప్రభుత్వాధినేత ఆ దేశాన్ని సందర్శించడం ఇదే మొదటిసారి. ఉక్రెయిన్‌పై రష్యా రెండేండ్లకు పైగా భీకర యుద్ధం జరుపుతున్న సంగతి తెలిసిందే. మాస్కోలో రష్యా అధ్యక్షుడు వ్లదీమిర్ పుతిన్‌ను ఆలింగనం చేసుకున్నట్టుగానే కీవ్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు వలోదిమర్ జెలెన్‌స్కీని మోదీ కావలించుకున్నారు. యుద్ధం వల్ల అష్టకష్టాలు పడుతున్న ఉక్రెయిన్ ప్రజలకు సానుభూతి తెలిపారు. యుద్ధం ద్వారా ఏ సమస్యా పరిష్కారం కాదని హితవచనం పలికారు. ప్రధాని మోదీ తన పర్యటనను ముగించుకొని ఢిల్లీకి తిరుగుపయనమైన కొద్దిసేపటి తర్వాత జెలెన్‌స్కీ మీడియాతో మాట్లాడుతూ భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేయడం గమనార్హం. రెండు దేశాల సంబంధాల్లో ఏర్పడిన అగాధాన్ని ఇది సూచిస్తున్నది.

మన దేశానికి చైనాతో గల సరిహద్దు వివాదాన్ని జెలెన్‌స్కీ మీడియా సమావేశంలో పరోక్షంగా ప్రస్తావించడం అభ్యంతరకరమే. ఉక్రెయిన్‌పై పుతిన్ దాడి చేయడం సరైనదే అయితే మరోచోట చైనా చేసేదీ సబబే అవుతుందన్నట్టుగా జెలెన్‌స్కీ చేసిన వ్యాఖ్యలు భారత్‌కు ఏ మాత్రం ఆమోదయోగ్యం కావు. ప్రస్తుతం ఎడతెగకుండా కొనసాగుతున్న యుద్ధానికి పరిష్కారం కనుగొనడంలో భారత్ పాత్ర అంతంత మాత్రమేనని కూడా జెలెన్‌స్కీ తేల్చిచెప్పారు. యుద్ధంలో రెండు వైరి పక్షాలను ఏకకాలంలో మెప్పించడం దుస్సాధ్యమని ఈ ఉదంతం మరోసారి రుజువు చేసింది. గత నెల మాస్కోలో పుతిన్‌ను మోదీ కావలించుకున్న సమయంలోనే ఉక్రెయిన్‌పై రష్యా భారీ క్షిపణి దాడులు జరిపింది. ఈ దాడుల్లో అనేకమంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఆ సందర్భంలోనూ జెలెన్ స్కీ భారత్‌పై విమర్శలు చేయడం వివాదాస్పదమైంది.

2022లో రష్యా ఉక్రెయిన్‌పై పూర్తిస్థాయి యుద్ధం మొదలుపెట్టినప్పుడు పశ్చిమదేశాలు రష్యాపై తీవ్రమైన ఆంక్షలు విధించాయి. భారత్ మాత్రం రష్యా నుంచి దిగుమతులు పెంచి ఆంక్షలను బేఖాతరు చేసింది. పశ్చిమదేశాలు ఉక్రెయిన్ యుద్ధం కారణంగా వెలివేసిన రష్యా నుంచి భారత్ పెద్దఎత్తున చమురు చౌకగా దిగుమతి చేసుకుంటున్నది. గత జూలై నాటికి చైనాను దాటేసి అతిపెద్ద దిగుమతిదారుగా భారత్ నిలవడం విశేషం. భారత్‌లోని కొన్ని కార్పొరేట్ కంపెనీలు ఈ దిగుమతుల ద్వారా భారీగా లబ్ధి పొందుతున్నాయనే ఆరోపణలున్నాయి. సహజంగానే ఉక్రెయిన్ యుద్ధరంగంలో తమ శత్రువైన రష్యాకు సన్నిహిత మిత్ర దేశమైన భారత్ ఆపన్నహస్తం అందించడంగానే దీన్ని చూస్తున్నది. జెలెన్‌స్కీ కటువైన మాటల్లో ఇది విస్పష్టంగా వ్యక్తమైంది. తదుపరి శాంతి శిఖరాగ్రసభ భారత్‌లో జరిగితే బాగుండునని ఆయన సూచించడం ఆలోచించాల్సిన విషయం. మాజీ సోవియట్ రిపబ్లిక్‌ల విషయంలో భారత్ తన దౌత్య విధానాలను పునఃపరిశీలించుకోవాలని ఉక్రెయిన్ సమస్య తెలియజేస్తున్నది. చిత్తశుద్ధితో సమదూరం పాటిస్తూ, నిజమైన అలీన విధానం అవలంబిస్తేనే శాంతికాముక దేశంగా భారత్ పేరు సార్థకమవుతుంది.

# హైడ్రా పేరిట.. కాంగ్రెస్ అరాచకం

**హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్).. విశ్వనగరం హైదరాబాద్ పరిరక్షణే ధ్యేయంగా ఏర్పాటు చేశామని చెప్తున్న సంస్థ ఇది. అయితే ఏర్పాటైన నాటి నుంచి ఈ సంస్థ తీరుపై అనుమానాలు కలుగుతున్నాయి. రాజకీయ ప్రత్యర్థులు, గిట్టనివారు, పేదలపై మాత్రమే హైడ్రా దూకుడు ప్రదర్శిస్తున్నదనే విమర్శలు వస్తున్నాయి. చెరువుల పరిరక్షణ పేరిట ప్రత్యర్థులను కాంగ్రెస్ ప్రభుత్వం టార్గెట్ చేస్తున్నదా? సెటిల్‌మెంట్ల కోసమే కూల్చివేతలకు పాల్పడుతున్నదా? హైడ్రాతో నగరంలోని సామాన్యుడి జాగా సురక్షితమేనా? అన్న ప్రశ్నలు ఇప్పుడు అందరి మదిని తొలిచివేస్తున్నాయి.**



**కారుపోతుల పాండరి గౌడ్**
70138 24056



హైదరాబాద్.. ఘన చరిత్ర కలిగిన విశ్వనగరం. వెయ్యి సరస్సుల సమాహారం. జంట జలాశయాలు, మూసీ, మంజీరా నదులు, నగరం నడిబొడ్డున హుస్సేన్ సాగర్.. ఇలా చెప్పుకొంటూపోతే భాగ్యనగరానిది ఒడువని ముచ్చట. అలాంటి నగరంపై కాంగ్రెస్ సర్కార్ కుట్రలకు తెరలేపుతున్నది. హైడ్రా పేరిట హైడ్రామా చేస్తున్నది. 50 ఏండ్ల తమ పాలనలో చెరువులను చెరబట్టిన కాంగ్రెస్.. ఇప్పుడు చెరువుల పరిరక్షణ అని నాటకాలు వేస్తుండటం విడ్డూరం. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు అధికారంలో ఉన్న 1982-2012 మధ్యకాలంలో హైదరాబాద్‌లో మాయమైన చెరువుల సంఖ్య అక్షరాలా 375. అన్యాక్రాంతమైన చెరువు శిఖాలు, భూములు కొన్ని వేల ఎకరాలు. గ్రామీణ ప్రాంతాలను పట్టించుకోకపోవడంతో వలసలు పెరిగి నగరం విధ్వంసానికి గురైంది. గత మూడు దశాబ్దాల్లో చెరువుల్లో వెలిసిన అనేక కాలనీలను మనం చూశాం. ఉమ్మడి పాలనలోనే జంట జలాశయాలు ఆక్రమణకు గురయ్యాయనేది జగమెరిగిన సత్యం. అప్పటి పాలకుల అండతో, రాజకీయ పలుకుబడితో నిబంధనలను తుంగలో తొక్కి జంట జలశయాల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లు వెలిశాయి.

> **అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కొలువైన కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలకు తెరలేపింది. అందులో భాగంగానే హైడ్రాను ఏర్పాటు చేసింది. పరిరక్షణ పేరిట చెరువు భూములపై నజర్ వేసింది. సెటిల్‌మెంట్లకు తెరలేపింది. ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వానికి అనుకూలమైన బడాబాబుల జోలికి వెళ్లకుండా.. ప్రతిపక్ష నేతలు, తమకు సహకరించనివాళ్లే లక్ష్యంగా కూల్చివేతలకు పాల్పడుతున్నది.**

గత ప్రభుత్వం అక్రమ కట్టడాలపై చర్యలకు పూనుకున్నది. కానీ, ఉన్నత న్యాయస్థానాలు ఇచ్చిన స్టేలు అడ్డంకిగా మారాయి. రేవంత్ సర్కార్ మాత్రం నిబంధనలు, స్టేలు జాన్తా నై అంటూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నది. వ్యక్తిగత కక్షతో ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేసి తమకు ఎవరైనా ఒక్కటేనని గప్పాలు కొట్టుకుంటున్న హైడ్రా.. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల ఆక్రమణల విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నది. ఇదంతా చూస్తుంటే ఓ ప్రణాళిక ప్రకారమే హైడ్రాను ఏర్పాటు చేసినట్టు స్పష్టమవుతున్నది.

సీనియర్ ఐపీఎస్ అధికారి రంగనాథ్ నేతృత్వంలో ఏర్పడిన హైడ్రా ముందు పలు సవాళ్లున్నాయి. చెరువులు, కుంటల కబ్జాల కారణంగా 60 ఏండ్లలో హైదరాబాద్ చాలా విధ్వంసమైంది. అక్రమ నిర్మాణాలను కూల్చాలంటే సగం హైదరాబాద్‌ను నేలమట్టం చేయాల్సి ఉంటుంది. ఇక్కడే హైడ్రా విశ్వసనీయత ఏమిటనేది తెలుస్తుంది. నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించిన గత ప్రభుత్వం 118 జీవో ద్వారా వందలాది పేదల ఇండ్లను రెగ్యులరైజ్ చేసింది. అయితే కాంగ్రెస్ సర్కార్ మాత్రం అలాంటి పేదలను టార్గెట్ చేస్తుండటం శోచనీయం. భారీగా పోలీసు బలగాల మధ్య పేదలు, సామాన్యుల ఇండ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తున్నది. హైడ్రాను ముందు పెట్టుకొని పేదల జాగలపై కన్నేసింది. దీంతో హైడ్రా దెబ్బకు సామాన్యుడి నడ్డి విరగడం ఖాయంగా కనిపిస్తున్నది. కాయకష్టం చేసి కట్టుకున్న ఇల్లు, పైసా పైసా కూడబెట్టి కొనుకున్న ప్లాట్‌కు గ్యారంటీ లేకుండాపోయింది. ఈ నేపథ్యంలో బడాబాబులకు వర్తించని నిబంధనలను పేదలకు వర్తింపజేయడం సరికాదు.

అనేక విమర్శలను ఎదుర్కొంటున్న హైడ్రా ముందు పలు సవాళ్లున్నాయి. హైదరాబాద్‌లో ప్రస్తుతం ఉన్న చెరువులెన్ని? వాటి విస్తీర్ణమెంత? ఏ చెరువు ఎంత మేరకు కబ్జాకు గురైంది? కబ్జాదారులు ఎవరు? ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మిస్తున్న కొన్ని నిర్మాణాలనే ఎందుకు కూలుస్తున్నారు? కాంగ్రెస్ సర్కార్ వచ్చిన తర్వాత నిర్మాణం మొదలైన వాటిని కూలుస్తారా? విస్మరిస్తారా? అనుమతి ఇచ్చిన అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? లాంటి అనేక ప్రశ్నలకు హైడ్రా సమాధానం చెప్పాల్సిన అవసరం ఉన్నది.

ఇలా అనేక విమర్శల మధ్య హైడ్రా దూకుడు కొనసాగుతుండగానే.. దాన్ని బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తున్నది. హైడ్రాకు పోలీస్ స్టేషన్ హోదా ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది. దీనివల్ల నేరుగా హైడ్రానే ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు వీలు కలుగుతుంది. ఇక హైడ్రా కూల్చివేసిన భవనాలకు గతంలో అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకునే విషయమై ఉన్నతాధికారులతో ప్రభుత్వం చర్చలు జరపనున్నట్టు తెలుస్తున్నది. అయితే ఒక్క ఎన్ కన్వెన్షన్ కూల్చివేత తప్ప హైడ్రా కొత్తగా సాధించిందేమీ లేదు. మరోవైపు పెద్దలను వదిలిపెట్టి, పేదలపై జులుం ప్రదర్శించడంపై ఇప్పటికే విమర్శలు వస్తున్నాయి. దీనిపై ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. ఈ నేపథ్యంలో సామాన్యుల నిర్మాణాల జోలికొస్తే ప్రజలు తిరగబడటం ఖాయం.

**హైదరాబాద్‌లో ప్రస్తుతం ఉన్న చెరువులెన్ని? వాటి విస్తీర్ణమెంత? ఏ చెరువు ఎంత మేరకు కబ్జాకు గురైంది? కబ్జాదారులు ఎవరు? ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మిస్తున్న కొన్ని నిర్మాణాలనే ఎందుకు కూలుస్తున్నారు? కాంగ్రెస్ సర్కార్ వచ్చిన తర్వాత నిర్మాణం మొదలైన వాటిని కూలుస్తారా? విస్మరిస్తారా? అనుమతి ఇచ్చిన అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? లాంటి అనేక ప్రశ్నలకు హైడ్రా సమాధానం చెప్పాల్సిన అవసరం ఉన్నది.**



# బాధ్యతారాహిత్యం.. బానిస భావం



**శ్రీ శ్రీ కుమార్**

**రాష్ట్రంలో సుమారు తొమ్మిది నెలల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు హామీల అమలు పేరుతో గొప్పలు చెప్పుకొంటూ కాలం వెళ్లదీస్తున్నది.**

గత ప్రభుత్వంలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇచ్చేందుకుగాను కోట్ల రూపాయల ఖర్చు చేసి హంగులు, ఆర్భాటాలు ప్రదర్శించిన కాంగ్రెస్, తమ ప్రభుత్వమే వారికి పరీక్ష నిర్వహించి, ఎంపిక చేసి నియమించుకున్నట్టుగా పత్రికల్లో ప్రకటనలు ఇచ్చుకున్నది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎంపికైన అభ్యర్థులకు కేవలం నియామక పత్రాలిచ్చి చేతులు దులుపుకొన్నదనే అసలు వాస్తవం అభ్యర్థులకు, వారి కుటుంబాలకు తెలుసు. 2023, జూలై, ఆగస్టుల్లోనే నియామకాలు జరిగాయి. వారి జీతభత్యాలకయ్యే ఖర్చుతో ప్రభుత్వం ప్రకటనల పేరిట పబ్బం గడుపుకోవడం నిజంగా విడ్డూరం.

ఇదిలా ఉంటే.. గత పదేండ్లుగా టీఎస్ అని చలామణిలో ఉండగా దానిని పనిగట్టుకొని కాంగ్రెస్ సర్కార్ టీజీ అని మార్చి గొప్ప పాలనా సంస్కరణను ప్రవేశపెట్టింది. వాస్తవానికి టీజీ అని మార్చడం 'తెలంగాణ' అనే పదాన్ని విడదీయడమే. అప్పుల రాష్ట్రమని పదే పదే పేర్కొంటూనే దానికోసం అందుకు దాదాపు రూ.2,800 కోట్లు ఖర్చు చేసింది. ఇక గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయిన ప్రాజెక్టులను తామే నిర్మించినట్టు గొప్పగా ప్రకటనలు ఇచ్చుకొని ప్రారంభించి ఆడంబరాలు చేస్తున్నది.

ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి ప్రతిపక్ష శాసనసభ్యులను ఆకర్షించడానికే తమ శక్తియుక్తులను ధారపోస్తూ వారిని ఎన్ని కోట్లు పెట్టి కొనడానికైనా సిద్ధంగా ఉన్నారనే ప్రచారం నడుస్తున్నదంటే ఇది కాంగ్రెస్ బాధ్యతారాహిత్యం కాక మరేమవుతుంది? తమ ప్రభుత్వం ఎప్పుడు కూలిపోతుందోననే అభద్రతా భావం వారిని ఇంకా వెంటాడుతున్నది. అయితే, కాంగ్రెస్ నాయకులు ఒక విషయం మరిచిపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలను ఎవరూ కూల్చవలసిన అవసరం లేదు. తమకు తామే కూల్చుకునే గొప్ప సంస్కృతి ఆ పార్టీ సొంతమని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నా.

> **ఓ పక్క బజారులో తిరిగే కుక్కల వల్ల మనుషుల ప్రాణాలకు రక్షణ లేకుండాపోయింది. కుక్కకాటుకు చిన్నారుల ప్రాణాలు పోతుండటం శోచనీయం. మరోపక్క డెంగీ, విషజ్వరాలు ప్రజల ఆరోగ్యం తో ఆటలాడుకుంటున్నాయి. రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాల్సిన పరిస్థితులు నెలకొనడం దురదృష్టకరం. పాలనపై మంత్రులకు పట్టులేకపోవడమే ఇందుకు కార ణం. ఇక అనేక యాజమాన్యాల కింద నడుస్తున్న గురుకుల పాఠశాలల్లో మరణ ఘంటికలు మోగుతున్నాయి. ఇంతకాలం వాటికున్న ఆదరణ, గౌరవం ఇప్పుడు సన్నగిల్లాయనడంలో సందేహం లేదు.**

వరదలతో హైదరాబాద్ నగర జీవనం అస్తవ్యస్తమవుతున్నా మంత్రులు, అధికారులు నగరంలోని బస్తీలను పర్యటించే ప్రయత్నం చేయలేదు. మేమున్నామనే భరోసా వారికి కల్పించలేదు. కానీ, రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలకు హాజరుకావడం వారికి ప్రజల పట్ల ఉన్న ప్రేమను తెలియజేస్తున్నది. సోనియాగాంధీ కుటుంబం పట్ల కాంగ్రెస్ నాయకులు తమ భక్తిప్రపత్తులు చాటుకొని బానిసత్వాన్ని మరోసారి రుజువు చేసుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రులు, అధికారులు బస్తీలు పర్యటించి వరద బాధితులకు తోడుగా నిలవడాన్ని ఇప్పటికీ మరిచిపోలేం. కానీ, కాంగ్రెస్ పాలకులకు అవేమీ పట్టడం లేదు. పాలనానుభవం, యంత్రాంగంపై పట్టు లేకపోవడం ప్రతి విషయంలోనూ స్పష్టంగా కనిపిస్తోంది. మన కాంగ్రెస్ హీరోలు అభినవ నీరోలు అని నిరూపించారు.

రాష్ట్ర సచివాలయం వద్ద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకయైన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించకుండా రాష్ట్ర ఏర్పాటుకు సంబంధం లేని మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని నెలకొల్పాలనుకోవడం అవివేకం, అర్థ రహితం. తెలంగాణ ఉద్యమస్ఫూర్తి కొరవడిన వారు మాత్రమే ఆ విధంగా ప్రవర్తిస్తారు. రాష్ట్ర సాధనలో కీలక పాత్ర వహించి పదేండ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన నాయకుడిపై ముఖ్యమంత్రి రేవంత్ అవాకులు చెవాకులు పేలడం ఆక్షేపణీయం. కమ్యూనిస్టులకు కమిట్‌మెంట్ ఎక్కువ. తమతో ఎన్నికల ఒప్పందం కుదుర్చుకున్న పార్టీ ప్రభుత్వం ఎన్ని తప్పులు చేస్తున్నా వారు నోరు మెదపడం లేదు.


రాజులు శాశ్వతం కాదు. అట్లాగే రాజ్యం, ప్రభుత్వం కూడా శాశ్వతం కావు. కానీ, రాజు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలవాలి. ప్రతిష్ఠకు, పట్టింపులకు పోకూడదు. కేంద్ర ప్రభుత్వం ల్యాటరల్ ఎంట్రీపై విపక్షాల దాడితో యూటర్న్ తీసుకున్నది. సచివాలయం ఎదురుగా విగ్రహం విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించుకోవడం మంచిది. లేదంటే ప్రజాగ్రహాన్ని చవి చూడవలసి వస్తుంది. ఈ విషయమై అనేకమంది మేధావులు, కవులు, కళాకారులు, ప్రజా సంఘాలు కూడా పత్రికల ద్వారా తమ వినతిని, నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రజాహితమే పరమావధిగా ప్రభుత్వం పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

# ఈబీసీ రిజర్వేషన్లు సాధించాల్సిందే!

**2021లో జీవో నెంబర్ 33 ద్వారా అగ్రకుల పేదల(ఈడబ్ల్యూఎస్)కు తెలంగాణ ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం ఒకరికి మోదం మరొకరికి ఖేదం అన్నట్టయింది. తమిళనాడులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు కలిపి 69 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్టే.. తెలంగాణలోని ఈబీసీలకు కూడా రిజర్వేషన్లు వర్తింపజేయడం అత్యంత ఆవశ్యకం. కేంద్ర ప్రభుత్వంతో పోరాడి ఈబీసీ రిజర్వేషన్లను సాధించాల్సిన బాధ్యత కాంగ్రెస్ సర్కార్‌పైనే ఉన్నది.**



**యెనుగందుల శంకర్**
94407 47614



**103వ** రాజ్యాంగ సవరణ ద్వారా 2019 జనవరి 12న ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయి. లోక్‌సభలో 323 -3 ఓట్ల తేడాతో, రాజ్యసభలో 165 -7 తేడాతో ఈ బిల్లు ఆమోదం పొందింది. అయితే ఆ సమయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన పార్లమెంట్ సభ్యుల్లో ఒక్కరూ నోరు మెదపలేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15లో ఇప్పటికే ఉన్న 5 నిబంధనలకు అదనంగా మరో నిబంధనను చేర్చిన కేంద్రం ఎస్సీ, ఎస్టీ, బీసీలను వంచించింది. 15(6)ఏ లో ప్రస్తావించిన వర్గాలకు కాకుండా ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు తీసుకునే వెసులుబాటు దీని ద్వారా ప్రభుత్వానికి కలిగింది. నిబంధన (బీ) ప్రకారం.. ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ విద్యాసంస్థల్లో ఆర్థికంగా బలహీనవర్గాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాలి. 16(6)లో 4వ నిబంధనలో పేర్కొన్న వర్గాలకు కాకుండా అదనంగా ఈబీసీ వర్గాలకు కేటాయించాలని పేర్కొన్నారు. 16(4)లో ప్రభుత్వ ఉద్యోగాల్లో సరైన ప్రాతినిధ్యం లేని సామాజికవర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించాలని ఉంది. కానీ, కొత్త క్లాజులో ప్రభుత్వ ఉద్యోగాల్లో సరైన ప్రాతినిధ్యం లేని సామాజిక వర్గాలు అనే మాటను తొలగించారు.


రాజ్యాంగంలో 340 అధికరణం వెనుకబడిన తరగతులకు, 341 షెడ్యూల్డ్ కులాలకు, 342 షెడ్యూల్డ్ తెగలకు సంబంధించిన పరిస్థితులను అధ్యయనం చేయడానికి అవకాశం కల్పిస్తుంది. ఈ అధికరణంలో పేర్కొన్న వర్గాలకు మినహా మరే ఇతర వర్గాలకు రిజర్వేషన్ల హక్కు కల్పించడమంటే కులాన్ని శాశ్వతీకరించి అగ్రకులాలు మరింత ఉన్నతంగా వర్ధిల్లేందుకు తోడ్పడటమే. సామాజిక వెనుకబాటుతనాన్ని రూపుమాపి సమానత్వాన్ని సాధించడానికి ఎన్నుకున్న మార్గమే రిజర్వేషన్లు. కులాల మధ్య ఉన్న సామాజిక అసమానతలను తొలగించడానికి సామాజికంగా వెనుకబడిన వర్గాలకు మన రాజ్యాంగం రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. అంతేతప్ప, ఆర్థిక వెనుకబాటుతనానికి కాదు. ఆర్థిక వెనుకబాటుతనాన్ని రూపుమాపాలంటే సంక్షేమ పథకాలు అమలు చేయాలి. రిజర్వేషన్లు అనేవి ఒక సంక్షేమ పథకం కాదు.

1953 జనవరి 20న కాకా కాలేల్కర్ నేతృత్వంలో 11 మంది సభ్యులతో కూడిన కమిషన్‌ను అప్పటి రాష్ట్రపతి నియమించారు. ప్రభుత్వానికి ఈ కమిషన్ పలు సూచనలు చేసింది. దేశంలోని ఏ వర్గానికి చెందినవారైనా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయా వర్గాలను నిర్ధారించడం, ఆయా వర్గాల జాబితాను తయారు చేయడం. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన సామాజికవర్గాల జీవన స్థితిగతులను, వారి సమస్యలను అర్థం చేసుకొని ఆ స్థితిగతులను మెరుగుపరచడానికి అవసరమైన చర్యలను సూచించడం. సైన్స్, ఇంజినీరింగ్, మెడిసిన్, అగ్రికల్చర్, వెటర్నరీ, ఇతర టెక్నికల్ కోర్సులు, సంబంధిత విద్యాసంస్థల్లో వెనుకబడిన వర్గాలకు 70 శాతం రిజర్వేషన్లు కల్పించడం. సీట్ల కేటాయింపుల్లో అత్యంత వెనుకబడినవర్గాల పిల్లలకు ముందు ప్రాధాన్యత ఇవ్వడం. ప్రభుత్వ ఉద్యోగాలనేవి ప్రజలకు ఒక రకమైన సామాజిక హోదా, గుర్తింపు, విలువ, అధికారం, వేతనాలు, ఆర్థిక, ఉద్యోగపరమైన భద్రత కల్పిస్తాయి. కాబట్టి, వారికి రిజర్వేషన్లు కల్పించడం. స్థానిక సంస్థల సర్వీసుల్లో వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు ఉండాలని కమిషన్ సూచించింది. ఈ కమిషన్ తన నివేదికను 1955 మార్చి 30న నాటి రాష్ట్రపతికి సమర్పించింది. ఆ తర్వాత వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల కోసం రెండో కమిషన్ ఏర్పాటైంది.

1979లో అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్ నేతృత్వంలోని జనతా ప్రభుత్వం మండల్ కమిషన్‌ను నియమించింది. సాంఘిక, ఆర్థిక, విద్యాపరమైన 11 సూచికల ఆధారంగా వెనుకబాటుతనాన్ని మధించేందుకు పనిచేసిన ఈ కమిటీకి బీపీ మండల్ నేతృత్వం వహించారు. 1980 డిసెంబరు 31 నాటికి మండల్ కమిషన్ తన నివేదికను సమర్పించింది. కులం, ఆర్థిక, సామాజిక అంశాల ఆధారంగా 1980 నాటికి దేశ జనాభాలో 52 శాతం మంది ఓబీసీలు (ఇతర వెనుకబడ్డ కులాలు) ఉన్నట్టు గుర్తించింది. ఓబీసీలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ, పబ్లిక్ సెక్టార్ సంస్థల్లోనూ 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మండల్ కమిషన్ సిఫారసు చేసింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు ఈ 27 శాతాన్ని కలిపితే మొత్తం రిజర్వేషన్లు 49 శాతానికి చేరతాయి.

10 శాతం అగ్రకుల రిజర్వేషన్ల విషయం కనుమరుగు కావడానికే ప్రస్తుతం ఓబీసీ వర్గీకరణను కేంద్రం తెరపైకి తీసుకొచ్చింది. 56 శాతం మంది ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలవుతున్నాయి. ఈ నేపథ్యంలో 'మేమెంతో మాకంతా' నినాదంతో రిజర్వేషన్ ఉద్యమం మళ్లీ ఉవ్వెత్తున ఎగిసిపడటం తథ్యం.

**10 శాతం అగ్రకుల రిజర్వేషన్ల విషయం కనుమరుగు కావడానికే ప్రస్తుతం ఓబీసీ వర్గీకరణను కేంద్రం తెరపైకి తీసుకొచ్చింది. 56 శాతం మంది ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలవుతున్నాయి. ఈ నేపథ్యంలో 'మేమెంతో మాకంతా' నినాదంతో రిజర్వేషన్ ఉద్యమం మళ్లీ ఉవ్వెత్తున ఎగిసిపడటం తథ్యం.**




## ఎఫ్ఐఆర్‌లో వాళ్ల పేర్లు కూడా చేర్చాలి!



**ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ తయారీ కాంట్రాక్ట్‌ను తన కుమారుడు, ఎంపీ శ్రీకాంత్ షిండే స్నేహితుడైన జైదీప్ ఆప్టేకు సీఎం ఏక్‌నాథ్ షిండే కట్టబెట్టారు. ఆప్టే వయస్సు 24 ఏండ్లు మాత్రమే. అలాంటి భారీ విగ్రహాలు తయారు చేయడంలో అతనికి అనుభవమే లేదు. సీఎం ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎం ఫడ్నవీస్, పీడబ్ల్యూడీ మంత్రి పేర్లను కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చాలి.**

*- ప్రియాంక చతుర్వేది, శివసేన (యూబీటీ) ఎంపీ*